Pubilshed from vijayawada

PRGI NO : APTEL/2011/41440

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 | సంచిక : 188 | సోమవారం | నవంబర్ 2, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 15 | Issue No : 188 | MONDAY | 2 NOVEMBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

పులివెందులలో పట్టపగలు
ప్రజాస్వామ్యం ఖూనీ

- మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ బరితెగింపు
- తెల్లవారుజాము నుంచేపోలింగ్ బూత్‌ల స్వాధీనం
- పోలింగ్ బూత్‌ల నుంచి వైయస్సార్‌సీపీ ఏజెంట్ల గెంటివేత
- 70 బూత్‌ల నుంచి వైయస్సార్‌సీపీ ఏజెంట్ల తరిమివేత
- కేవలం 10 బూత్‌లలో మాత్రమే వైయస్సార్‌సీపీ ఏజెంట్లు
- మరి ఇదేనా ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల ప్రక్రియ?
- వైయస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకులపై దాడి
- ఎక్కడిక్కడ యథేచ్ఛగా రిగ్గింగ్. పోలీసుల చోద్యం
- అధికారులకు తెలిసే ఇదంతా జరుగుతోంది
- అలా ఇప్పుడు ఒక తప్పుడు సంప్రదాయం మొదలు
- రేపు అదే కొనసాగింపు
- భవిష్యత్తులో ఎన్నికలు ఉండవు
- వైసీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్



ప్రజాభూమి ప్రతినిధి, పులివెందుల

స్థానిక ఎన్నికల్లో మున్సిపల్ పోల్ సందర్భంగా పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. పులివెందులలో బరి తెగించిన టీడీపీ తెల్లవారుజాము నుంచే పోలింగ్ బూత్‌లు స్వాధీనం చేసుకుందని, పట్టణంలో మొత్తం 80 బూత్‌లో ఉంటే, ఏకంగా 70 బూత్‌ల నుంచి వైయస్సార్‌సీపీ ఏజెంట్లను తరిమేశారని ఆయన వెల్లడించారు. వారందరినీ స్వయంగా మీడియాకు చూపిన ఆయన, ఆ తర్వాత ఆర్ఓ వద్దకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పులివెందులలో ఇన్ని అరాచకాలు జరుగుతున్నాయి కాబట్టి, ఇక్కడ రీపోలింగ్ జరపాలని వైయస్ జగన్ డిమాండ్ చేశారు. ఇంత అప్రజాస్వామికంగా జరిగే ఎన్నికలు.. అసలు ఎన్నికలేనా? అని వైయస్ జగన్ గట్టిగా నిలదీశారు.

మీడియా ప్రశ్నలకు బదులిస్తూ మాట్లాడిన వైయస్ జగన్ ఇంకా ఏమన్నారంటే" రాష్ట్రంలో పట్టపగలే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. అధికార పార్టీ యథేచ్ఛగా రిగ్గింగ్ చేస్తోంది. పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లు ఉంటే, వాటిలో 70 బూత్‌లలో వైయస్సార్‌సీపీ ఏజెంట్లను తరిమేశారు. ఇప్పుడు వారందరినీ పులివెందుల ఆర్ఓ దగ్గరికి తీసుకెళ్తున్నా. అసలు మా పార్టీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని నిలదీయబోతున్నాను. వీటన్నింటి నేపథ్యంలో పులివెందులలో రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేయబోతున్నాను.

ఫోటోలు పేజీలో



రాష్ట్రానికి పొంచి ఉన్న మరో తుఫాను ముప్పు

- తుఫాను ప్రభావంపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- సహాయక చర్యలకు సన్నద్ధం కావాలని అధికార యంత్రాంగానికి ఆదేశం

2 పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

రాష్ట్రానికి మరో తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.



రీపోలింగ్ నిర్వహిస్తేనే వచ్చి ఓటు వేస్తా

- రాష్ట్రంలో ఇప్పుడు ఓటేసే పరిస్థితి అస్సలు లేదు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న చంద్రబాబు
- ప్రభుత్వం, ఎస్ఈసీ, పోలీసులు అంతా కుమ్మక్కు
- ఇప్పుడు ఓటేస్తే అంతా సవ్యంగా ఉందని ఒప్పుకున్నట్లే
- అందుకే ఓటు వేయవద్దని నిర్ణయం తీసుకున్నాను
- వైసిపి అధినేత వైయస్ జగన్

ప్రజాభూమి ప్రతినిధి, పులివెందుల

మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పులివెందుల వచ్చిన వైయస్ జగన్, అక్కడ టీడీపీ అరాచకాలు, విపక్ష వైయస్సార్‌సీపీపై దాడులు, ఏకంగా 70 పోలింగ్ బూత్‌ల నుంచి పార్టీ ఏజెంట్ల గెంటివేత, యథేచ్ఛగా టీడీపీ పోలింగ్ బూత్‌లు స్వాధీనం చేసుకోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఓటు వేసేది లేదన్న ఆయన, అన్నింటిపై ఫిర్యాదు చేస్తూ, ఆర్ఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. పులివెందులలో రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేసిన వైయస్ జగన్, అప్పుడే తాను ఓటు వేస్తానని ప్రకటించారు.



సీసీ కెమెరాల వెబ్‌కాస్టింగ్
పరిశీలన

వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ, కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన 13,500 సీసీ కెమెరాల వెబ్‌కాస్టింగ్ పనితీరును రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును వారు ప్రత్యక్షంగా వీక్షించారు. కెమెరాల ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను ఎలా పర్యవేక్షిస్తున్నారు, వెబ్‌కాస్టింగ్ వ్యవస్థ ఏ విధంగా

వివరాలు 2లో..



పులివెందులలో పోలింగ్ ఏజెంట్లను ఎవరూ అడ్డుకోలేదు

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి
- హెలికాప్టర్ అనుమతులపై ఎలాంటి గందరగోళం లేదు
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు

లోపల పేజీలో



నవంబర్ 1న ప్రజాస్వామ్యానికి చీకటి రోజు!

- మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలు, దాడులతో బరితెగించిన కూటమి ప్రభుత్వం
- ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వైఫల్యం
- వైయస్ఆర్‌సీపీ నేతల ఆగ్రహం

లోపల పేజీలో

- పేదలు, దళితులు, ఆదివాసీలు, మహిళలపై కక్ష పెంచుకున్న ప్రధానమంత్రి
- మోదీని గద్దె దించేవరకు విశ్రమించం...
- కాంగ్రెస్ శ్రేణులను ఢిల్లీకి రాకుండా అడ్డుకోలేకపోయారు..
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- తెలంగాణ నుంచి వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

20 కోట్ల ఓట్లు తొలగించేందుకు కుట్ర



ప్రజాభూమి ప్రతినిధి, ఢిల్లీ

కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 2024 ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని, దళితులు, గిరిజనులు, మహిళల ఓట్ల తొలగించాలని భావించారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీకి 400 సీట్లు దాటితే రాజ్యాంగం ద్వారా వచ్చిన ఓటు హక్కును తొలగిస్తారని ప్రజలు ఆ సంఖ్యను ఇవ్వకపోవడంతో పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలపై కక్ష

2 పేజీలో..



ప్రజాస్వామ్యం గురించి జగన్ రెడ్డి నీతులు చెబుతున్నారు

- ప్రజాప్రభుత్వంలో పారదర్శకంగా స్థానిక ఎన్నికలు
- ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల మాకు విశ్వాసం ఉంది
- జగన్ రెడ్డి తీరువల్లే పులివెందులలో శాంతిభద్రతల సమస్య
- బ్రెంగకూరులో మీడియా సమావేశంలో మంత్రి లోకేష్

2 లో

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

- ఫిర్యాదులపై తక్షణ చర్యలు
- విజయవాడలోని 55వ వార్డులో రెండున్నర గంటల పాటు పోలింగ్ గడువు పొడిగింపు
- 12 జిల్లాల కలెక్టర్లతో సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ
- ఫిర్యాదులపై విచారణ.. ఆధారాలుంటే ఎఫ్ఐఆర్‌లు, నిందితుల అరెస్టులు

2 లో..



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

రాష్ట్రంలో ఆదివారం జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మెజారిటీ ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున, ఐజీ రాజకుమారి లతో కలిసి ఆదివారం నిర్వహించిన మీడియా

మిగతా 2లో..



పులివెందుల పులి పిరికిపందలా పారిపోయారు


మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2 లో

రాష్ట్రాన్ని వీడని తుఫాన్లు

- ఆర్నాబ్ నుండి కోలుకోక ముందే మురుసు
- వరుస వాయుగుండలు ప్రజలకు తప్పని నీటి గండాలు

- మిగతా 2లో..



ప్రజాభూమి

సోమవారం 2 నవంబర్ 2026

సంపాదకీయం

ఎదురుదెబ్బ!?

దేశ రాజకీయాల్లో తమకు తిరుగులేదని గొప్పలు చెబుతున్న బిజెపికి ఇటీవల 4 రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి ఎన్నికల ఫలితాలు ఓ ఎదురుదెబ్బ. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కేంద్రమైన, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీల సొంతగడ్డ నాగపూర్‌లో ఎదురైన ఓటమి కాషాయ పెద్దలకు మింగుడుపడటం లేదు. ఈ పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానాన్ని కాంగ్రెస్ వరుసగా రెండోసారి నిలబెట్టుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 1994 నుంచి 2014 వరకు ఏకబిగిన గడ్కరీ ప్రాతినిధ్యం వహించిన స్థానమిది. సంఘ్ పరివార్ కంచుకోటలో కథ మారుతోందని విశ్లేషకులు అంటున్నారు.? నాలుగు రాష్ట్రాల్లో 28 శాసనమండలి స్థానాలకు (ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు) జరిగిన ఈ ఎన్నికల్లో విద్యావంతులు ఓటు వేశారు. మొత్తం 28 స్థానాల్లో బిజెపికి కేవలం 13 మాత్రమే దక్కాయి. పాలకపక్షం కీలక స్థానాల్లో దెబ్బతిన్నది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో ఉపాధ్యాయ, పట్టభద్రుల రెండు స్థానాలనూ సమాజ్‌వాదీ పార్టీ నిలబెట్టుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇదే నియోజకవర్గంలో మోడీ తొలి రౌండ్లలో వెనుకబడిన విషయాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఫలితాలు వెలువడుతున్న వేళ ప్రధాని తన స్థాయిని మరచి బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వచ్చాయో తెలుసా అంటూ ఎద్దేవా చేశారు. కానీ మరుసటి రోజు తెల్లవారుజామునే నాగపూర్ ఫలితం కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడంతో ఆ వ్యాఖ్య బెడిసికొట్టింది. దానికి స్పందనగా ఫడ్నవీస్ కూడా 'ఎక్స్'లో చేసిన పోస్టును తొలగించాల్సి వచ్చింది. వారణాసి, లక్నో, ఆగ్రాల నుంచి నాగపూర్ వరకు ఓటమికి కారణాలపై బిజెపిలో అంతర్మథనం మొదలైంది.? యోగి జమానా ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫైజాబాద్‌లో కేవలం 307 ఓట్లతో బిజెపి గట్టెక్కింది. మహారాష్ట్ర ఎంఎల్‌సి ఫలితాలు మహాయుతి కూటమిలో చిచ్చును రాజేశాయి. బిజెపి, శివసేన (ఏక్‌నాథ్ షిండే) పార్టీలు పరస్పరం నిందించుకుంటున్నాయి. కూటమి ధర్మాన్ని పాటించలేదంటూ బిజెపి, పూర్తిగా సహకరించలేదని శివసేన వాదించుకున్నాయి. పూణె ఉపాధ్యాయుల నియోజకవర్గంలో చివరి నిమిషంలో స్వతంత్ర అభ్యర్థికి ఆ పార్టీ మద్దతివ్వడం దెబ్బతీసిందని చెబుతోంది. ఏక్‌నాథ్ షిండే సహకరించనందుకే ఓడిపోయామంటూ దీర్ఘాలు తీస్తోంది. దీంతో పొత్తు ఉండాలా? వద్దా? తేల్చుకోవాలంటూ నేతలు తేల్చిచెప్పడం గమనార్హం. అయితే, 288 సీట్ల అసెంబ్లీలో బిజెపికి 132 మంది ఎమ్మెల్యేలుంటే, మెజారిటీకి 145 మంది కావాలి, ప్రభుత్వం కొనసాగాలంటే మిత్రుల మద్దతు లేకుండా ప్రభుత్వం నడవడం సాధ్యం కాదు. అంతకుమించి బీహార్ మోడల్‌ను ఉటంకిస్తూ ఏక్‌నాథ్ షిండేను మహారాష్ట్ర సిఎం చేయాలంటూ కొత్త వాదన తెస్తున్నారు. దీంతో కొలిమంటుకుపోతుందని బిజెపి నాయకత్వం నిట్టూరుస్తోంది. ఇదిలా ఉంటే, డబ్బుదస్కం, నగానట్రా వంటి ఎన్ని ప్రలోభాల వల విసిరినా మహాయుతి కూటమి విద్యావంతుల విశ్వాసాన్ని పొందలేకపోయిందనేది విశ్లేషకుల మాట.? బీహార్‌లోని దర్భంగా పట్టభద్రుల స్థానంలో నాటకీయ పరిణామాలు జరిగాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో వెనుకబడిన ఆర్‌జెడి అభ్యర్థి అనిల్ కుమార్ ఝా, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 450 ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థిని ఓడించారు. బిజెపి సంబరాలు మొదలుపెట్టిన తర్వాతే ఈ ఫలితం వచ్చింది. ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ, దర్భంగా ఉపాధ్యాయ స్థానంలో కాంగ్రెస్ సిటింగ్ ఎంఎల్‌సిని ఓడించడంతో పాటలీపుత్రలో రాజకీయాలు వేడెక్కాయి. కర్ణాటకలో బిజెపి-జెడిఎస్ కూటమి నాలుగు స్థానాలనూ గెలుచుకుంది.

20 కోట్ల ఓట్లు తొలగించేందుకు కుట్ర

ప్రజాభూమి ప్రతినిధి – ఢిల్లీ

కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 2024 ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని, దళితులు, గిరిజనులు, మహిళల ఓట్ల తొలగించాలని భావించారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీకి 400 సీట్లు దాటితే రాజ్యాంగం ద్వారా వచ్చిన ఓటు హక్కును తొలగిస్తారని ప్రజలు ఆ సంఖ్యను ఇవ్వకపోవడంతో పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలపై కక్ష పెంచుకున్న ముఖ్యమంత్రి ఓటు హక్కు తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఓటు బచావో... దేశ్ బచావో పేరుతో ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. రాష్ట్రం నుంచి వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రితో కరచలనానికి పోటీ పడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశంలోని ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించారని, కానీ ఆ ఓటు హక్కును తొలగించేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అడ్డుపెట్టుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, 20 కోట్ల ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మొత్తం ఓట్లలో 15 నుంచి 20 శాతం ఓట్లు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రయోగాత్మకంగా ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ ఇప్పటికే బీహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిందని, ఢిల్లీలోనూ మరోసారి అలానే అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతున్నారని సీఎం అన్నారు. ఈ కుట్రను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాంలీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాహుల్ గాంధీ నిర్ణయించారని తెలిపారు. సభకు తెలంగాణ నుంచి 15 వేల మంది వచ్చేలా పీసీసీ ఆధ్వర్యంలో రైళ్లు ఏర్పాటు చేస్తే, ఆఖరి నిమిషం వరకు నమ్మించి చివర్లో రైళ్లు రద్దు చేసి కార్యకర్తలు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైళ్లు ఇవ్వకపోయినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా ఢిల్లీ వచ్చారని, నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ కార్యకర్తల సంకల్పాన్ని అడ్డుకోలేకపోయారని అన్నారు. తెలంగాణ బలం ముందు, తెలంగాణ గళం ముందు మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ తలవంచక తప్పలేదని సీఎం అన్నారు. రాంలీలా మైదాన్ లో ఇండియా కూటమి నేతలు ఇచ్చే సందేశాన్ని ప్రతి గ్రామానికి, ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సీఎం సూచించారు. తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసానికి చేరుకున్నారు. అక్కడి నుంచి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నేతలు ఫరూఖ్ అబ్దుల్లా, అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ, తేజస్వీ యాదవ్, మెహబూబా ముఫ్తీ, సంజయ్ రౌత్ లతో కలిసి ఓపెన్ టాప్ జీపులో రాంలీలా మైదాన్‌కు తరలివెళ్లారు. ర్యాలీలోనూ అంతకుముందు తెలంగాణ భవన్‌లోనూ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రితో సెల్ఫీలు దిగేందుకు, కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు.

రాష్ట్రానికి పొంచి ఉన్న

మరో తుఫాను ముప్పు

రాష్ట్రానికి పొంచి ఉన్న మరో తుఫాను ముప్పు తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్రంపై తుఫాను ప్రభావం, వర్షాలు, గాలుల తీవ్రత, జలాశయాల నిర్వహణ అంశాలతో పాటు వివిధ శాఖలు చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణపై సమీక్షించారు. తుఫాను సహాయక చర్యలపై అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాను ముప్పు నెలకొనడంతో సోమవారం నాటి తన ఢిల్లీ పర్యటనను కూడా రద్దు చేసుకున్నట్టు సీఎం తెలిపారు.

నవంబర్ 3న తీరం దాటే అవకాశం

ప్రస్తుత వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా, అనంతరం తుఫానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నవంబర్ 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని, నవంబర్ 3వ తేదీ ఉదయం బాపట్ల సమీపంలో తీవ్ర తుఫానుగా తీరం దాటొచ్చని తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 100--110 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. తుఫాన్ కారణంగా నవంబర్ 2న దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, అక్కడక్కడ అతి భారీ వర్షాలు... అలాగే, నవంబర్ 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అత్యంత భారీ వర్షాల అంచనా ఉన్న 20 మండలాల్లో ఏలూరు జిల్లాలో 9, కృష్ణా జిల్లాలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో ఒకటి ఉన్నాయన్నారు. నవంబర్ 3న జిల్లాల వారీగా అంచనా వేసిన సగటు వర్షపాతం వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఏలూరు జిల్లాలో సుమారు 179 మిల్లీమీటర్లు, కృష్ణా జిల్లాలో 163 మి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో 161 మి.మీ., పశ్చిమ గోదావరి జిల్లాలో 147 మి.మీ., గుంటూరు జిల్లాలో 119 మి.మీ., బాపట్ల జిల్లాలో 104 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. బుడమేరు సహా పలు చోట్ల వరద ముప్పు భారీ వర్షాల నేపథ్యంలో బుడమేరు దగ్గర నవంబర్ 3న సుమారు 32,500 క్యూసెక్కుల ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఎర్రకాల్వ, గోనెలవాగు, జల్లేరు, పంపా తదితర జలాశయాల్లో కూడా భారీ వరద వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను ప్రభావంతో బలమైన గాలులు వీచడం వల్ల 12 జిల్లాల్లో సుమారు 12,102 నుంచి 15,128 విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు అవసరమైన మానవ వనరులు, పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి అవసరమైన సిబ్బందిని, సామగ్రిని ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ స్తంభాలు పడిపోయిన సందర్భాల్లో ఎన్ని గంటల్లో పునరుద్ధరణ చేపట్టగలుగుతాం, ఎప్పటిలోగా విద్యుత్ సరఫరా అందించగలుగుతామనే విషయంపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమాచారాన్ని ప్రజలకు కూడా తెలియజేసే పరిస్థితి ఉండాలని సూచించారు.

ప్రతి 4 గంటలకు తుఫాను పరిస్థితిపై బులెటిన్

తుఫాను ప్రభావంపై ప్రతి నాలుగు గంటలకు ఒకసారి బులెటిన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టెలికాం నెట్‌వర్క్ సంస్థలు ముందస్తు చర్యలు తీసుకుని మొబైల్ సిగ్నల్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సంస్థలను ముందుగానే అప్రమత్తం చేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అర్నబ్ తుఫాను సమయంలో నెట్‌వర్క్ సంస్థలు మరింత ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ఉంటే బాగుండేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో అర్నబ్ తుఫాను వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై ముఖ్యమంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు రాత్రికి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్..



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

రాష్ట్రంలో ఆదివారం జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మెజారిటీ ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున, ఐజీ రాజకుమారిలతో కలిసి ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, డీఐజీలు, ఎన్నికల పరిశీలకులతో ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పోలీస్ శాఖ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

12 జిల్లాల కలెక్టర్లతో సమీక్ష

పోలింగ్ సరళి, ఫిర్యాదులు, హింసాత్మక ఘటనలపై నంద్యాల, కడప, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లతో సుమారు 45 నిమిషాల పాటు మాట్లాడినట్లు కమిషనర్ తెలిపారు. మెజారిటీ జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నట్లు కలెక్టర్లు నివేదించారని, కొన్ని జిల్లాల్లో స్వల్ప స్థాయిలో ఫిర్యాదులు అందినట్లు వివరించారని చెప్పారు. కొన్ని జిల్లాల్లో ఎలాంటి ఫిర్యాదులు, హింసాత్మక ఘటనలు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

విజయవాడ 55వ వార్డులో పోలింగ్ గడువు పొడిగింపు

విజయవాడలోని 55 వ వార్డులో సాంకేతిక, ఇతర కారణాలతో సుమారు రెండున్నర గంటల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైన నేపథ్యంలో, ఓటర్లకు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు పొడిగించినట్లు అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. జిల్లా కలెక్టర్ చేసిన అభ్యర్థనను పరిశీలించి, ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైన కారణంగా ఓటర్లు నష్టపోకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పించినట్లు వివరించారు.

ఫిర్యాదులపై నివేదికల ఆధారంగా చర్యలు

పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని ఘటనలు జరిగినట్లు జిల్లా కలెక్టర్లు తమ దృష్టికి తీసుకొచ్చారని కమిషనర్ తెలిపారు. పోలింగ్ పూర్తయిన అనంతరం అందే ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీవో) నివేదికలు, ఇతర ఆధారాలను పరిశీలించి, ఫిర్యాదుల్లో వాస్తవాలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడలోని 55వ వార్డులో పోలింగ్ సమయాన్ని పొడిగించిన అంశం మినహా, మిగిలిన ప్రాంతాల నుంచి పెద్దగా సమస్యలు నివేదించబడలేదని తెలిపారు.

3 గంటల వరకు 48.03 శాతం పోలింగ్ నమోదు

మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లాల నుంచి అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం 48.03 శాతం పోలింగ్ నమోదైనట్లు కమిషనర్ వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రితో రిసెప్షన్ కేంద్రాలకు చేరుకుంటారని తెలిపారు. పోలింగ్ స్టేషన్ వారీగా నమోదైన ఓట్ల వివరాలను పరిశీలించి, మొత్తం ఓటింగ్ శాతాన్ని లెక్కిస్తారని చెప్పారు. ప్రస్తుతం అందిన సమాచారం ప్రాథమిక అంచనా మాత్రమేనని, రిసెప్షన్ కేంద్రాల నుంచి పూర్తి వివరాలు అందిన అనంతరం సోమవారం నాటికి కచ్చితమైన పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఐజీ రాజకుమారి మాట్లాడుతూ.. ఆదివారం జరిగిన పోలింగ్ సందర్భంగా సుమారు 40 ఘటనలు నమోదైనట్లు, 275 ఎఫ్ఐఆర్ లు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, నేరపూరిత అంశాలు ఉన్నట్లు గుర్తించిన కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఫిర్యాదులను స్వీకరించి, వాటిపై విచారణ చేపట్టామని, తదుపరి దర్యాప్తులో నిందితులను గుర్తించి అరెస్టులు కూడా చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ప్రతి ఘటనను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సీసీ కెమెరాల వెబ్‌కాస్టింగ్ పరిశీలన

పనిచేస్తోంది అనే అంశాలను మీడియా కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,500 సీసీ సీసీ కెమెరాలను ఏయే జిల్లాల్లో, ఎన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు, వాటి ద్వారా ఎన్నికల ప్రక్రియను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే వివరాలను అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడం, పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి కీలక పరిణామాన్ని నిరంతరం పర్యవేక్షించడం, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండేందుకు ఈ వెబ్‌కాస్టింగ్ వ్యవస్థను వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు.

రీపోలింగ్ నిర్వహిస్తేనే వచ్చి ఓటు వేస్తా

మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పులివెందుల వచ్చిన వైయస్ జగన్, అక్కడ టీడీపీ అరాచకాలు, విపక్ష వైయస్సార్‌సీపీపై దాడులు, ఏకంగా 70 పోలింగ్ బూత్‌ల నుంచి పార్టీ ఏజెంట్ల గెంటివేత, యథేచ్ఛగా టీడీపీ పోలింగ్ బూత్‌లు స్వాధీనం చేసుకోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఓటు వేసేది లేదన్న ఆయన, అన్నింటిపై ఫిర్యాదు చేస్తూ, ఆర్‌ఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. పులివెందులలో రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేసిన వైయస్ జగన్, అప్పుడే తాను ఓటు వేస్తానని ప్రకటించారు. పులివెందులలో ఇప్పుడు ఓటు వేయొద్దన్న నిర్ణయం తర్వాత మీడియాతో మాట్లాడిన వైయస్ జగన్, ఇంకా ఏమన్నారంటే." ఇప్పుడు నేను ఓటు వేస్తే, ఎన్నికల ప్రక్రియ అంతా బాగున్నట్లు ఒప్పుకున్నట్టే. అందుకే నా ఓటు వేయకుండా, ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందన్న విషయాన్ని అందరికీ చెప్పాలనుకుంటున్నాను. మేము అడిగినట్లుగా ఇక్కడ రీపోలింగ్ పెడితే.. న్యాయం, ధర్మం అనేది ఒకటి బ్రతికి ఉండి.. మనస్సాక్షి అనేది ఒకటి బ్రతికి ఉండి.. వాటికి అనుగుణంగా రీపోలింగ్‌కు ఆదేశిస్తే, అప్పుడు వచ్చి కచ్చితంగా ఓటు వేస్తాను. ఎన్నికల ప్రక్రియ, వ్యవస్థ మొత్తం దిగజారిపోయినప్పుడు, అంతా బాగుందని ఒప్పుకోవడం ఏ మాత్రం సరికాదు. ఈ ఎన్నికల్లో జరుగుతున్న దారుణాలన్నింటిపై తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తాము. న్యాయపోరాటం కూడా చేస్తాము. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఈ పరిస్థితి కచ్చితంగా మారాల్సి ఉంది. ఇక్కడ ఏం జరుగుతోంది అనేది ఒక్కసారి చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. ఈరోజు ఇక్కడ నామినేషన్ హక్కు, ఓటు హక్కు పోతోంది. ఇప్పుడు మనం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేకపోతే.. రేపు పొద్దున కూడా ప్రజాస్వామ్య వ్యవస్థ ఇలాగే ఉంటే.. ఆస్తి హక్కులు కూడా ప్రజలకు లేకుండా పోతాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మొదలు, ఆర్‌ఓలు, కలెక్టర్లు, ఎస్పీలు అంతా దురదృష్టవశాత్తూ చంద్రబాబునాయుడు చేతిలో తోలుబొమ్మలుగా మారారు. ఇది వ్యవస్థలో ఉన్న ఒక పెద్ద లోపం. ఎప్పుడైతే ఎస్ఈసీ ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా, ఏ ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా పని చేయడం మొదలు పెడుతుందో, అప్పుడు ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా ఉంటుంది. మేము అధికారంలో ఉన్నప్పుడు నిమ్మగడ్డ రమేష్ ఎస్ఈసీగా ఉన్నాడు. ఆయన్ను అంతకు ముందు చంద్రబాబునాయుడుగారు నియమించారు. ఆయన ఆధ్వర్యంలో మేము ఎన్నికలకు పోయాం కాబట్టే, అప్పుడు కూడా చంద్రబాబునాయుడు కోరుకున్నట్లుగా ఎన్నికలు జరిగాయి. మాకు నచ్చినా, నచ్చకపోయినా.. అధికారులందరినీ ఇష్టారాజ్యంగా ఎన్నికల విధుల నుంచి తప్పించారు. అది మంచో, చెడో అన్నది పక్కన పెడితే అప్పుడు చంద్రబాబునాయుడు మాత్రం బాగా తృప్తి చెందారు. నాడు చంద్రబాబునాయుడు తన స్వార్థం, ప్రయోజనాల కోసం తన వీరాభిమాని అయిన వ్యక్తిని ఎస్ఈసీగా నియమించారు. అక్కడి నుంచే వ్యవస్థ దిగజారిపోయింది. ఇప్పుడు మిగతా వాళ్లంతా కూడా చంద్రబాబునాయుడుగారి చేతిలో తోలుబొమ్మలు కాబట్టి, ఈ వ్యవస్థ అంతకంతకూ దిగజారి కుప్పకూలుతోందని వైయస్ జగన్ అన్నారు.

పులివెందులలో పోలింగ్ ఏజెంట్లను ఎవరూ అడ్డుకోలేదు...!

ప్రజాభూమి ప్రతినిధి,కడప

జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతోందని, పులివెందులలో పోలింగ్ ఏజెంట్లను ఎక్కడా అడ్డుకోలేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా లతో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ అనుమతులు, పులివెందులలో పోలింగ్ ఏజెంట్లకు సంబంధించిన అంశాలపై వస్తున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకే పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతి ఇచ్చాం..

మాజీ ముఖ్యమంత్రి హెలికాప్టర్ పులివెందులకు చేరుకునే సమయంపై తొలుత మధ్యాహ్నం ఒంటి గంటగా సమాచారం అందిందని కలెక్టర్ తెలిపారు. దీనికి అనుగుణంగా ఈ నెల 27వ తేదీనే హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతి ఇచ్చామని, జెడ్ ప్లస్ భద్రత ఉన్నందున ఎస్పీ ఆధ్వర్యంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేశారని వివరించారు. అయితే ఆదివారం ఉదయం ఆకస్మికంగా ఉదయం 10 గంటల సమయంలో హెలికాప్టర్ చేరుకుంటుందని సమాచారం వచ్చిందన్నారు. అదే సమయంలో పులివెందుల ప్రాంతంలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితుల దృష్ట్యా ఎస్పీ సూచన మేరకు తొలుత మధ్యాహ్నం 3 గంటలకు ల్యాండింగ్‌కు అనుమతించినట్లు తెలిపారు. అయితే అప్పటికే హెలికాప్టర్ గాలిలోకి ఎగిరినట్లు ఆపరేటర్ నుంచి సమాచారం రావడంతో, ప్రయాణానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉదయం 9.45 గంటలకు ల్యాండింగ్‌కు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. హెలికాప్టర్ గాలిలోకి ఎగిరిన తర్వాత తిరిగి వెళ్లాలని లేదా వేరే ప్రాంతానికి మళ్లించాలని ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, ఈ విషయంలో ఎలాంటి గందరగోళం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

పులివెందులలో 47 మంది పోలింగ్ ఏజెంట్ల నమోదు...

పులివెందులలో పోలింగ్ ఏజెంట్లను అనుమతించలేదన్న ప్రచారంలో వాస్తవం లేదని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకల్లా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, అభ్యర్థులు ఇచ్చిన అనుమతి పత్రం, గుర్తింపు కార్డు, ఛాయాచిత్రాన్ని సమర్పించి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. అధికారులకు అందిన సమాచారం ప్రకారం పులివెందులలోని మొత్తం 80 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 47 మంది పోలింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటలలోపే నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారని తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య కొంతమంది ఏజెంట్లు వివిధ కారణాలతో పోలింగ్ కేంద్రాలను విడిచివెళ్లినట్లు సమాచారం ఉందన్నారు. మరికొందరు తమ విధుల్లో కొనసాగినట్లు తెలిపారు. ఏ ఒక్క పోలింగ్ ఏజెంట్‌ను గానీ, అభ్యర్థులు అనుమతించిన ప్రతినిధులను గానీ అధికారులు అడ్డుకోలేదని స్పష్టం చేశారు.

వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా..

పులివెందులలోని అన్ని పోలింగ్ కేంద్రాలను వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల లోపలి పరిస్థితులను వెబ్‌కాస్టింగ్ ద్వారా, బయట పరిస్థితులను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. పోలింగ్ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపినట్లు గానీ, దౌర్జన్యానికి పాల్పడినట్లు గానీ ఎలాంటి ఘటనలు ఈ దృశ్యాల్లో నమోదు కాలేదన్నారు. ఈ విషయంపై సంబంధిత రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ప్రజలు నిర్భయంగా ఓటు వేయచ్చు...

జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో 560 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. కొన్ని శాంతిభద్రతలకు సంబంధించిన ఘటనలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని 100 మీటర్ల వెలుపల చోటుచేసుకున్నప్పటికీ, పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగలేదన్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి జిల్లాలో సుమారు 50 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో, ఇతర ప్రసార మాధ్యమాల్లో వస్తున్న ప్రచారాలను చూసి ఓటర్లు అయోమయానికి గురికావద్దని, ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యంలో తమ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు....

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
3
సోమవారం 2 నవంబర్ 2026

కూటమి అభ్యర్థుల్ని గెలిపించండి.. బందరుని అభివృద్ధి చేసుకుందాం

- మాయ మాటలు చెప్పి మభ్యబెట్టే గొడ్డలి పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలి
- ప్రజల కోసం, రాష్ట్రం బాగు కోసం నిత్యం ఆలోచించేది కూటమి ప్రభుత్వం మాత్రమే
- పెద్దపట్నం, కానూరు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ కూటమికే మద్దతిస్తారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం నార్త్ మండలం జెడ్పీటీసీ అభ్యర్థి లంకె ఉషారాణి, కానూరు ఎంపీటీసీ అభ్యర్థి కాకర భవానీ, పార్టీసీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ గారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజల జనసందోహం మధ్య ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. కూటమి అభ్యర్థులకే తమ మద్దతు ఉంటుందని ప్రజలు నీరాజనాలు పలికారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం. ఎల్ నినో కారణంగా ప్రపంచం మొత్తం ఇబ్బందులు పడుతున్నప్పటికీ.. గతంలో చంద్రబాబు నాయుడు గారు పట్టిసీమ నిర్మాణంతో నేడు ఈ ప్రాంతం మొత్తాన్ని సస్యశ్యామలం చేశారు. పట్టిసీమ ద్వారా సుమారు 500 టీఎంసీల సాగునీరు ప్రాంతానికి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు గారిది. మంగినపూడి, పెదపట్నం పరిసర ప్రాంతాలన్నింటినీ పర్యాటకంగా అభివృద్ధి చేయబోతున్నాం. గతంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. తాజాగా సాగరతీర మహాగణపతి ఉత్సవాల నిర్వహణతో ఆ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాం. టెంపుల్ టూరిజం ఏర్పాటు చేస్తాం. ఫలితంగా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి.



బందరు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించే లక్ష్యంతో ఉత్తర మండలం, దక్షిణ మండలాలుగా విభజించాం. ఉత్తర మండలం జెడ్పీటీసీ అభ్యర్థి లంకె ఉషారాణి గారు, ఎంపీటీసీ అభ్యర్థిగా కాకర్ల భవానీ గారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రం అభివృద్ధికి దూరమైంది. వైసీపీ దుర్మార్గాలను సహించలేక కూటమిని గెలిపించారు. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతోంది. అభివృద్ధికి పెద్దపీట వేశాం. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీటి సదుపాయాలు, డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చాం. జగన్ రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉండి.. కేంద్రం నిధులు కూడా తీసుకురాలేకపోయారు. కనీసం స్థానిక ఎన్నికలు కూడా నిర్వహించకుండా అభివృద్ధిని దెబ్బతీశారు. కానీ కూటమి అధికారంలోకి రాగానే కేంద్రం నిధులు విస్తృతంగా తీసుకొచ్చాం. వందల కోట్ల కేంద్ర నిధులు తీసుకొచ్చి నియోజకవర్గంలో పనులు చేస్తున్నాం. కానూరు–మోరి గ్రామానికి మధ్య రూ.20 కోట్ల వ్యయంతో వంతెన, రోడ్డు నిర్మాణం చేస్తున్నాం. పోలాటితిప్ప–గరాలదిబ్బ మధ్య గడిమేరు, గుండేరుపై రెండు వంతెనలు నిర్మిస్తున్నాం. గతంలో సెంటు స్థలం పేరుతో పేదలను దగా చేశారు. కాన నేడు అందరికీ కనీసం 2 సెంట్ల స్థలం ఇచ్చేలా ప్రణాళిక రచిస్తున్నాం. సబ్సిడీ కూడా రూ.2.50 లక్షలు మంజూరు చేయనున్నాం. పెద్దపట్నం గ్రామంలో తాగునీటి కుళాయిల ఏర్పాటుకు చిత్తశుద్ధితో ఉన్నాం. కేంద్రంలో రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఉంది. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతో ట్రిపుల్ ఇంజిన్ సర్కారును ఏర్పాటు చేస్తాం. పెద్దపట్నం గ్రామానికి 24 గంటల విద్యుత్ అందించిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదే. చేపలు, రొయ్యల చెరువులకు సబ్సిడీతో విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నాం. పని చేసే వారిని గెలిపించండి. మాటలు చెప్పి మభ్యబెట్టే వైసీపీ నేతల్ని రాష్ట్రం నుండి తరిమికొడదాం. పెద్దపట్నం తీరాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. బందరు కోటలో సీ వీడ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. తద్వారా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నాం. రాష్ట్రం అభివృద్ధి కోసం కూటమి చేస్తున్న అభివృద్ధిని గుర్తించండి. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కలను సాకారం చేసి చూపిస్తాను. వచ్చే సంవత్సరం నుండి బందరు పోర్టు వినియోగంలోకి రాబోతోంది. రూ.8000 కోట్లతో యుద్ధ నౌకల తయారీ పరిశ్రమను బందరుకు తీసుకొచ్చాం. బందరు యువతకు ఇక్కడే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

గొడ్డలి పార్టీ ఐదేళ్ల పాలనలో అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు తప్ప సాధించిందేమీ లేదు. రాష్ట్రంలో స్వేచ్ఛ లేకుండా చేశారు. బందరు మండలంలో అభివృద్ధి జరిగిందంటే అది కేవలం కూటమి ప్రభుత్వ హయాంలో మాత్రమే. అన్ని ప్రాంతాలకు రోడ్డు సదుపాయం కల్పిస్తున్నాం. లంక గ్రామాలకు వంతెనలు ఏర్పాటు చేసి అనుసంధానం పెంచుతాం. బందరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపితీరుతాను. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని విజయవంతంగా అమలు చేశాం. సూపర్ సిక్స్ హామీలు అమలు చేశాం. మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేల చొప్పున అందిస్తున్నాం. తాజాగా వచ్చిన తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందిస్తా. అభివృద్ధికి.. అరాచకానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల సమరంలో ప్రజలే తమ ఓటు ఎవరికో నిర్ణయించుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.



విజయమే లక్ష్యంగా గోపు సత్యనారాయణ

విస్తృత ఎన్నికల ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

కానూరు, తాళ్లపాలెం ఎంపీటీసీ సెగ్మెంట్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా గోపు సత్యనారాయణ విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కానూరు, తాళ్లపాలెం--1, తాళ్లపాలెం--2 ఎంపీటీసీ సెగ్మెంట్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల జగన్నాథరావు, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను కలుసుకుంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులకు ప్రజలు ఉత్సాహంగా స్వాగతం పలికారు. నవంబర్ 5వ తేదీన జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కానూరు ఎంపీటీసీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై, తాళ్లపాలెం--1 ఎంపీటీసీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై, తాళ్లపాలెం--2 ఎంపీటీసీ అభ్యర్థికి గ్లాస్ గుర్తుపై, జెడ్పీటీసీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రజల ఆశీస్సులు, మద్దతుతో అన్ని స్థానాల్లో ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు.

కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి : విక్కుర్తి

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ



నాగాయలంక మండలంలో ఆదివారం నిర్వహించిన కూటమి అభ్యర్థుల ఎన్నికల ర్యాలీలో అవనిగడ్డ నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగాయలంక మండలంలో కూటమి పార్టీలు బలపరిచిన బీజేపీ జెడ్పీటీసీ అభ్యర్థిని భోగాది రమాదేవితో పాటు మండలంలోని ఎంపీటీసీ అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరాలంటే స్థానిక సంస్థల్లో కూడా కూటమి అభ్యర్థులు విజయం సాధించడం అవసరమన్నారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి భోగాది రమాదేవితో పాటు ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం



ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం పురస్కరించుకొని వివిధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక 17వ డివిజన్ ఐదు రోడ్ల సెంటర్లో పలువురు ప్రముఖులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి తెలుగువారి కోసం ఒక ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన త్యాగశీలి పొట్టి శ్రీరాములు తెలుగు వారి గుండెల్లో ఎప్పుడూ బతికే ఉంటారని వక్తలు అన్నారు. పొట్టి శ్రీరాములు తన జీవితాన్ని తెలుగువారి కోసం ధారపోసిన ధైర్యశాలి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రొఫెషనల్ మరియు అఫీషియల్ సంఘ సభ్యులు గోళ్ళ ప్రసాద్, పులవర్తి శ్రీనివాస్, ఏ.బి. వి. ఆర్.ప్రసాద్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణమూర్తి, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ మామిడి మురళీకృష్ణ, మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వన్నెంరెడ్డి శ్రీనివాసరావు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మరకాని రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించి మిఠాయిలు పంచిపెట్టారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదును వేగవంతం చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం



కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఈఆర్వో, కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం మరియు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి సంబంధిత అధికారులను ఆదేశించారు. కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియపై శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్ నుంచి కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గంలోని అన్ని జిల్లాల ఏఈఆర్వోలు, మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), జిల్లా విద్యా శాఖాధి కారులు, ఆర్ ఐఓలు, ఆర్జేడీల తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించడం జరుగుతుందని, అందువల్ల అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించబడినందున, గడువులోగా అర్హులైన ఉపాధ్యాయులందరూ దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

2021లో గత ఎన్నికల సమయంలో కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధి లో 13505 మంది ఓటర్లుగా నమోదు కాగా, ఈసారి ఇప్పటివరకు కేవలం 8,414 దరఖాస్తులు మాత్రమే అందాయని, నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో, గడువులోగా దరఖాస్తు చేసుకోని వారికి ఈ ప్రక్రియలో మళ్లీ అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన అర్హతలపై ఉపాధ్యాయుల్లో అవగాహన కల్పించాలని, మండలాల వారీగా అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించి, వారందరికీ సమాచారం చేరవేసి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు సూచించారు.

సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు సమర్పించేలా అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి ధ్రువీకరణ చేపడతారని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో ఆఫ్‌లైన్ దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. అర్హతలకు సంబంధించి ఉపాధ్యాయులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రైవేటు కాలేజీలలో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు కూడా ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. అన్ని జిల్లాల ఏఈఆర్వో లు వారి పరిధి లోని అన్ని హై స్కూల్స్, ప్రభుత్వ కాలేజీలు, ప్రైవేటు కాలేజీల వారిని సమన్వయం చేసుకుని నిర్దేశించిన గడువులోగా అర్హులైన ఉపాధ్యాయులందరి నుంచి దరఖాస్తులు స్వీకరించేలా దాఖలు పరచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరియున్నారు.

144 సెక్షన్ అమలు

- మచిలీపట్నంలో పోలీసుల అప్రమత్తత!
- ఎన్నికల నేపథ్యంలో రోడ్లపై పోలీసుల మోహరింపు
- నిబంధనలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

కృష్ణా జిల్లా మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లోనూ పోలీసులు రోడ్లపై మోహరించి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.
ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. ఎన్నికల నియమావళి, పోలీసుల ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, అనవసరంగా గుంపులుగా గుమిగూడవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్టీసీ చైర్మన్

- సాధారణ పౌరుల మాదిరిగా క్యూ లైన్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కొనకళ్ళ సోదరులు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

సాధారణ పౌరుల మాదిరిగా క్యూ లైన్‌లో నిలబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, బీసీ నాయకులు కొనకళ్ళ జగన్నాధరావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మచిలీపట్నంలోని సుఖర్లాబాద్ ఆర్‌సీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 14వ డివిజన్‌లో కొనకళ్ళ సోదరులు ఓటు వేశారు. ఎటువంటి ప్రత్యేక హోదా ప్రదర్శించకుండా సామాన్య ఓటర్లతో కలిసి క్యూ లైన్‌లో నిలబడి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నారు.

ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ప్రశాంత వాతావరణంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు
- సతీసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన ఆయుధం ఓటు హక్కు అని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు --2026లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ తన సతీమణి పృథ్వీ కళ్యాణితో కలిసి మచిలీపట్నం నగరంలోని పాండురంగ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలుచుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కృష్ణా జిల్లాలో మచిలీపట్నం నగరపాలక సంస్థతో పాటు పెడన, ఉయ్యూరు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో శక్తివంతమైనదని, ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి ఎన్నికల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ విభాగం కింద ఉన్న 'నో యువర్ పోలింగ్ స్టేషన్' ఆప్షన్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ ఆప్షన్‌లో తమ ఎపిక్ కార్డు నంబర్ నమోదు చేయడం ద్వారా పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోం దని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఏర్పాటు చేయడంతో పాటు అదనపు భద్రతా చర్యలు



చేపట్టినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. పోలింగ్ సరళి సాధారణంగా కొనసాగుతోందని, ఓటింగ్ శాతం మెరుగ్గా నమోదవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ముగింపు సమయానికి క్యూలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న చివరి ఓటరు వరకు స్లిప్పులు అందజేస్తూ, వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం



రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తన సతీమణి, కుమారుడితో కలిసి వారి అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఓటు దేశ భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు.

ఓటు మన హక్కు.. ప్రజాస్వామ్యానికి మన బాధ్యత!

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

సోమవారం 2 నవంబర్ 2026

శ్రీరామవరంలో మోతుకూరి నానికి

ప్రజలు ఘన స్వాగతం

- ప్రచారమా విజయోత్సవమా అన్నట్లుగా గ్రామ ప్రజల నీరాజనం
- ఇంటింటా హారతులు,పూలవర్షంతో అపూర్వ స్వాగతం



ప్రజాభూమి దెందులూరు

శ్రీరామవరం గ్రామంలో మోతుకూరి నాని ప్రచారం ప్రజల అభిమానంతో అట్టహాసంగా సాగింది.ప్రచారమా.. లేక విజయోత్సవమా అన్నట్లుగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మోతుకూరి నానికి ఘన స్వాగతం పలికారు.గుండెల నిండా అభిమానం,ప్రేమతో వచ్చిన ప్రజలు ఆయనకు నీరాజనాలు పట్టడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద మహిళలు హారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ మోతుకూరి నానికి స్వాగతం పలికారు.ప్రజల ఆప్యాయతలు, అభిమానంతో ప్రచార కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది.అడుగడుగునా ప్రజలు చూపించిన ప్రేమాభిమానాలు ఆయనకు ఘనమైన స్వాగతాన్ని అందించాయి.ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి పలికిన ఆత్మీయ స్వాగతం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇంటింటా హారతులు,పూలవర్షాలు, ప్రజల ఉత్సాహంతో శ్రీరామవరం గ్రామంలో మోతుకూరి నాని ప్రచారం సందడిగా సాగింది.గ్రామ ప్రజలు చూపించిన అపారమైన అభిమానం, ఆదరణ ప్రచార కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి.

ఓటు హక్కు వినియోగంలో

వృద్ధులకు పోలీసుల అండ..

- మానవత్వం చాటుకున్న ఏలూరు డీఎస్పీ

ప్రజాభూమి ఏలూరు



ఎన్నికల సమయంలో పోలీసులు కేవలం బందోబస్తు విధులకే పరిమితం కాకుండా, అద్భుతమైన మానవత్వాన్ని చాటుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాలకు స్వయంగా రాలేని వృద్ధులు, దివ్యాంగులకు అండగా నిలుస్తూ వారి ఓటు హక్కు వినియోగానికి సహకరిస్తున్నారు.ఈ క్రమంలో ఏలూరు నగరంలోని 7వ డివిజన్‌లో డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఓ వృద్ధుడిని స్వయంగా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేసేందుకు సహాయపడటం అందరి ప్రశంసలు అందుకుంది. విధి నిర్వహణతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి వృద్ధులకు అండగా నిలిచిన పోలీసుల సేవలు ప్రజల్లో స్ఫూర్తిని నింపుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని,వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

జీలుగుమిల్లిలో కూటమి అభ్యర్థుల ప్రచార జోరు

- గ్లాస్, సైకిల్ గుర్తులకు ప్రజల మద్దతు కోరుతూ ఇంటింటి ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

మండల కేంద్రం జీలుగుమిల్లి సీఆర్ఆర్ కాలనీ, మెయిన్ సెంటర్, ఆర్యవైశ్య సంఘం, కాపు సంఘాల వారిని కూటమి ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు జనసేన నేత గడ్డ మణుగు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంపీటీసీ అభ్యర్థి కారం సుజాత గాజు గ్లాస్ గుర్తుకు, జడ్పీటీసీ అభ్యర్థి కుంజా నాగమణి సైకిల్ గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. తాటి ఆకులు గూడెం గ్రామంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన వాటర్ లను కలుసుకుని కూటమికి ఓటు వేయలేదని కోరారు. ఈ వార్డు ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వనమా రాంబాబు, జనసేన గ్రామ అధ్యక్షులు రాయి సుబ్బారావు, పలువురు సంఘస్తులు పాల్గొన్నారు. జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, బీజేపీ నాయకులు ధారా మధు, కక్కిరాల మురళీధర్, చిర్రి శ్రీను, కోలా మధు, గొట్టాల సత్యనారాయణ, గద్దె సుబ్రహ్మణ్యం తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న కూటమి మచిలీపట్నం మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా

పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు, స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు నగరంలోని పలు పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రక్రియను ఆదివారం కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలలో పోలింగ్ ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది తో మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటు హక్కును వినియోగించుకోడానికి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు పునాది వంటిదని, ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషిచేయాలన్నారు. జిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థ, నూజివీడు, జంగారెడ్డిగూడెం పురపాలక సంఘాలలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ పారదర్శకంగా నిర్వహించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 5 గంటల లోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటర్లకు స్లిప్పులను అందించి వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు. ఏలూరు నగరంలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, ఏ.ఆర్. డి.జి.కె. పాఠశాల, సి.ఎస్.ఐ. ఇంగ్లీష్ మీడియం పాఠశాల వెన్నవల్లివారిపేట లోని డా.బి.ఆర్. అంబేద్కర్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వయోవృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసు సిబ్బంది సహకారం అందించారు. ఎకలెక్టర్ వెంట ఏలూరు నగర పాలక సంస్థ కమీషనర్ ఏ. భానుప్రతాప్, డిఎస్పి శ్రావణ్ కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

- పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలను ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ పరిశీలన

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి అని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థతో పాటు జంగారెడ్డిగూడెం, నూజివీడు మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

ఏలూరు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను, పోలింగ్ నిర్వహణ తీరును పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీస్ సిబ్బంది అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు.

ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు



వినియోగించుకోవాలి

ఎన్నికల సమయంలో ఎవరైనా ఓటర్లను బెదిరించినా, భయభ్రాంతు లకు గురిచేసినా లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9550351100 కు సమాచారం అందించాలని కోరారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.



పవర్‌పేట ఎంపియుపి స్కూలులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే చంటి

ప్రజాభూమి ఏలూరు

స్థానిక పవర్‌పేట ఎంపియుపి స్కూలులో ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఏలూరు



స్థానిక 6వ డివిజన్ మస్తాన్ మయ్యం కాలనీ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏలూరు నగర మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పల నాయుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎన్నిల ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొనా ని పిలుపునిచ్చారు.

73వ డివిజన్‌లో రీపోలింగ్ రగడ!

- పోలింగ్ కేంద్రం ఆవరణలో టిడిపి, వైసిపి గుండాలు కొట్టుకున్నారని ఫిర్యాదు
- ఫోటోలు, వీడియోలతో సహా పిర్యాదు
- రాత్రి వరకూ పోలింగ్ కేంద్రం వెలుపల బైఠాయింపు, ఆందోళన
- ఉన్నతాది కారులు చర్చలు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ



విజయవాడ నగరపాలక సంస్థ స్వతంత్ర అభ్యర్థి ఏవీ వెంకటేశ్వరావును, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు రాజరాజేశ్వరి పేట కేర్ అండ్ షేర్ వివిఎస్ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. సాయంత్రం నాలుగున్నర సమయంలో టిడిపి, వైసిపికి చెందిన వ్యక్తులు ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రం ఆవరణలో కొట్లాడుకున్నారు. వారిని చూసి ఓటర్లు భయభ్రాంతులై చెల్లా చెదురు అయ్యారు. కొంతమంది మహిళలు ఇతరులు ఓటు వేయకుండానే వెళ్లి పోయారు. ఇదే విషయాన్ని అదే టైమ్ లో అక్కడికి వచ్చిన ఏబీవీ ఫోటోలు, వీడియోలు తీయించి వాటితో పాటు ఎన్నికల కమిషన్ కు, పోలీసులకు, స్థానిక రిటర్నింగ్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేశారు. దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకొని టిడిపికి చెందిన వ్యక్తులను వదిలేశారు. దీంతో వారిని కూడా అరెస్ట్ చేయాలని, ఓటు హక్కు వినియోగించుకోకుండా భయభ్రాంతులై వెళ్లిపోయిన వారికి ఓటు హక్కు వినియోగించుకునేలాగా ఈ కేంద్రంలోనీ 5 బూత్ లలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పోలీసుల నుంచి ఎన్నికల అధికారులు నుంచి ఎటువంటి సమాదానం రాలేదు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు తీసుకుని పైనుంచి ఆదేశాలు లేవని వారు పట్టించుకోలేదు. మీ దగ్గర ఆధారం ఉంటే ఇవ్వండి, మేం పై వారికి పంపిస్తాం అన్నారు తప్ప దాడికి పాల్గొన్న వారిని అరెస్ట్ చేయలేదు. సిపిఎం నేత బాబురావు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహారావు సిపిఐ నాయకులు గేటు ముందు బైఠాయించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారని, అందువలన ఆందోళన చేస్తున్న నాయకులను అదుపులోకి తీసుకుంటున్నామని స్థానిక సి ఐ చంద్రశేఖర్, ఏసీబీ సత్యానంద్ అన్నారు. మేము ఎన్నికలు ప్రాసెస్ కు అడ్డు కలిగించడం లేదని, గేటు బయట కూర్చున్నా మని తెలిపారు. మీరు ఏ చర్యలు తీసుకుంటారు, ఎప్పటిలోపు చర్యలు తీసుకుంటారో హామీ ఇవ్వకపోతే ఆందోళన విరమించేది లేదని ఏ బి. వెంకటేశ్వర రావు, బాబురావు, నరసింహారావు స్పష్టం చేశారు. దాదాపు గంటన్నర సేపు బైటాయించిన అనంతరం పోలీసు అధికారులు,మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నేతలతో చర్చలు జరిపారు. వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ ఏ చట్టం, ఆదేశాల మేరకు మమ్మల్ని అరెస్ట్ చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. పోలీసులు, అధికారుల కళ్ళ ఎదుటే దౌర్జన్యం జరిగి, లైన్లో ఉన్న ఓటర్లు పారిపోతే దానిపై చర్యలు తీసుకోకుండా ఇదేమి పద్ధతని అన్నారు.

రాత్రి ఎనిమిది వరకు పోలీసులు రిటర్నింగ్ అధికారి పై అధికారులతో చర్చిస్తూనే ఉన్నారు.

సిపిఎం నాయకులు బాబురావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం రక్షించాల్సిన పోలీసులు, ఎన్నికల సక్రమంగా నిర్వహించాల్సిన అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు. ఓటర్లకు డబ్బులు పంచుతున్న వీడియోలు సహా బయట పెడితే ఏ చర్యలు తీసుకోలేదు. ఇక ఓటర్లకు ఎలా న్యాయం జరుగుతుంది, ప్రజాస్వామ్యం ఎలా మనగలుగుతుందని అన్నారు. ధన రాజకీయాలతో కూటమి నైతిక ఓటమి చెందిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు నరసింహారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపిస్తామని చెప్తున్నారు. సాక్షాత్తు మాజీ డిజిపి స్వయంగా ఆయన కళ్ళతో జరిగిన విషయాలను వివరించిన ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం దారుణమైన అన్నారు.రాత్రి ఎనిమిది వరకూ ఉన్నతాది కారులు చర్చలు జరుపుతూనే ఉన్నారు. రాత్రి 12 గంటల లోపు విచారించి తగు నిర్ణయం తీసుకుంటామని దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు చేపడతామని ఆర్వో, పోలీస్ అధికారులు రాత్రి 8 గంటలకు స్వయంగా వచ్చి హామీ ఇవ్వడంతో ఆందోళనను నేతలు, కార్యకర్తలు తాత్కాలికంగా విరమించారు.

నవంబర్ 1న ప్రజాస్వామ్యానికి చీకటి రోజు!

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ

విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం ఎదుట వైయస్ఆర్‌సీపీ నేతలు ధర్నా నిర్వహించారు. నవంబర్ 1న రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోయాయని వారు అభివర్ణించారు. కూటమి నేతలు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం, వైయస్ఆర్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపించడం, అభ్యర్థులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ అరెస్టులకు పాల్పడటం వంటి ఘటనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఎన్నికల నిర్వహణలో తన బాధ్యతను నిర్వర్తించాల్సిన కమిషనర్ నిస్సహాయత వ్యక్తం చేయడం రాజ్యాంగబద్ధ సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. అక్రమాలు జరిగిన ప్రాంతాల్లో పోలింగ్ రద్దు చేసి, రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ, అధికార యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మీడియా సమావేశంలో వైయస్ఆర్‌సీపీ నేతలు ఏమన్నారంటే"ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నవంబర్ 1 ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా మిగిలిపోయే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం, వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వాల హయాంలో అనేకసార్లు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. కానీ ఇప్పుడు జరుగుతున్నట్లుగా ఇంతటి అరాచకాలు, అక్రమాలు గతంలో ఎప్పుడూ చూడలేదు. పోలీసులను, రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టుకుని వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులపై దాడులు చేస్తూ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారు. ప్రజలపై నమ్మకం ఉంటే బ్యాలెట్ ద్వారా వారి అభిప్రాయాన్ని తెలుసుకోవాలి. కానీ కూటమి పార్టీలు బ్యాలెట్‌తో ఎన్నికలకు వెళితే ఓటమి తప్పదనే భయంతో బుల్లెట్‌ను నమ్ముకున్నాయి. నామినేషన్ల దశ నుంచే అక్రమాలు ప్రారంభమయ్యాయి. కుల ధృవీకరణ పత్రాలు, ఇతర ధ్రువపత్రాల విషయంలో అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేశారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, స్క్రూటినీలో నామినేషన్లు తిరస్కరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. మిగిలిన అభ్యర్థులు పోటీలో ఉంటే ఇప్పుడు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఏజెంట్లను బయటకు పంపిస్తున్నారు. రాష్ట్రంలో 12,724 పోలింగ్ కేంద్రాలు ఉంటే 6 నుంచి 7 వేల కేంద్రాల్లో మాత్రమే సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఉన్నట్లు చెబుతున్నారు. మిగిలిన కేంద్రాల్లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి. హైకోర్టు, సుప్రీంకోర్టు సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినా అమలు చేయడం లేదు. మేము ఎన్నికల కమిషనర్‌ను కలిసి పరిస్థి తులను వివరించగా, తనకు అధికారాలు లేవని, చట్టాలను మార్చుకోవాలని చెబుతున్నారు. ఒక రాజ్యాంగబద్ధ సంస్థ అధి పతి ఇలా చేతులెత్తేయడం ప్రజాస్వామ్యానికి అవమానం. పులి వెందుల, కడప, మదనపల్లె, చిత్తూరు, చీమకుర్తి, మాచర్ల, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో అనేక అక్రమాలు జరిగాయి. వీటన్నింటిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందించాం. అక్రమాలు జరిగిన ప్రాంతాల్లో ఎన్నికలను రద్దు చేసి రీపోలింగ్ నిర్వహించాలి. ఎన్నికల కమిషన్ ఒక నిష్పక్షపాత సంస్థగా పనిచేయాలి. ఒకవైపు రాజకీయ పార్టీలతో పోరాడుతూనే, మరోవైపు ఎన్నికల సంఘం వైఫల్యం పై న్యాయపోరాటం కూడా కొనసాగిస్తామని "వైసీపీ నేతలు పేర్కొన్నారు.

ప్రజాభూమి

కోనసీమ 5

సోమవారం 2 నవంబర్ 2026

కోలంకలో తుపానుకు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించిన కేంద్ర అంతర్ బృందం

- కాజులూరు మండలంలో పంట నష్టాలపై వివరాలు సేకరణ
- నష్టాన్ని అంచనా వేసేందుకు క్షేత్ర స్థాయి పర్యటన.



ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని కేంద్ర బృందం కాజులూరు మండలం కొలంక గ్రామంలో పర్యటించి, తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా తుపాను కారణంగా వరి పొలాల్లో ఏర్పడిన నీటి ముంపు, ఈదురుగాలుల ప్రభావంతో పంట పడిపోవడం, వరి కంకులు నేలవాలడం, పంట దిగుబడిపై పడే ప్రభావం తదితర అంశాలను బృంద సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావంతో రైతులకు ఎదురైన ఇబ్బందులు, పంట సాగుకు చేసిన పెట్టుబడి, దెబ్బతిన్న పంట విస్తీర్ణం, దిగుబడిపై ప్రభావం, పంట నష్టాల అంచనా తదితర అంశాలపై రైతులతో బృంద సభ్యులు మాట్లాడి వివరాలు సేకరించారు. పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, వాస్తవ పరిస్థితులను నివేదికలో పొందుపరచడంపై దృష్టి సారించారు. తుపాను ప్రభావంతో వ్యవసాయ రంగంతో పాటువిద్యుత్,రహదారులు,ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాలను కూడా కేంద్ర బృందం వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఆయా శాఖల అధికారులు నష్టాల వివరాలు, చేపట్టిన పునరుద్ధరణ చర్యలు, రైతులకు మరియు బాధితులకు అందిస్తున్న సహాయక చర్యలను కేంద్ర బృందానికి వివరించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నాయకత్వంలో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అదనపు అభివృద్ధి కమీషనర్ ప్రశాంత్ అర్మోరికర్ వ్యయ శాఖ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్ హిమాలయ గార్గ్, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ విద్యుత్ మంత్రిత్వ శాఖ, డిప్యూటీ డైరెక్టర్ ప్రణయ్ గార్గ్ బృందం అర్నబ్ తుఫాను కారణంగా వరి పంట నష్టపోయిన పొలాలను పరిశీలించిన నేపథ్యంలో కోలంకలో పలువురు రైతులు బృందం దృష్టికి పలు ప్రధాన సమస్యలు తీసుకెళ్లారు ప్రదానంగా కౌలు రైతులు వరి పంటకు పెట్టుబడి 30 వేల నుంచి 35000 వేల రూపాయల వరకు పెట్టడం జరిగిందని పంట చేతికి వచ్చే టైం లో తుఫాన్ కారణంగా మొత్తం నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బృందానికి రైతులు వివరించారు.అలాగే ఎండోమెంట్ భూములకు సంబంధించి శిస్తు రద్దు చేయాలని కోరారు .పశువులకి దానా కూడా లేని పరిస్థితి తుఫాను వల్ల కలిగిందని తుఫాన్ వల్ల చాలా తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులందరూ కేంద్ర బృందంను కోరారు. పెట్టుబడి రాయితీ మరియు ఇన్సూరెన్స్ త్వరగా వర్తింప చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు లో నాణ్యత ప్రమాణాలు సడలించి రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని,ఉచిత పంటల బీమా వర్తింప చేయాలని కోరారు .స్వర్ణ రకానికి సమానంగా దిగుబడి నిచ్చే చేను పడిపోని సన్న రకాన్ని రైతులకు అందించాలని కోరారు.ఈ పర్యటనలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, కాజులూరు వ్యవసాయ అధికారి వి.అశోక్, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



ప్రజా భూమి ప్రతినిధి -- అనకాపల్లి

జిల్లా పరిధిలో ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనకాపల్లి టౌన్, రూరల్, పరవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ ఎన్నికల సరళిని, భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనకాపల్లి టౌన్ పరిధిలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం, విజయరామరాజుపేట, భీముని గుమ్మం, గవరపాలెం పార్క్ సెంటర్, సంతబైలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనకాపల్లి రూరల్ పరిధిలో కే.ఎన్.ఆర్.పేట, సిరసపల్లి, పరవాడ పరిధిలో లంకెలపాలెం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఓటర్ల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితులను సమీక్షించారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయి బ్యాలెట్, ఈవీఎం బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకునే వరకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి భయం, ప్రలోభాలు, ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ పి.వి.వి. నరసింహారావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, సీఐలు కోటేశ్వరరావు, ప్రేమకుమార్, అశోక్ కుమార్, ఎస్సై సునీల్, ఇతర పోలీసు అధికారులు, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో బిజెపిని లైట్గా తీసుకున్న కూటమి నేతలు

- నియోజకవర్గంలో 58 ఎంపిటిసి స్థానాలకు రెండు చోట్ల బిజేపి పోటీ
- బిజెపి అభ్యర్థులు ఉన్న రెండు చోట్లా జనసేన అభ్యర్థులకు బి ఫారాలు అందజేత
- ఇదేమి కూటమి ధర్మం అంటున్న బిజెపి శ్రేణులు
- కాజులూరు, జగన్నాథగిరి,వెల్ల గ్రామాల్లో కూటమి పొత్తు ధర్మానికి తూట్లు.
- అనివార్యమైన కూటమి అభ్యర్థులు ఫ్రెండ్లీ పోటీ



ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం/కాజూలూరు

రామచంద్రపురం నియోజకవర్గంలో స్థానిక సమరంలో కూటమి అభ్యర్థుల పోటీ విషయంలో బి ఫారాలు అందజేయడంలో నేతలు తీసుకున్న నిర్ణయంతో విచిత్ర సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో జాతీయ పార్టీ అయిన భారతీయ జనతా పార్టీని (బిజెపి)కూటమి భాగస్వాములైన జనసేన, టిడిపి, పార్టీల నేతలు ఇక్కడ లైట్ గా తీసుకుని బిజేపి అభ్యర్థులు పోటీ చేస్తున్న ఎంపిటిసి స్థానాల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు బీఫారాలు అందజేసి కూటమి ధర్మాన్ని విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.దీంతో బిజెపి శ్రేణులు కూటమి నేతల నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మూడు మండలాల్లో 58 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి, కాజులూరు మండలంలో 20,కె.గంగవరం మండలంలో 18, రామచంద్రపురం మండలంలో 20 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మండల కేంద్రమైన కాజులూరు-1 , రామచంద్రపురం మండలం వెల్ల -1 ఎంపిటిసి స్థానాలకు బిజెపి అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఎన్నికల బరిలో ఉన్నారు. ఇదిలా వుండగా కూటమి భాగస్వాములైన బిజెపి అభ్యర్థికి రెబల్ అభ్యర్థులుగా జనసేన తరపున పోటీలో ఉన్న అభ్యర్థులకు జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ బి ఫారాలు అందజేసి కూటమి ధర్మాన్ని విమర్శించారన్న ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. బిజెపి కేవలం రెండు చోట్ల పోటీ చేయటం ఆ అభ్యర్థులు ఉన్న చోటే జనసేన అభ్యర్థులకు బి ఫారాలు అందజేసిన పరిణామాలతో కూటమి ధర్మాన్ని పాటించకుండా బిజెపిని లైట్గా తీసుకున్నారని బిజెపి శ్రేణులు గుర్రుగా ఉన్నారు. అలాగే కాజులూరు మండలంలో కాజులూరు-1, తోపాటు జగన్నాథగిరి గ్రామంలో పోటీలో ఉన్న జనసేన , టిడిపి అభ్యర్థులకు రెండు పార్టీల నుండి బి ఫారాలు అందజేయడంతో ఇక్కడ కూడా అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు.అదేవిదంగా రామచంద్రపురం మండలం వెల్ల -1 ఎంపిటిసి స్థానానికి కూటమి భాగస్వామైన బిజెపికి , రెబల్ అభ్యర్థిగా జనసేన తరపున ఉన్న అభ్యర్థికి బి ఫారం ఇవ్వడంతో ఇక్కడ త్రిముఖ పోటీ జరగనుంది దీంతో ఆయా చోట్ల ద్విముఖ పోటీ జరగాల్సి ఉండగా త్రిముఖ పోటీ అనివార్యమైంది.కూటమి పార్టీల అధినేతలు సిఎం చంద్రబాబు నాయుడు,ఉప సిఎం పవన్ కళ్యాణ్ , బిజెపి అధినాయకత్వం ఏకపక్ష నిర్ణయంతో ఉంటున్నా, క్రింది స్థాయి నేతలు తీసుకుటున్న నిర్ణయంతో భేదాభిప్రాయాలు కూటమి శ్రేణుల్లో నిరంత్సాహం స్పష్టంగా కనిపిస్తోంది.కూటమి. అధినేతలు తరచూ ఆయా పార్టీల శ్రేణులకు పదేపదే హెచ్చరికలు చేస్తుంటే రాష్ట్ర వ్యాప్తంగా క్రింది స్థాయి శ్రేణులు వారి హెచ్చరికలకు అణుగుణంగా మసలుకున్నా నేతలు మాత్రం అవేమి తమకు వర్తించవంటూ తామపని తాము చేసుకుంటున్నారు. ఇందుకు నిదర్శనం బిజేపి అభ్యర్థులు పోటీలో ఉన్న చోట్ల జనసేన అభ్యర్థులకు నచ్చ చెప్పకుండా బి ఫారాలు ఇవ్వడం అదేవిధంగా జనసేన అభ్యర్థి పోటీలో ఉన్న జగన్నాథగిరిలో టిడిపి నేతలు ఎంపిటిసి అభ్యర్థులకు బి ఫారాలు అందజేసిన తీరు స్పష్టం మౌతోంది. ముఖ్యంగా మండల పరిధిలోని జగన్నాథగిరి ఎంపిటిసి స్థానానికి వైకాపా తరపున గుత్తుల లోవరాజు, టిడిపి తరపున వనుం సత్యనారాయణ, (సత్తిబాబు) జనసేన తరపున బెజవాడ ఉదయ్ లక్ష్మణప్రసాద్, పోటీలో ఉన్నారు. అలాగే కాజులూరు-1 ఎంపిటిసి స్థానానికి బిజెపి తరపున కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు సతీమణి సలాది ఆదిలక్ష్మి,జనసేన తరపున నామా పద్మావతి, వైకాపా తరపున యాళ్ళ విజయ దుర్గా, అదేవిధంగా వెల్ల-1 ఎంపిటిసి స్థానానికి బిజెపి తరపున కిసాన్ మోర్చా కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులు పాట్నాల గణపతి సతీమణి పట్నాల పార్వతి,జనసేన తరపున వట్టికూటి లోకేశ్వరి, వైకాపా తరపున అన్యం శాతం కుమారి పోటీలో ఉండగా టిడిపి అభ్యర్థి సత్యనారాయణకు మంత్రి వాసంశెట్టి సుభాస్ తండ్రి సత్యం,జనసేన తరపున బెజవాడ ఉదయ్ లక్ష్మణప్రసాద్,వట్టికూటి లోకేశ్వరి, నామా పద్మావతి లకు రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు ఆయా పార్టీల తరపున బి ఫారాలు అందజేసారు.దీంతో ఆయా గ్రామాల్లో ఎంపిటిసి స్థానాలకు త్రిముఖ పోటీ అనివార్యమైంది.కాజులూరు మండలంలో ఎంపిపి స్థానం టిడిపి కి, జెడ్పీటిసి టికేట్ జనసేన పార్టీలకు కేటాయించారు.అలాగే రామచంద్రపురం మండలంలో టిడిపికి ఎంపిపి, జెడ్పీటిసి పదవులు కేటాయించారు.ఈనేపద్యంలో మండలంలో ఇలాంటి పరిస్థితిల్లో ఆయా చోట్ల ఎంపిపి, జెడ్పీటీసీ అభ్యర్థులు మాత్రం ఓటర్లను ఏవిధంగా ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించాలన్న సందిగ్ధంలో ఉంటూ తమతమ ప్రచారాన్ని కోనసాగిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ ఫ్రెండ్లీ పోటీ జరుగుతున్న నేపథ్యంలో వైకాపా తరపున పోటీ చేసిన అభ్యర్థులకు మాత్రం గెలిసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఏది ఏమైనా కొద్దిరోజుల్లో జరగనున్న ఎన్నికల్లో పరిణామాలు ఏవిధంగా ఎవరికి అనుకూలంగా ఉంటాయో అని ఓటర్లు సైతం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు ఇలాంటి పరిస్థితుల్లో కూటమి అభ్యర్థులు గెలుపుకు బి ఫారాలు అందజేసిన నేతలు ఆయా చోట్ల తమతమ అభ్యర్థులను ఏవిదంగా నైనా గెలిపించుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు ఏవిధంగా అనుకూలిస్తాయో వేచిచూడాల్సిందే.

మేము పాటించాం జనసేన విస్మరించింది: జిల్లా అధ్యక్షులు అడబాల

కూటమి పొత్తు ధర్మాన్ని బిజేపి పార్టీ తరపున పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభ్యర్థిలను తమకు కేటాయించిన స్థానాల్లో పోటీలో ఉన్నారని అయితే కూటమి ధర్మాన్ని విమర్శించి ఇక్కడ జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ జనసేన అభ్యర్థులకు బి ఫారాలు అందజేసి బిజేపి అభ్యర్థులకు రెబల్ గా బరిలోకి దించారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, అనకాపల్లి బిజెపి ఇంచార్జి కర్రి చిట్టిబాబులు అన్నారు.ఈమేరకు వీరు మాట్లాడుతూ మంత్రి వాసం శెట్టి సుభాస్ బిజేపికి ఎంపిటిసి స్థానాలు విషయంలో తమకు సహకరించారని, అయితే జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ సహకరించలేదని అన్నారు.కూటమి ధర్మానికి విరుద్ధంగా పోటీలో ఉండటంతో వెల్ల,కాజులూరు గ్రామాల్లో ఫ్రెండ్లీ పోటీ జరుగుతుందని అన్నారు.ఈవిషయంలో ఇక్కడ జరిగిన పరిణామాలు జనసేన అధినాయకత్వానికి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

నేడు కాజులూరు,వెల్ల గ్రామాల్లో బిజెపి నేతలు ప్రచారం.

రామచంద్రపురం నియోజకవర్గంలో కాజులూరు, వెల్ల గ్రామాల్లో బిజెపి తరపున పోటీలో ఉన్న ఎంపిటిసి అభ్యర్థుల తరపున జిల్లా స్థాయిలో బిజెపి నేతలు సోమవారం విస్తృత ప్రచారం చేయనున్నారు.ఇప్పటికే ఆయా చోట్ల అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు.దీనికి తోడు బిజేపి సీనియర్ నేతలు ప్రచారంలో పాల్గొన్న నేపథ్యంలో ఆయా చోట్ల బిజెపి

ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కుటుంబ సభ్యులు



ప్రజాభూమి ప్రతినిధి,అమలాపురం రూరల్ రిపోర్టర్

అమలాపురం నియోజకవర్గ పరిధిలోని అమలాపురం మున్సిపాలిటీ 33వ వార్డులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా వారు చాటి చెప్పారు.

అమలాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న 103 ఏళ్ల వృద్ధురాలు



ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్ రిపోర్టర్

అమలాపురం గాంధీనగర్ 12వ వార్డుకు చెందిన 103 ఏళ్ల వృద్ధురాలు తిరుగుళ్ల సావిత్రమ్మ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. శతాధిక వయసులోనూ పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేయడం స్థానికులను ఆకట్టుకుంది. వయసు మీద పడినా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కావడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఓటు హక్కుపై ఆమె చూపిన చైతన్యం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.

15వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన డాక్టర్ పినిపే శ్రీకాంత్



ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్ రిపోర్టర్

అమలాపురం పట్టణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వివిధ వార్డుల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ ఎన్నికల ప్రక్రియను పరిశీలించడంలో భాగంగా 15వ వార్డు పోలింగ్ బూత్‌ను అమలాపురం నియోజకవర్గ అసెంబ్లీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

రామచంద్రపురంలో పురపోరు ప్రశాంతం

- 70.73 శాతం పోలింగ్ నమోదు
- ఉదయం మందకొడి 9 గంటలకు జోరందుకున్న పోలింగ్
- 3 గంటల వరకు 61.47 శాతం నమోదు
- ఎన్నికల సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు



ప్రజాభూమి ప్రతినిధి,
రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పోలింగ్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సమయం ముగిసేసరికి 70.73 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ సరళి 9 గంటలకు స్పీడందుకుంది దీంతో మధ్యాహ్నం 3 గంటల వరకు 61.47 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసేసరికి 70.73 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 32వార్డులల్లో 35,వేల 728 మంది ఓటర్లు ఉండగా, 3 గంటల వరకు 21 963 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పోలింగ్ సమయం ముగిసేసరికి మొత్తం 32 వార్డుల్లో 25, వేల 270 మంది తమతమ ఓటుహక్కుని వినియోగించుకోనున్నారు.



ఎన్నికల సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్

ఆదివారం రామచంద్రపురం మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల సరళిని జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ గంగాల్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన పురపాలక సంఘ పరిధిలో 32 వార్డుల్లో జరుగుతున్న ఎన్నికల సరళిని పరిశీలించి పలుచోట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కూడా పరిశీలించారు.ఈయన వెంట జిల్లా ఆడిట్ అధికారి ఎ వి వి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాజు,డిడిఓ అబ్రహం లింకన్, ఆర్ అండ్ బి డి.ఇ. సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 6

సోమవారం 2 నవంబర్ 2026

అనంతపూర్ రాప్తాడు నిందితుడి పైన కాల్పులు

ప్రజాభూమి ప్రతినిధి,ఆత్మకూరు

రాప్తాడు పాఠశాలలో ఓ విద్యార్థినిపై ఘాతుకానికి పాల్పడ్డ హేమంత్ అడవిలో లో దాచుకున్నట్లు పోలీసులకు సమాచారం రాగా అతనిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులను చూసి తప్పించుకొని పారిపోతూ పోలీస్ల పైన రాళ్లతో దాడులకు దిగడం తో హేమంత్ పట్టుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు.. హేమంత్ దాడిలో పలువురు పోలీసులకు గాయాలవ్వగా పోలీసులు జరిపిన కాల్పుల్లో హేమంత్ కు గాయాలయ్యాయని. ఆరు రౌండ్ హేమంత్ పై కాల్పులు జరిపినట్లు హేమంత్ కు తీవ్ర గాయాలనట్టుగా సమాచారం అందుతోంది. గాయపడిన అతనిని వైద్యం కోసం పోలీసులు ఆసుపత్రికి తరలించి నట్లు తెలుస్తోంది.

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన కేంద్ర బృందం

- పంట నష్టం,రైతు పెట్టుబడి, ఆశించిన దిగుబడి, ఆర్థిక నష్టాలపై రైతుతో నేరుగా చర్చ



ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ

కాకినాడ జిల్లాలో అరటి పంటకు జరిగిననష్టాలను అంచనా వేసేందుకు ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ ఆదివారం పిఠాపురం మండలం వీరవాడ గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఈ సందర్భంగా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, బాధిత రైతులతో కేంద్ర బృందం సభ్యులు నేరుగా మాట్లాడి పంట నష్టాల వివరాలను తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.2026 జనవరి 20వ తేదీన 3.50 ఎకరాల విస్తీర్ణంలో కర్పూరం, చెక్కకేళి రకాల అరటి పంటను సాగు చేసినట్లు, తుఫాన్ సంభవించే సమయానికి పంట 9 నుంచి 11 నెలల వయస్సుకు చేరుకుని కోతకు సిద్ధంగా ఉందని,ఒక ఎకరానికి సుమారు 500 నుంచి 600 మొక్కలు నాటగా, సాధారణ పరిస్థితుల్లో సుమారు 500 గెలలు దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు, ఒక్కో అరటి గెలకు మార్కెట్ పరిస్థితులను బట్టి రూ.250 నుంచి రూ.300 వరకు ధర లభిస్తుందని, ఈ లెక్కన ఒక ఎకరానికి సుమారు రూ.1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు స్థూల ఆదాయం వచ్చే అవకాశం ఉండేదని, నవంబర్, డిసెంబర్ నెలల్లో, ముఖ్యంగా కార్తీక మాసంలో అరటికి మంచి ధర లభిస్తుందని ఆశించినట్లు అయితే తుఫాన్ సమయంలో వీచిన తీవ్ర గాలుల కారణంగా అరటి మొక్కలు పెద్ద సంఖ్యలో నేలకొరిగాయని, కొన్ని మొక్కలు విరిగిపోయి మరికొన్ని తీవ్రంగా దెబ్బతిన్నాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో 50 శాతానికి పైగా పంట నష్టం జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. అరటి తోట సాగు కోసం ఇప్పటివరకు సుమారు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు అధికారులు వివరించారు. మొక్కల కొనుగోలు, ఎరువులు, కూలీల ఖర్చులు, అంతర సేద్య పనులు, ఇతర యాజమాన్య ఖర్చుల వివరాలను కేంద్ర బృందానికి తెలియజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ,అర్హత కలిగిన పంట నష్టపోయిన అరటి రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెక్టారుకు రూ.35,000 చొప్పున పంటనష్టపరిహారం అందించనున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందించే పరిహారం తిరిగి పంట సాగు చేపట్టేందుకుఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. నేలకొరిగిన మొక్కలను తొలగించడం, కొత్త మొక్కలను నాటడం, వాటికి ఆధారాలు ఏర్పాటు చేయడం,ఎరువులు కొనుగోలు చేయడం, కూలీల ఖర్చులు భరించడం వంటి పనులకు పరిహారం కొంతమేర తోడ్పడుతుందని తెలిపారు. కేంద్ర బృందం సభ్యులు క్షేత్ర స్థాయిలో పంట నష్టం తీవ్రత ను పరిశీలించి, రైతు పెట్టుబడి, ఆశించిన దిగుబడి, మార్కెట్ ధరలు, పంట నష్టం కారణంగా ఎదురైన ఆర్థిక నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను తమ నివేదికలో పొందుపరిచి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న దశలో తుఫాన్ కారణంగా అరటి పంట దెబ్బతినడంతో రైతు ఆశించిన ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర బృందానికి అధికారులు వివరించారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటన

- నష్టాల పరిశీలనకు విచ్చేసిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందం
- విపత్తు నిర్వ హణలో అనుసరించిన ఉత్తమ విధానాలను నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తాం
- కేంద్ర బృందం నాయకులు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ

ఆర్నబ్ తుఫాను ప్రభావంతో కాకినాడ జిల్లాలో జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరి శీలించి, నష్టాల అంచనా, సహాయక చర్యలు, పునరా వాస కార్యక్రమాలను సమీ క్షించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందం నాయకులు శ్రీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం ఆదివారం కాకినాడ జిల్లాకు విచ్చేసింది. ఈ బృందంలో కేంద్ర వ్యవ సాయ, రైతు సంక్షేమ శాఖ అదనపు కమిషనర్ (ఎక్స్‌టెన్షన్) డాక్టర్ ప్రశాంత్ అర్మో రికర్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ హిమా లయ గర్గ్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ/కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ప్రణయ్ గర్గ్, రాష్ట్ర రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సీఈవో, రాష్ట్ర విపత్తు నిర్వహణ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత తుఫాను ప్రభావం, జిల్లా లో జరిగిన నష్టం,సహాయక చర్యలకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను కేంద్ర బృందం స్థానిక కలెక్టరేట్ నందు తిలకించింది. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తుఫానుకు ముందు చేపట్టిన అప్రమత్తత చర్యలు, తుఫాను సమయంలో నిర్వహించిన సహాయ,రక్షణ కార్యక్రమాలు, అనంతరం చేపట్టిన పునరుద్ధరణ చర్యలు, వివిధ శాఖలకు వాటిల్లిన నష్టాల వివరాల ను కేంద్ర బృందానికి సమగ్రంగా వివరించారు.

ఈ సందర్భంగా కేంద్ర బృందం నాయకులు చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ, తుఫాను ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాస్తవ పరిస్థితు లను పరిశీలించడం, జరిగిన నష్టాన్ని అంచనా వేయడం, జిల్లా యంత్రాంగం చేపట్టిన సహాయక, పునరావాస చర్యలను సమీక్షించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ పరిశీలన ఆధారంగా కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ 25 నుంచి మత్స్య కారులు సముద్రంలోకి వెళ్లకుండా నిషేధం విధిం చామని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అక్టోబర్ 26, 27 తేదీల్లో సమీక్షలు నిర్వహించి, అధికారులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. మూడు బృందాలను రంగంలోకి దించామని వివరించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతుంటే జగన్‌కు ఎందుకింత ఆందోళన?

- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి:

పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆడుతున్న రాజకీయ నాటకాలు నేడు బట్ట బయలయ్యాయని టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు విమర్శించారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుంటే ఒక్క పులివెందులలోనే ఎందుకు వివాదాలు, ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారు. గత 40 ఏళ్లుగా పులివెందుల ప్రజలు భయాందోళనల మధ్య ఓటు వేసే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పులివెందులలో ఓటమి తప్పదనే భయంతోనే జగన్ ఈ డ్రామాలకు తెరతీశారు. వైసీపీ అంతర్గత సర్వేల్లో ప్రతికూల ఫలితాలు వస్తున్నాయనే ఆందోళనతో ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. హెలికాప్టర్ సాధారణంగానే ల్యాండ్ అయినప్పటికీ సాక్షి మీడియా మాత్రం అత్యవసర ల్యాండింగ్ అంటూ తప్పుడు ప్రచారం చేసింది. ఎన్నికల సమయంలో ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలతో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. విజయవాడలోనే 870 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ కొనసాగుతోంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా జరుగుతుంటే పులివెందులలోనే వాహనాల దహనం, దాడులు, బెదిరింపులు, ఉద్రిక్తతలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల రోజున జరిగిన ఘటనలకు టీడీపీని బాధ్యులను చేసే ప్రయత్నం చేస్తున్నారు. 2024 ఎన్నికలతోనే వైసీపీ పతనం ప్రారంభమైంది. నేటి పరిణామాలు ఆ పతనానికి కొనసాగింపుగా కనిపిస్తున్నాయి. 2019--2024 మధ్య వైసీపీ పాలనలో రాష్ట్రంలో అవినీతి, హత్యలు, దౌర్జన్యాలు, రాజకీయ కక్షసాధింపు పెరిగాయి. సొంత బాబాయ్ హత్యకు గురైతే నాటి వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు నాయుడుపై నిందలు మోపారు. సాక్షి పత్రికలో నారాసుర రక్తచరిత్ర అంటూ ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఈ కేసు దర్యాప్తులో సీబీఐ వ్యవహారానికి అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి నేడు పులివెందులలో జగన్‌ను ప్రశ్నిస్తూ, ఓట్లు అడిగే నైతిక హక్కు ఆయనకు లేదని నిలదీస్తున్నారు. సొంత కుటుంబంలోనే వివాదాలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్ ఇతరులకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందులలో 33 వార్డులకు 33 వార్డులూ అప్రజాస్వామికంగా ఏకగ్రీవం చేసుకున్నారు. నాడు అధికార బలం, డబ్బు ప్రభావం, బెదిరింపుల కారణంగానే ఏకగ్రీవాలు జరిగాయి. అదే పులివెందులలో నేడు ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితులను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. అందుకే జగన్‌కు ఆందోళన మొదలైంది. రౌడీ రాజకీయాలకు, బెదిరింపులకు చెక్ పడటంతో గొడ్డలి పార్టీలో ఆందోళన మొదలైంది. నామినేషన్ల సమయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రోజా తదితర గొడ్డలి పార్టీ నేతల అరాచకాలు ప్రజలంతా చూశారు. 2021లో మాచర్లలో తనపై జరిగిన దాడి ఒక ఉదాహరణ. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడిగా పేర్కొన్న తురక కిషోర్ తనపై, బుద్ధా వెంకన్నపై, తమ న్యాయవాదిపై దాడికి పాల్పడ్డారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ చేసిన దౌర్జన్యాలను ప్రజలు మరిచిపోలేదు. ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతుంటే వాటిని అడ్డుకునేందుకు జగన్ కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇకపై ఫ్యాక్షన్ రాజకీయాలకు, గ్యాంగ్ రాజకీయాలకు, దౌర్జన్యాలకు తావులేదు. ప్రజల ఆస్తులను దోచుకున్న జగన్... కుటుంబ సభ్యుల ఆస్తుల విషయంలోనూ అదే దోరణితో వ్యవహరిస్తున్నారు. సొంత మేనకోడలి వివాహం విషయంలో కూడా వివాదాలు సృష్టించారు. పులివెందుల ప్రజలు ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా ఓటు వేయడానికి ముందుకు వస్తున్నారు. ఇది గొడ్డలి పార్టీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇస్తున్న తీర్పని ఎమ్మెల్యే బోండా ఉమా అన్నారు.

ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్... వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నారు

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రజాభూమి ప్రతినిధి, మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. 50 శాతం మహిళలకు, 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయల్లో సముచిత అవకాశాలు కల్పిస్తుంటే జగన్ రెడ్డి అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికల్లో పోటీ చేస్తూ, ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకుంటూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతున్నారు. అయితే ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి జగన్ ఓటమి భయంతో ఎన్నికల ప్రక్రియపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కొత్త డ్రామాలకు తెరతీశారు. పులివెందులలో గత 50 ఏళ్లుగా కొనసాగిన రాజకీయ ఆధిపత్యానికి ప్రజాస్వామ్యబద్ధంగా సవాలు ఎదురవుతుండటాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. తన రాజకీయ కంచుకోటగా భావించే పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేస్తుంటే ఆ పరిణామాలను తట్టుకోలేక హెలికాప్టర్ డ్రామాలు, ఏజెంట్ల పేరుతో వివాదాలు సృష్టిస్తున్నారు. ఎన్నికలు జరిగే రోజున హెలికాప్టర్ ల్యాండింగ్‌కు సంబంధించి లా అండ్ ఆర్డర్ పరిస్థితులను పరిశీలించిన తర్వాతే అధికారులు అనుమతి ఇచ్చారు. సాయంత్రం రావాలని సూచించినప్పటికీ ఎమర్జెన్సీ ల్యాండింగ్ పేరుతో ముందుగానే వచ్చారు. ఆ తర్వాత తన ఏజెంట్లను లోపలికి అనుమతించడం లేదంటూ మరో వివాదానికి తెరతీశారు. వాస్తవానికి ఏజెంట్లను తన వెంట తీసుకెళ్లింది మీరే. వారిని మీరే బయటకు తీసుకొచ్చి, ఇప్పుడు అధికారులపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం? ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. అలాంటప్పుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎవరు అడ్డుపడ్డారు? ఎవరైనా ఆయన ఓటు వేయకుండా అడ్డుకున్నారా? అలాంటిదేమీ లేనప్పుడు ఓటు వేయకుండా ఉండి, ప్రభుత్వంపై, పోలీసు అధికారులపై నిందలు వేయడం వెనుక ఉద్దేశం ఏమిటి? ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తుంటే దానిని కూడా వివాదాస్పదం చేయడం సరికాదు. జగన్ వ్యవహారశైలిని చూసి ప్రజలే ఆయన తీరును ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే తన రాజకీయ ఆధిపత్యానికి గండి పడుతుందనే ఆందోళనతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 11,372 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఇన్ని ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా సాగుతుంటే ఒక్క పులివెందులలోనే ఎందుకు వివాదాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి? పులివెందులలో గతంలో జరిగిన ఎన్నికలను జగన్ గుర్తు చేసుకోవాలి. 2021 మున్సిపల్ ఎన్నికల్లో 33 వార్డులకు 33 వార్డులూ ఏకగ్రీవం కావడం వెనుక ఉన్న పరిస్థితులపై సమాధానం చెప్పాలి. గతంలో ఏకగ్రీవాల పేరుతో జరిగిన రాజకీయాలపై మాట్లాడకుండా, ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేస్తుంటే ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది. గతంలో జరిగిన ఏకగ్రీవాలు ప్రజాస్వామ్యానికి నిదర్శనమా? ప్రజలకు నిజంగా స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించారా? అన్న ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలి. దస్తగిరి ఘటనను కూడా టీడీపీకి ఆపాదించడం సరికాదు. దస్తగిరికి టీడీపీకి సంబంధం ఏమిటి? వ్యక్తిగతంగా చోటుచేసుకున్న ఘటనలను రాజకీయాలకు ముడిపెట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా జగన్ తన వైఖరిని మార్చుకోవాలి. ఎన్నికల ప్రక్రియను గౌరవించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ప్రజలు తమ ఓటు ద్వారా ఇచ్చే తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపై ఉంది. దౌర్జన్యాలు, బెదిరింపులు, ఆరోపణలతో రాజకీయాలు చేయడం వల్ల ప్రజల విశ్వాసాన్ని పొందలేరన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల పోలింగ్ విజయవంతం

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఎన్టీఆర్ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో విధులు నిర్వర్తించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు సంయుక్తంగా ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలింగ్ నిర్వహణలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, పరస్పర సమన్వయంతో పనిచేయడం వల్ల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద దాదాపు 1,000 మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు సేవలందించారని తెలిపారు. ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం, క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, రద్దీని నియంత్రించడం వంటి విధుల్లో వాలంటీర్లు చూపిన చొరవ, సేవా దృక్పథం అభినందనీయమని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం, శాఖల మధ్య నిరంతర సమన్వయం, క్షేత్రస్థాయిలో పటిష్టమైన పర్యవేక్షణతో పోలింగ్ ప్రక్రియ విజయవంతమైందని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంలో అన్ని శాఖలు సమర్థవంతంగా పనిచేశాయని పేర్కొన్నారు.

తుఫాను నష్టాల అంచనాకు కేంద్ర బృందం పర్యటన



ప్రజాభూమి ప్రతినిధి,భీమవరం:

అర్నబ్ తుఫాను ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్యశాఖ, రహదారులు, భవనాలు, నీటిపారుదల, విద్యుత్, గృహ నిర్మాణం తదితర రంగాల్లో జరిగిన నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేయడానికి కేంద్ర బృందం ఆదివారం జిల్లాలో పర్యటించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ అలోక్ జవహర్, నాయకత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి వివిధ రంగాలకు జరిగిన నష్టాలను పరిశీలించింది. ఆదివారం భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్నబ్ తుఫాను ఫోటో ప్రదర్శనను కేంద్ర బృందం సభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి పరిశీలించారు. తుఫాను ప్రభావం, జిల్లాలో జరిగిన నష్టం, సహాయక చర్యలు, పునరుద్ధరణ కార్యక్రమాలకు సంబంధించిన ఛాయాచిత్రాలను చూపించి జిల్లా కలెక్టర్ కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం వశిష్ట సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తుఫాను కారణంగా జిల్లాలో వివిధ రంగాలకు జరిగిన నష్టం, బాధిత కుటుంబాల వివరాలు, జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలు, పునరుద్ధరణ పనుల పురోగతిని కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలో మొత్తం సుమారు 4,603 గృహాలు దెబ్బతిన్నాయని, 57,999 కుటుంబాలు ప్రభావితమయ్యాయని వివరించారు. వీరిలో 16,187 మత్స్యకార కుటుంబాలు, 5,574 చేనేత కుటుంబాలు, ఇతర వర్గాలకు చెందిన 36,238 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. తుఫాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా 13,885 చెట్లు నేలకొరిగాయని, 4,244 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని వివరించారు. పశువుల కొట్టాలకు సంబంధించి 24 పూర్తిగా, 318 పాక్షికంగా దెబ్బతిన్నాయని, తుఫాను కారణంగా ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. అర్నబ్ తుఫాను ప్రభావంతో జిల్లాలో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, మొత్తం 1,99,554 ఎకరాలు (80,756.64 హెక్టార్లు) వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికలో వెల్లడైందని వివరించారు. ఉద్యానవన శాఖకు సంబంధించి అరటి పంట 1,194.32 ఎకరాలు (483.53 హెక్టార్లు), కొబ్బరి పంట 1,019.62 ఎకరాలు (196.57 హెక్టార్లు), కూరగాయల పంటలు 668.33 ఎకరాలు (108.68 హెక్టార్లు), ఇతర పండ్ల తోటలు 948.55 ఎకరాలు (276.47 హెక్టార్లు) మేరకు దెబ్బతిన్నట్లు నివేదికలో పొందుపరిచినట్లు తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధికి సంబంధించిన పడవలు, వలలు, ఆక్వా సాగు చెరువులు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్నాయని, మొత్తం 460 పడవలు, 150 వలలు దెబ్బతిన్నాయని, 1,910.12 హెక్టార్లు లేదా 4,720 ఎకరాల్లో ఆక్వా సాగు చెరువులకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. తుఫాను కారణంగా 51 గేదెలు, 10 ఆవులు, 356 గొర్రెలు, మేకలు మృతి చెందాయని, 8,470 కోళ్లు మృతి చెందినట్లు నివేదికలో నమోదైందని తెలిపారు. జిల్లాలో 15 చేనేత యూనిట్లు దెబ్బతిన్నట్లు వివరించారు. ప్రభుత్వ సంస్థలకు సంబంధించి 34 పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పశువైద్య ఆసుపత్రులు కలిపి మొత్తం 20 ఆసుపత్రుల భవనాలు దెబ్బతిన్నాయని తెలిపారు. వీటిలో 6 పూర్తిగా, 14 పాక్షికంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 6 ప్రభుత్వ కార్యాలయ భవనాలు కూడా దెబ్బతిన్నాయని వివరించారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని మొత్తం 86 రహదారులు దెబ్బతిన్నాయని, వీటిలో 18 రాష్ట్ర రహదారులు, 68 జిల్లా రహదారులు ఉన్నాయని, ఈ రహదారులపై 552.349 కిలోమీటర్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 74 రహదారులు మొత్తం 54.6 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయని వివరించారు. తుఫాను ప్రభావంతో జిల్లాలో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని, దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. మొత్తం 409 గ్రామాల్లో ఇప్పటివరకు 209 గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు, విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం 125 బృందాలను ఏర్పాటు చేసి 1,556 మంది సిబ్బందిని నియమించినట్లు వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు, జిల్లాలో 20 గ్రామీణ సమగ్ర రక్షిత మంచినీటి పథకాలకు జనరేటర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడు రోజులుగా 392 ఆవాసాల్లో ఈ పథకాల ద్వారా నీటి సరఫరా అందిస్తున్నట్లు, 882 నీటి ట్యాంకర్లు, భూస్థాయి నీటి నిల్వ కేంద్రాల ద్వారా జిల్లాలోని మొత్తం 409 గ్రామ పంచాయతీలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా
7
సోమవారం 02 నవంబరు 2026

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

నవంబర్ 3న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు- జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు శాఖ విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. సమస్యాత్మక, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో పాటు,



మొబైల్ పెట్రోలింగ్ బృందాలు విస్తృతంగా గస్తీ నిర్వహించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. ఇదిలా ఉండగా, నవంబర్ 3వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద బహుళ అంచెల భద్రత, బందోబస్తు, నిరంతర నిఘా ఏర్పాటు చేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం వంటి చర్యల విషయంలో పోలీసుల సూచనలు, ఆదేశాలను పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రజలకు, రాజకీయ పార్టీల నాయకులకు, అభ్యర్థులకు, ఎన్నికల సిబ్బందికి జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

హెచ్. శోధనపల్లిలో కూటమి అభ్యర్థుల తరఫున ఆలం నరసానాయుడు విస్తృత ప్రచారం

జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇంటింటా వర్యటన.. ఓటర్లను కలునుకుని కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరణ



ప్రజా భూమి నార్పల

నార్పల మండలంలోని హెచ్. శోధనపల్లి గ్రామంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ అభ్యర్థి ఆకుల అరుణ, ఎంపీటీసీ అభ్యర్థి కేఎం కృష్ణవేణికి మద్దతుగా ద్విసభ్య కమిటీ సభ్యుడు, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు గ్రామంలో ఇంటింటా పర్యటిస్తూ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, ఓటర్లను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను ప్రజలతో చర్చిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వెంకటనారాయణరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డితో పాటు హెచ్. శోధనపల్లి, మంగపట్నం, గుంజేపల్లి, నల్లపరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనది

-ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
-ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, వసుంధర దేవి
-ఓటు వేసిన టీడీపీ, వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును



వినియోగించుకోవాలని హిందూపురం ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. ఆదివారం హిందూపురం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆయన తన సతీమణి వసుంధర దేవితో కలిసి ఉదయం 8 గంటలకు చౌడేశ్వరి కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీఎస్ మంజునాథ్ తన సతీమణి యుక్త శ్రీతో కలిసి ముదిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున చైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షాజియా తన భర్తతో డాక్టర్ భాషతో కలిసి రహమత్‌పురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉదయమే ఓటు వేయడంతో పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది.

అనంతపురంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ - జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పరిశీలించారు. ఆదివారం నగరంలోని రామచంద్ర నగర్ లో ఉన్న సెయింట్ మేరీస్ స్కూల్ లో 5/1, 5/2, 5/3, 5/4 పోలింగ్ కేంద్రాలు, మారుతి నగర్ 3వ క్రాస్ లో ఉన్న క్రిస్టస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో 41/1, 41/2, 41/3, 41/4 పోలింగ్ కేంద్రాలను, మొదటి రోడ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఉన్న 55/1, 55/2, 55/3, 55/4 పోలింగ్ కేంద్రాలను, 4వ రోడ్డులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఉన్న 57/1, 57/2, 57/3, 57/4 పోలింగ్ కేంద్రాలలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ ఎలా జరుగుతుంది, ఇక్కడ ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎన్నికల అధికారులను, పోలీసులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకుని, పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం


ఆంధ్రప్రదేశ్లో జరుగుతున్న రెండవ సాధారణ నగర స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఆదివారం అనంతపురం పార్లమెంటు నభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూ ఆదివారం సెలవు దినమని ఇంటి వద్దనే ఉండిపోకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములై రాజ్యాంగం మనకు కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా, నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు ఎంపీ అంబిక విజ్ఞప్తి చేశారు.

బొందలవాడ, గార్భాయ్ కాలనీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

ప్రజా భూమి నార్పల

నార్పల మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి బి. శివానందరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలోని గార్భాయ్ కాలనీలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి నార్పల స్వాతిలత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీలోని ప్రజలను కలుసుకుని తనను ఎంపీటీసీ అభ్యర్థిగా ఆదరించి ఆశీర్వదించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం



ప్రజాభూమి, పుట్లూరు.


పుట్లూరుమండల పరిధిలోని బాలాపురం, పి చింతలపల్లిగ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమతి కే శారద ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలను కలుసుకుని తనను ఎంపీటీసీ అభ్యర్థిగా ఆదరించి ఆశీర్వదించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్ఆర్సిపి ప్రవేశపెట్టిన నవరత్నాలు, వృద్ధాప్య పింఛన్, ఆరోగ్యశ్రీ, గ్రామ గ్రామానికి సచివాలయ సేవలు అందించిన ఏకైకే ప్రభుత్వం వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అని ఆ సంక్షేమాలు తిరిగి అమలు కావాలంటే వైఎస్ఆర్సిపి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అత్యంత మెజారిటీతో తమను గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో హాల్టింగ్‌కు ఆమోదం!

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తికి సానుకూల స్పందన!

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ రైల్వే ప్రయాణికులకు మరో సౌకర్యం!

ఈ నెల 3వ తేదీ నుండి అనంతపురం, గుంతకల్లు రైల్వే స్టేషన్లలో ప్రారంభం కానున్న హాల్ట్



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యాలు కల్పించే దిశగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృషికి సానుకూల ఫలితం లభించింది. బెంగళూరు--ముంబై మధ్య నడిచే వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురం, గుంతకల్లు రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ నెల 3వ తేదీ నుండి అనంతపురం, గుంతకల్లు రైల్వే స్టేషన్లలో హాల్ట్ ప్రారంభం కానుంది. అనంతపురం ప్రాంతానికి మెరుగైన రైల్వే అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గతంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ని, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్నని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో దక్షిణ భారతదేశంలోనే 1వ వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ అయిన బెంగళూరు--ముంబై వందే ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో హాల్టింగ్‌కు ఆమోదం లభించడం ఈ ప్రాంత ప్రయాణికులకు ప్రయోజనకరంగా నిలవనుంది. ముఖ్యంగా బెంగళూరు, ముంబై వంటి ప్రధాన నగరాలకు ప్రయాణించే వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అనంతపురం ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని, బెంగళూరు--విజయవాడ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రతిపాదనను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మరియు సహాయ మంత్రి వి. సోమన్నకి సమర్పించగా, వారు సానుకులంగా స్పందించారని, త్వరలో ఆమోదం వస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కి, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్నకి, రైల్వే బోర్డు అధికా రులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్కే వ్యాలీలో చిప్‌నోవా వర్క్‌షాప్ ప్రారంభం

- వీఎల్ఎస్ఐ సాంకేతికతపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాభూమి, వేంపల్లె

ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో 'చిప్‌నోవా – ఎక్స్‌ప్లోర్, డిజైన్, ఇంప్లిమెంట్' పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వీఎల్ఎస్ఐ సాంకేతిక వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు వీఎల్ఎస్ఐ సాంకేతికతపై శిక్షణ అందించనున్నారు. వీఎల్ఎస్ఐ రంగంలోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రాక్టికల్ విధానంలో విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు డిజిటల్ డిజైన్, వెరిలోగ్, ఆర్‌టీఎల్ డిజైన్, వెరిఫికేషన్ అంశాలపై అవగాహన కల్పించడం వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే వ్యాలీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొ. జి. విజయ ప్రకాష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. చల్లా. రత్నకుమారి, ఈసీఈ విభాగాధిపతి డా. బి.వి. సుధాకర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. వై. అరుణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వర్క్‌షాప్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎస్. భాస్కర్ రావు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఈసీఈ విభాగ అధ్యాపకులు విద్యార్థులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించగా, విద్యార్థి కోఆర్డినేటర్లు కార్యక్రమ నిర్వహణలో సహకరించారు. ఈ సందర్భంగా వీఎల్ఎస్ఐ, సెమీకండక్టర్ రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక మార్పులు, డిజిటల్ డిజైన్ ప్రాధాన్యత, పరిశ్రమల్లో విద్యార్థులకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ప్రాక్టికల్ డిజైన్, సిమ్యులేషన్, వెరిఫికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా మూడు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.



పుట్లూరు మండల కేంద్రంలో విస్తృత ప్రచారం చేసిన మాజీ మంత్రి సాకే శైలజనాథ్

ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థితో ప్రచారం నిర్వహించిన సాకే శైలజనాథ్



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల కేంద్రంలో ఆదివారం సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ అభ్యర్థి భూమి రెడ్డి గారి రాధా విస్తృత ప్రచారం చేపట్టారు. మండల కేంద్రంలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ వైఎస్సార్సీపీ గుర్తు ఫ్యాన్ గుర్తు




అని ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని భూమి రెడ్డి రాధమ్మ ఓటర్లను అడిగారు. ఈ సందర్భంగా పుట్లూరు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పుట్లూరు మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని ఈ 11 ఎంపీటీసీ స్థానాలలో అత్యధిక స్థానాలలో వైయస్సార్సీపి అభ్యర్థులను గెలిపించి సింగనమల నియోజకవర్గం బహుమానంగా అందజేయాలని ఇందుకోసం ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్త కష్టపడి పనిచేయాలని వైఎస్ఆర్సిపి శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా సాకే శైలజనాథ్ మాట్లాడుతూ మరో రెండు సంవత్సరాలలో నేనే ఎమ్మెల్యేగా గెలుస్తానని మేము చేసిన పనులను మరియు చేయబోవు పనులను చెప్పి చేసే పార్టీ వైఎస్ఆర్సిపి పార్టీ అని వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే ఎంపీటీసీ అభ్యర్థి భూమి రెడ్డి రాధమ్మకు మరియు జడ్పిటిసి అభ్యర్థి విద్య నారాయణస్వామికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని పుట్లూరు మండల కేంద్రంలోని ఓటర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనసేన పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కూటమి ప్రచారం

- లక్ష్మీదేవికి మద్దతుగా ఇంటింటా ప్రచారం..

గాజు గ్లాస్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి



ప్రజాభూమి, వేంపల్లె

ఎన్డీఏ కూటమి బలపరిచిన జనసేన పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవి గెలుపే లక్ష్యంగా పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్తలు దాసరి రవిశంకర్, డా. హరీష్ నేతృత్వంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఆదివారం వేంపల్లె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బెస్త లక్ష్మీదేవికి మద్దతుగా స్థానిక పట్టణంలోని శ్రీరామ్ నగర్‌తో పాటు పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు కేటాయించిన గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవి విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులోనూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ జనసేన పార్టీ అభ్యర్థి లక్ష్మీదేవికి ఓటర్ల మద్దతు లభించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు చైతన్య కుమార్, మల్లిఖార్జున, మనోజ్, నాగేంద్ర, ఆంజనేయులు, జయచంద్ర, నారాయణ స్వామి, నరసింహ, దేవా, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట మండలం జి, పాలెం పంచాయితీలో కూటమి నాయకుల ఎన్నికలప్రచార జోరు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

జి. పాల్యం పంచాయితీ టిడిపి నాయకుడు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఇంటింట ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పిటిసి అభ్యర్థిని జి. పాలెం తేజవతిని వరుస నెంబర్ 2 కమలం గుర్తుపై ఓటు వేసి



అత్యంత మెజారిటీతో గెలిపించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి. జి.పాలెం రాజశేఖర్ రెడ్డి, బిజెపి కృష్ణారెడ్డి, వేణు ముదిరాజ్, శివ, మధు, రాజు జనసేన, డి.మం జుల, పూజిత, అంక మ్మ, మీనా, ప్రభు, ఇజ్రాయిల్, సత్య,భాస్కర్, షేక్ బాషా, శోభనాద్రి, తదితర కూటమి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 8
సోమవారం 02 నవంబరు 2026

మీడియా ప్రతినిధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత...!

- జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

పాత్రికేయుడిపై దాడి ఘటనలో కేసు నమోదు.. సీసీ కెమెరాలు, డ్రోన్ దృశ్యాలతో నిందితుల గుర్తింపు

ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా మాజీ సీఎం హెలికాప్టర్ ల్యాండింగ్‌కు భద్రతా ఏర్పాట్లు



ప్రజాభూమి ప్రతినిధి,కడప: జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, మీడియా ప్రతినిధుల భద్రతకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో.. జేసీ డా. నిధి మీనాతో కలిసి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడారు. ఈ సందర్భంగా పులివెందులలో పాత్రికేయుడిపై జరిగిన దాడి ఘటనపై వెంటనే కేసు నమోదు చేశామని, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హెలికాప్టర్ ల్యాండింగ్‌కు పటిష్ట భద్రత...

మాజీ ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంపై తొలుత అందిన సమాచారం ప్రకారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు. అయితే ఆదివారం ఉదయం ల్యాండింగ్ సమయాన్ని ఉదయం 9.45 గంటలకు మార్చినట్లు సమాచారం అందిందన్నారు. మాజీ ముఖ్యమంత్రికి జెడ్ ప్లస్ భద్రత ఉన్నందున ఎల్లో బుక్ నిబంధనల ప్రకారం పైలట్, ఎస్కార్ట్, రోప్ పార్టీలతో సహా అవసరమైన భద్రతా ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేశామని వివరించారు. మరోవైపు పులివెందులలో ఉదయం 7 గంటల నుంచే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రారంభం కావడంతో పోలీసులు తెల్లవారుజామున 4 గంటల నుంచే విధుల్లో ఉన్నారని తెలిపారు. పరిమిత సంఖ్యలో సిబ్బంది అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేసి, హెలికాప్టర్ సురక్షితంగా దిగేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

జర్నలిస్టుపై దాడి ఘటనలో కేసు నమోదు...

పులివెందులలో ఓ జర్నలిస్టు కెమెరాను ధ్వంసం చేసిన ఘటనపై వెంటనే స్పందించి కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. బాధిత పాత్రికేయుడికి వ్యక్తిగత భద్రత కల్పించామని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ దృశ్యాలను పరిశీలించి ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయుల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, మీడియా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రశాంతంగా పోలింగ్.. అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దు...

పులివెందులతో పాటు జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. కొన్ని చిన్నపాటి ఘటనలు మినహా పెద్దగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తలేదని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న అవాస్తవ సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని, ఎన్నికలపై ఎలాంటి అపోహలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

పులివెందులలో ఉద్రిక్తత - ఆర్వో కార్యాలయం ముందు వైఎస్ జగన్ ధర్నా

పోలింగ్ బూత్ ల్లోకి తమ ఏజెంట్లను అనుమతించడం లేదని ఆరోపణ - ఏజెంట్లతో ఆందోళన

జగన్, అవినాష్ రెడ్డికి ఆర్వో కార్యాలయంలోకి అనుమతి నిరాకరణ



ప్రజాభూమి, పులివెందుల:

ఏపీలో 92 పట్టణ స్థానిక సంస్థల్లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు ఒక ఎత్తు అయితే, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల ఎన్నిక మరో ఎత్తు అన్నట్లుగా సాగుతోంది. పులివెందుల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా తమ పార్టీకి చెందిన పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ బూత్ లలోకి అనుమతించడం లేదంటూ ఏజెంట్లు వైఎస్ జగన్ ను కలిసి ఫిర్యాదు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఏజెంట్ల ఫిర్యాదుతో వైఎస్ జగన్ వారిని తీసుకుని పులివెందుల ఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లారు. అయితే స్థానిక ఎమ్మెల్యే అయిన వైఎస్ జగన్ ను, స్థానిక ఎంపీ అయిన వైఎస్ అవినాష్ రెడ్డిని కూడా ఆర్వో కార్యాలయంలోకి అనుమతించకపోవడం తో వారు వైఎస్సార్సీపీ పోలింగ్ ఏజెంట్లతో కలిసి బయటే ధర్నాకు దిగారు. దీంతో ఆర్వో కార్యాలయం బయట ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి.పోలింగ్ బూత్ లలోకి తమ ఏజెంట్లను అనుమతించకపోవడంపై వైఎస్ జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు తమను లోపలికి అనుమతించకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. చివరకు అధికారులు ఏజెంట్లను మాత్రం లోపలికి పంపగా, వారు పోలింగ్ బూత్ ల వద్ద పోలీసుల తీరుపై ఆర్వోకు ఫిర్యాదు చేశారు.మరికొన్ని గంటల్లో పోలింగ్ సమయం ముగియనుండగా, తమ ఏజెంట్లను బూత్ లలోకి అనుమతించకపోతే రిగ్గింగ్ జరిగే అవకాశం ఉందని వైఎస్సార్సీపీ ఆరోపిస్తోంది. వారి ఫిర్యాదు ఆధారంగా ఆర్వో ఇప్పుడు ఏం చర్యలు తీసుకుంటారన్నది ఉత్కంఠ రేపుతోంది.

వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటి ప్రచారం

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని రవికుమార్ రెడ్డి, చంద్రఓబుల్ రెడ్డి విజ్ఞప్తి



ప్రజాభూమి, వేంపల్లె

వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి వెంకట శివమ్మకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఆదివారం వేంపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించా రు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి స్థానిక పట్టణంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ఓటర్లను కలిశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వెంకట శివమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, చంద్రఓబుల్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో వేంపల్లె మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తించి జడ్పీటీసీ అభ్యర్థి వెంకట శివమ్మకు మద్దతుగా నిలవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత ప్రజలు ఆశించిన మేర అభివృద్ధి జరగడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కటిక చంద్ర, కొండయ్య, దస్తగిరి, భారతి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం

నవంబర్ 2, 3 తేదీల్లో పోరుమామిళ్ల ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాభూమి పోరుమామిళ్ల :

పోరుమామిళ్ల మండలంలోని దమ్మనపల్లె, చిన్న యరసాల ఎంపీటీసీ ఎన్నికలు--2026 విధుల్లో భాగంగా ఇతర మండలాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె. ఉపేంద్ర రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నవంబర్ 2, 3 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోరుమామిళ్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో నియమితులైన ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్ణీత తేదీలు, సమయాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

శ్రీ రేణుక ఎల్లమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం:

మండలంలోని మాచుపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ రేణుక ఎల్లమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ నందర్భంగా తెల్లవారుజామున ఆలయ అర్చకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు జలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలని ఈ సందర్భంగా అర్చకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఏటి గంగమ్మ అమ్మవారికి మహిళల బోనాల సమర్పణ



ప్రజాభూమి, సిద్ధవటం:

మండలంలోని పెద్దపల్లి పంచాయతీ పరిధి భాకరాపేట గ్రామ శివారులో కొలువై ఉన్న ఏటి గంగమ్మ అమ్మవారికి ఆదివారం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించా రు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహకుడు మునిగాళ్ల సుబ్బయ్య మాట్లాడుతూ, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలనే ఆకాంక్షతో మహిళలు ఏటి గంగమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



ప్రజాభూమి, వేంపల్లె

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని, తెలుగు భాష మాట్లాడే ప్రజల కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆయన చేసిన ప్రాణత్యాగం మరువలేనిదని వేంపల్లె ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవాపా) అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్, అవాపా మహిళా విభాగం అధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి దేవస్థానం ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించారని కొనియాడారు. ఆయన చేసిన త్యాగం ఫలితంగానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలుగు ప్రజలు ఆయనను అమరజీవిగా, ఆంధ్ర జాతిపితగా గౌరవిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, అవాపా, అవాపా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

మాజీ సీఎం కాన్వాయ్‌కు అడ్డంగా దస్తగిరి వాహనం.. ఉద్రిక్తత

స్కార్పియో వాహనం ధ్వంసం చేసిన వైకాపా వర్గీయులు



ప్రజాభూమి,పులివెందుల

హెలిప్యాడ్ నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటున్న సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి చెందిన స్కార్పియో వాహనం మాజీ సీఎం కాన్వాయ్‌కు అడ్డంగా నిలవడంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.దీంతో ఆగ్రహానికి గురైన వైకాపా వర్గీయులు స్కార్పియో వాహనాన్ని అడ్డుకుని ధ్వంసం చేశారు . అనంతరం పోలీసులు వాహనాన్ని అక్కడి నుంచి వెనక్కి పంపించారు. ఈ ఘటనతో కొద్దిసేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

పులివెందులలో వైసీపీ గూండాగిరి.. ప్రజాస్వామ్యంపై దాడి -- బీటెక్ రవి ఆరోపణ

నియోజకవర్గం నలుమూలల నుంచి గుండాలను రప్పించి రిగ్గింగ్ - వెంకటాపురం, గర్ల్స్ హైస్కూల్ కేంద్రాల్లో అరాచకం

ప్రతి బూత్ ను అవినాష్ రెడ్డి, దుశ్యంత్ రెడ్డి విజిట్ చేస్తూ బెదిరింపులు - నన్ను హౌస్ అరెస్ట్ చేశారు: బీటెక్ రవి



ప్రజాభూమి, పులివెందుల:

పులివెందుల మున్సిపల్ పోలింగ్ సందర్భంగా వైసీపీ నేతలు అరాచకం సృష్టిస్తున్నారని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తీవ్ర ఆరోపణ లు చేశారు.నియోజకవర్గం నలుమూలల నుంచి వైసీపీ గుండాలను రప్పించి కర్రలు, కత్తులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. వెంకటాపురం, వెలమలపల్లి, గర్ల్స్ హైస్కూల్, జూనియర్ డిగ్రీ కాలేజీ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను బెదిరిస్తూ యథేచ్ఛగా రిగ్గింగ్ కు పాల్పడుతున్నారని తెలిపారు.ఎంపీ అవినాష్ రెడ్డి, దుశ్యంత్ రెడ్డి ప్రతి బూత్ ను విజిట్ చేస్తూ ఓటర్లను, టీడీపీ ఏజెంట్లను భయభ్రాంతు లకు గురిచేస్తున్నారని బీటెక్ రవి పేర్కొన్నారు.తనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారని, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను వైసీపీ అపహాస్యం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ అరాచకాన్ని వెంటనే అరికట్టాలని పోలీసులకు, ఎన్నికల అధికారులకు, మీడియాకు ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థినిపై దాడి ఘటన తీవ్రంగా కలచివేసింది

--మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

ప్రజాభూమి పోరుమామిళ్ల :

రాపాడులో విద్యార్థినిపై జరిగిన అమానుష దాడి ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్, డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. విద్యార్థినిపై ఇలాంటి దాడి జరగడం హృదయ విదారకమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగ రాష్ట్ర ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, అరెస్టు చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి. అప్పుడు ఇలాంటి ఘటనలు పునరావృతం కావు అధికారులను కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.

సీఐ చంద్రశేఖర్ అత్యుత్సాహం - ఓటర్లపై లాఠీఛార్జ్

మీడియాపై దురుసు ప్రవర్తన- మీరు మనుషులేనా ఇక్కడ ఉండకూడదు అంటూ హుకుం

100 మీటర్ల నిబంధన మీడియాకేనా, టీడీపీ కార్యకర్తలు బూత్ వద్ద ఉంటే తప్పులేదా?: ప్రశ్నించిన పాత్రికేయులు



ప్రజాభూమి, పులివెందుల:

మున్సివల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా ఇస్లాంపురంలోని ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సీఐ చంద్రశేఖర్ అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓటు వేయడానికి వస్తున్న ఓటర్లను అడ్డుకుంటూ, ప్రశ్నించిన ఓటర్లపై లాఠీఛార్జ్ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధుల పట్ల కూడా ఆయన దురుసుగా వ్యవహరించారు.మీరు మనుషులేనా, ఇక్కడ ఉండకూడదు" అంటూ మీడియా ప్రతినిధులపై హుకుం జారీ చేశారని, ఎక్కడి నుంచో వచ్చిన టీడీపీ కార్యకర్తలను వెనకేసుకొచ్చి హల్ చల్ సృష్టించారని ఆరోపణలు ఉన్నాయి. పోలింగ్ బూత్ కు 100 మీటర్ల దూరంలో ఉండాలని మీడియాకు చెప్పిన సీఐ, టీడీపీ కార్యకర్తలు మాత్రం బూత్ దగ్గరగా ఉండటంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా "మా ఇష్టం" అంటూ దురుసుగా సమాధానం చెప్పారని తెలిపారు. దీంతో సీఐ చంద్రశేఖర్ కు, మీడియా ప్రతినిధులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.బాధ్యతగా వ్యవహరించాల్సిన సీఐ ఇలా దురుసుగా ప్రవర్తించడంపై మహిళా ఓటర్లు, మీడియా ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పులివెందులలో వైసీపీ దౌర్జన్యాలపై టీడీపీ ధర్నా

ఓటింగ్ జరగకుండా అవినాష్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి అడ్డంకులు మున్సివల్ కార్యాలయం వద్ద బీటెక్ రవి ఆధ్వర్యంలో అందోళన

జగన్ ర్యాలీగా వచ్చి ధర్నా చేయడం ఎంతవరకు సమంజసం: బీటెక్ రవి ప్రశ్న



ప్రజాభూమి,
పులివెందుల:

పులివెందుల పట్టణంలో పలు వార్డులలో ఓటింగ్ సక్రమంగా జరగకుండా ఎంపీ అవినాష్ రెడ్డి, దుష్యంత్ రెడ్డిలు అడ్డంకులు సృష్టించారని టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి ఆరోపించారు. పులివెందుల మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం బీటెక్ రవి ఆధ్వర్యంలో కూటమి నేతలు దేవిరెడ్డి సంజీవరెడ్డి, చైర్మన్ అభ్యర్థి గీతా కుమారి, విశ్వనాథ్ రెడ్డిలతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, పలు వార్డుల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ ఓటింగ్ ను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ వైఎస్ జగన్ ర్యాలీగా బయలుదేరి వచ్చి ధర్నా చేయడం, రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే విధంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే చర్యలకు పాల్పడటం సరికాదని, పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అర్ధరాత్రి వాహనాలకు నిప్పు - 8 వాహనాలు దగ్ధం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందులలో గుర్తుతెలియని దుండగులు వాహనాలకు నిప్పు పెట్టిన ఘటన కలకలం రేపింది. ఉలిమెల్ల గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి తోట వద్ద నిలిపి ఉంచిన మూడు కార్లు, పది ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు.ఈ ఘటనలో కార్లతో సహా ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 9

సోమవారం 02 నవంబరు 2026

ఓటు హక్కుకు అండగా పోలీసుల మానవీయ హస్తం!

భద్రతా విధుల్లోనూ సేవా దృక్పథం.. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సహాయం

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

ప్రజాస్వామ్య వండుగలో ప్రతి ఓటరూ భాగస్వామి కావాలనే సంకల్పంతో తిరుపతి జిల్లా పోలీసులు భద్రతా విధులతో పాటు మానవీయ సేవల్లోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూనే, పోలింగ్ కేంద్రాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న ఓటర్లకు అండగా నిలుస్తున్నారు. కేవలం భద్రతే కాదు.. ఓటర్లకు భరోసా కూడా!: జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారి ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు



అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వీల్‌చైర్‌పై వచ్చిన ఓ వృద్ధురాలిని పోలీసు సిబ్బంది స్వయంగా దగ్గరుండి తీసుకెళ్లి, ఆమె ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం పోలీసుల మానవీయతకు అద్దం పడుతోంది. విధి నిర్వహణలో బాధ్యత.. సేవలో మానవత్వం!: ఎన్నికల సమయంలో పోలీసుల బాధ్యత శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాదని, ప్రజలకు భద్రతతో పాటు ఆత్మవిశ్వాసం, భరోసా కల్పించడం కూడా ముఖ్యమని జిల్లా ఎస్పీ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సిబ్బంది అవసరమైన సహాయాన్ని అందించాలని ఆదేశించారు. ప్రతి ఓటు విలువెనదే.. ప్రతి ఓటరికి గౌరవమే!: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు, ఆ హక్కును ప్రతి ఒక్కరూ ఎలాంటి ఇబ్బంది, భయం లేకుండా వినియోగించుకునేలా భద్రత కల్పించడంతో పాటు అవసరమైన చోట మానవీయంగా స్పందించడం తమ బాధ్యతగా తిరుపతి జిల్లా పోలీసులు భావిస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణ, ప్రజల పట్ల బాధ్యతాయుతమైన సేవా దృక్పథంతో ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖ ప్రజలకు భరోసాగా నిలుస్తోంది.

నాగారపమ్మ తల్లి ఆశీస్సులతో టీడీపీ సైకిల్ ప్రచారానికి శ్రీకారం !

వాకాడు బజారు వీధి, ముస్లిం వీధుల్లో అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు



వాకాడు గ్రామ దేవత నాగారపమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులతో టీడీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. టీడీపీ ప్రధాన నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సతీమణి, జడ్పీటీసీ అభ్యర్థి సన్నారెడ్డి అనిత, వాకాడు ఎంపీటీసీ-1 అభ్యర్థి బత్తిన ప్రమీల, ఎంపీటీసీ-2 అభ్యర్థి కాటంరెడ్డి రేవతి ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం వాకాడు బజారు వీధి, ముస్లిం వీధుల్లో అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ, టీడీపీ ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాబోయే రోజుల్లో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా అమలు చేసేందుకు కృషి చేస్తామని అభ్యర్థులు ఓటర్లకు వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లిపాలెంలో చెంచమ్మ మృతికి దువ్వూరు జనార్దన్ రెడ్డి నివాళులు

కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన టీడీపీ యువ నాయకుడు



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండల పరిధిలోని నెల్లిపూడి పంచాయతీ పల్లెపాలెం గ్రామానికి చెందిన అట్లా చెంచమ్మ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు, నెల్లిపూడి ఎంపీటీసీ అభ్యర్థి దువ్వూరు జనార్దన్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పల్లాపల్లి వెంకటేశ్వర్లు, సతీష్, మహేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత శ్రీ గుండాల గంగమ్మ విగ్రహప్రాణ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



ప్రజా భూమి ప్రతినిధి
రామచంద్రపురం

రామచంద్రపురం మండలం గంగిరెడ్డివల్లి నమీవంలో వెలిసియున్న గ్రామదేవత గుండాల గంగమ్మ కుప్రాణ ప్రతిష్ట కార్యక్రమంఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మవారిని ధాన్యాగారం నుంచి వేద మంత్రోచారణల నడుమతీసుకొచ్చి గర్భాలయంలో ఉంచారు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించి అమ్మవారికి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ట చేశారు హోమగుండం నుంచి ప్రత్యేక మంత్రోచ్చారణలనడుమ ప్రాణ ప్రతిష్ట చేశారు అనంతరం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు ఆభరణాలు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు అమ్మవారి ఆలయాన్ని మామిడి తోరణాలు పలు రకాల పుష్పాలు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారుమహిళలు ఊరేగింపుగా అమ్మవారికి పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ కార్యనిర్వాహకులు బొడుగు వాసు యాదవ్, అమ్మవారి విగ్రహం దాత బొడుగు లక్ష్మీపతి యాదవ్ , మాజీ ఎంపీపీ అత్తూరు దామోదర్ రెడ్డి, ఏవి బ్రహ్మానందరెడ్డి, కమ్మ కండ్రిగ మాజీ సర్పంచ్ లు కాకర్ల కావ్య వేణుగోపాల్ నాయుడు, పూజారి పెద్దబ్బ యాదవ్, పూజారి జానకి, శేఖర్ యాదవ్, యాదవ కులస్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన జీవనశైలి వారోత్సవాలను నవంబర్ ఒకటవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ అన్నారు. ఆదివారం ఎస్. వి.ఏ. ప్రభుత్వ కళాశాల, శ్రీకాళహస్తి లో సుస్థిరమైన జీవనశైలి వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ బి వాణిశ్రీ మాట్లాడుతూ బ్రెజిల్ , రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాల కోటమిని బ్రిక్స్ కూటమి అంటారని, ఈ కూటమి నవంబర్ 1 నుండి 7వ తారీకు వరకు సుస్థిరమైన జీవనశైలి వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించిందని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఇంధన ఆదా, విద్యుత్ పొదుపు, జల సంరక్షణ తదితర అంశాలపై ఒక వారం రోజులు పాటు అవగాహన కల్పిస్తారని కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సుధీర్ తెలిపారు..... ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, డాక్టర్ గంగారామ్ పాల్గొన్నారు

ఈనాడు విలేఖరికి జాతీయ పురస్కారం 27 ఏళ్ల పాత్రికేయ సేవలకు గుర్తింపు



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు పాత్రికేయ రంగంలో 27 ఏళ్లుగా సేవలందిస్తున్న వాకాడు మండల ఈనాడు సీనియర్ విలేఖరి పి. వెంకట్ శరత్‌కు ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం లభించింది.నెల్లూరులో ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'జర్నలిస్టుల జాతీయ పురస్కారం-2026'ను ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ శరత్ సేవలను కొనియాడారు.ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు.జాతీయ పురస్కారం అందుకున్న పి.వెంకట్ శరత్‌కు పలువురు పాత్రికేయులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో శ్రీకాళహస్తి యువకుడి సత్తా..

గోల్డ్ మెడల్‌తో మెరిసిన బొద్దులూరు జ్యోతిశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్



అంతర్జాతీయ వేదికపై శ్రీకాళహస్తి కీర్తి పతాకాన్ని ఎగురవేస్తూ బొద్దులూరు జ్యోతిశ్వర్ అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నాడు. బెంగళూరులో నిర్వహించిన అండర్-16 కరాటే పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటాడు.బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వరల్డ్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పలు దేశాలకు చెందిన క్రీడాకారులు పోటీపడ్డారు. ఈ అంతర్జాతీయ పోటీల్లో బెంగళూరులోని స్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్న శ్రీకాళహస్తికి చెందిన బొద్దులూరు జ్యోతిశ్వర్ తన చురుకుదనం, పోరాట పటిమ, అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో ప్రత్యర్థులను అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు.ఈ పోటీల్లో జ్యోతిశ్వర్ ప్రథమ స్థానంతో గోల్డ్ మెడల్ సాధించగా, రెండో స్థానంలో కజకిస్తాన్, మూడో స్థానంలో రష్యా నిలిచాయి. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పలు దేశాల క్రీడాకారులతో తలపడి విజేతగా నిలవడం విశేషం.జ్యోతిశ్వర్ సాధించిన ఈ ఘన విజయంపై మాస్టర్ సంపత్ కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా స్వామినారాయణ గురుకుల్ విద్యాసంస్థ అధ్యాపకులు సైతం అతని ప్రతిభను కొనియాడుతూ ప్రశంసలు కురిపించారు.

వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి గంగారి సుజాతనుగెలిపించండి: బియ్యపు పవిత్రారెడ్డి పిలుపు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంటలో వైఎస్సార్‌సీపీ హోరెత్తిన ఇంటింటి ఎన్నికల ప్రచారం. చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె



బియ్యపు పవిత్రారెడ్డి ధ్వజమెత్తారు. రేణిగుంట జడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగారి సుజాతకు మద్దతుగా ఆదివారం పట్టణంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, మహిళలు, కార్యకర్తలతో కలిసి వీధివీధినా పర్యటించిన ఆమెకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు.ఈ సందర్భంగా బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బడుగు, బలహీన, అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు నేరుగా ఇంటి గడపకే చేరాయని గుర్తుచేశారు. కుల, మత, రాజకీయ వివక్ష లేకుండా ప్రతి పేదవాడి కళ్లల్లో జగనన్న వెలుగులు నింపారన్నారు. కూటమి అన్యాయాలను ఎదిరించాలన్నా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే గొంతును గెలిపించాలన్నా రేణిగుంటలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగరవేయాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 5న జరగనున్న జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలందరూ ఏకమై ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, మన అభ్యర్థి గంగారి సుజాతను అఖండ మెజారిటీ తో గెలిపించాలని బియ్యపు పవిత్ర రెడ్డి పిలుపునిచ్చారు.

తొట్టంబేడు మండలంలో మాజీ ఎమ్మెల్యే జోరుగా ఎన్నికల ప్రచారం

తొట్టంబేడు మండలం జడ్పీటీసీ అభ్యర్థి ఉన్నం వానుదేవ నాయుడు మరియు ఎంపీటీసీ అభ్యర్థులు రేవతి,తుపాకుల చెంచయ్య, కౌనల్య,కోగిలి సుబ్రహ్మణ్యం, రజినీ లను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా ప్రార్థన

ప్రజా సమస్యలను ఓటు రూపంలో చూపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు



శ్రీ కృష్ణాపురం, తుమ్మలగుంట, కారాకొల్లు, దొంగలమూడూర్లో ఇంటింటా ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి .స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొట్టంబేడు మండలం, శ్రీ కృష్ణాపురం, తుమ్మల గుంట, కారాకొల్లు, దొంగలమూడూర్ గ్రామంలో మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి ఉన్నం వాసుదేవ నాయుడుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక మంచి మనసున్న నాయకుడు వాసుదేవ నాయుడు ని జడ్పిటిసి అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా ఉన్నారని కానీ నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని అన్నారు. గడపగడపలో ప్రజలు ఎన్నో సమస్యలు తెలుపుతున్నారని వాళ్ళ బాధను అన్నింటిని ఓటు రూపంలో చూపించబోతున్నారు అన్నారు.జడ్పిటిసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మరోసారి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్లా సుదర్శన్ నాయుడు,కోవి చంద్రయ్య నాయుడు, మనీ నాయుడు, రాజేష్, చెంచయ్య నాయుడు, గల్లా వెంకటేశ్వర్లు, సురేష్, మణి, ఎం వెంకటేశ్వర్లు, జి వెంకటేశ్వర్లు, రాజేష్, ఎం రాజేష్, చెంచు కృష్ణయ్య,బాబు, కె బాబు,మణి, కే వెంకయ్య,మురళి,దశ, హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

5 నుండి 7వ తేదీ వరకు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు..!

నవంబరు 4న అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం..

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:



శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నవంబరు 5 నుండి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను టీటీడీ వైభవంగా నిర్వహించనుంది. ఈ ఉత్సవాలకు నవంబరు 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు మత్స్యగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలతో శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టనున్నారు.అదే రోజు ఉదయం 9.30 గంటలకు ఆచార్య రుత్విక్‌వరణం నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల విశేష కార్యక్రమాలు..

మొదటిరోజైన నవంబరు 5న ఉదయం 8.30 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి, రాత్రి 7 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ చేపడతారు.రెండో రోజైన నవంబరు 6న మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు.చివరిరోజైన నవంబరు 7న రాత్రి 8.30 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

స్నపన తిరుమంజనం, వీధి ఉత్సవం..

ఉత్సవాల్లో భాగంగా నవంబరు 5, 7 తేదీల్లో ఉదయం 11 గంటలకు, నవంబరు 6న ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. నవంబరు 6న సాయంత్రం 5 గంటలకు స్వామివారు, అమ్మవార్ల వీధి ఉత్సవం వైభవంగా నిర్వహిస్తారు.

ఆలయ పవిత్రత వరిరక్షణే పవిత్రోత్సవాల ఉద్దేశం..

ఆలయంలో తెలియక జరిగే దోషాల నివారణకు, ఆలయ పవిత్రతను కాపాడేందుకు ప్రతి సంవత్సరం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి సందర్భాల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. భక్తులు, సిబ్బంది తెలియక చేసే పొరపాట్ల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.ఈ సందర్భంగా వేదపఠనం, ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం తదితర వైదిక కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహిస్తారు.

గ్రద్దగుంట ఏం పి టి సి అభ్యర్థి గండవరం రమేష్ రెడ్డి విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

సూళ్లూరుపేట నియోజకవర్గం తడ మండలం గ్రద్దగుంటలో కాంగ్రెస్ పార్టీ ఏం పి టి సి అభ్యర్థి గండవరం రమేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి పాల్గొని పార్టీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ కరీముల్లా, శ్రీకాళహస్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుస్థిర జీవనశైలి వారోత్సవాలు ప్రారంభం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, సుస్థిర జీవనశైలి, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ మరియు ఆరోగ్యకరమైన జీవన విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు..ఈ సందర్భంగా డిఎంహెచ్వో డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ప్రజలందరూ పర్యావరణ హితమైన జీవనశైలిని అలవర్చుకుని, భావితరాలకు పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని ఆయన కోరారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు విలేజ్ హెల్త్ క్లినిక్స్ లో ఇంధన పొదుపు, నీటి సంరక్షణ, సంప్రదాయ ఆహారం మరియు చిరుధాన్యాల ప్రోత్సాహం, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణ వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వోలు, ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రజాభూమి
జనరల్ 10
సోమవారం 02 నవంబరు 2026

నేడు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన..

- : కేంద్ర కరువు బృందంలో వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ గోట్మారే టీమ్ లీడర్ , సభ్యులు నలుగురు, రాష్ట్ర నోడల్ అధికారి వ్యవసాయ డైరెక్టర్ మనజీర్ జీలానీ సమూన్ జిల్లా పర్యటన..

- : జిల్లాలో క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలన చేయనున్న కేంద్ర కరువు బృందం..జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

నవంబర్ 02వ తేదీన సోమవారం అనంతపురం జిల్లాలో కేంద్ర కరువు బృందం (అంతర్-మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం) పర్యటించనుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. కేంద్ర కరువు బృందం జిల్లాలో క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలన చేస్తారని తెలిపారు. కేంద్ర కరువు బృందం మినిట్ టు మినిట్ పర్యటన వివరాలు సోమ వారం కేంద్ర కరువు బృందం జిల్లాలో పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులను పరిశీలన చేయ నున్నారు. ముందుగా ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రానికి కేంద్ర కరువు బృందం చేరుకోనుంది. 2వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి 12:00 గంటల వరకు అనంత పురం కలెక్టరేట్ లో ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన కరువు బృందం సభ్యులకు ప్రిన్సిపల్ సెక్రటరీ / డైరెక్టర్, రెవెన్యూ, ఫోటో ఎగ్జిబిషన్ పై వారి బ్రీఫింగ్ ఇవ్వడం జరుగుతుంది. అనంతరం మధ్యాహ్నం 12:00 గంటల 12:30 గంటల వరకు ఆత్మకూ రు మండలంలోని పంపనూరు గ్రామానికి వెళ్లి 12:30 నుంచి మధ్యాహ్నం 01:15 వరకు పంపనూరు గ్రామంలో కరువుతో దెబ్బతిన్న ఆముదం గింజల పంట, కందిపప్పు, పెసరపప్పు పంటల క్షేత్ర సందర్శన, అక్కడే రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో ఇంటరాక్షన్, కూలీలతో ఇంటరాక్ట్, అంగన్వాడి కేంద్రం సందర్శన చేయనున్నారు. తదనంతరం ఆత్మకూరులోని గ్రూజూకు వెళ్లి అక్కడ 01:25 నుంచి 01:45 గంటల వరకు పశుపోషకులతో పశుగ్రాసం స్థితి మరియు పశు వుల మేత గురించి సంభాషిస్తారు. ఆ తరువాత కళ్యాణదుర్గం ఆర్డబికి చేరుకుంటారు. అనంతరం 03:15 నుంచి 03:45 గంటల వరకు



కళ్యాణదుర్గంలోని వద్ద లోతైన భూగర్భ జలమట్టం రీడింగ్ పరిశీలన చేస్తారు. తదనంతరం అక్కడి నుంచి కంబదూరు మండలం ములకనూరు గ్రామానికి వెళ్లి సాయంత్రం 04:00 నుంచి 04:30 గంటల వరకు వ్యవసాయం మరియు హార్టికల్చర్ పరిధిలో ములకనూరు గ్రామంలో కరువుతో దెబ్బతిన్న కంది, టమాటా పంటలను సందర్శించి, రైతులతో క్షేత్రస్థాయిలో సంభాషి స్తారు. ఆ తర్వాత కేంద్ర కరువు బృందం అక్కడ నుంచి బయలుదేరి అనంతపురం చేరుకుంటారు. కేంద్ర కరువు బృందంలో వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ గోట్మారే టీమ్ లీడర్గా, సభ్యులుగా మహాలనోబిన్ జాతీయ పంట అంచనా కేంద్రం (వ్యవసాయ మరియు కుటుంబ సంక్షేమ శాఖ) సహాయ సంచాలకులు ప్రభా కాంతి, గ్రామీణ శాఖ అండర్ సెక్రటరీ వినోద్ సమంత్, వ్యయ విభాగం డిప్యూటీ డైరెక్టర్ పంకజ్ పహాడియా, ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణ , మూల్యాంకన డైరెక్టరేట్ డైరెక్టర్ ఎన్.వి.సతీష్ సీమకుర్తి, రాష్ట్ర నోడల్ అధికారి వ్యవసాయ డైరెక్టర్ మనజీర్ జీలానీ సమూన్, పర్యటిం చనున్నారు. కేంద్ర కరువు బృందం జిల్లా పర్యటన కోసం అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన నాయుడుపేట మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికలు

25,996 ఓట్లు నమోదు.. 70.07 శాతం పోలింగ్

ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట.



నాయుడుపేట మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని 32 వార్డులకు సంబంధించి నిర్వహించిన ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఎన్నికల అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం 25,996 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 70.07 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలోని వివిధ పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరారు. యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పోలింగ్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, 32 వార్డుల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఓటర్ల తీర్పుతో తేలనుంది. ఎన్నికల ఫలితాలపై పట్టణవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

హిందూపురంలో ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

-68 శాతానికి పైగా ఓటింగ్.. -గత ఎన్నికలతో పోలిస్తే 2.5 శాతం హెచ్చు -52 వార్డుల్లో 89,392 ఓట్లు నమోదు

-బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పాలిటెక్నిక్ కళాశాల రిసెప్షన్ కేంద్రానికి తరలింపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పురపాలక సంఘంలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని 52 వార్డులకు సంబంధించి 156 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,31,427 మంది ఓటర్లకు గాను 89,3 92 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. దీంతో పట్టణంలో 68 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ మల్లికార్జున వెల్లడించారు. గత మున్సిపల్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం కేవలం 2.5 శాతం మాత్రమే పెరగడం గమనార్హం. ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు మున్సిపల్ అధికారులు అనేక చర్యలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఓటింగ్ శాతం పెరగకపోవ డం చర్చనీయాంశంగా మారింది. ఉదయం నుంచే పట్టణంలోని వివిధ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ప్రారంభంలో పోలింగ్ ప్రక్రియ ఉత్సాహంగా సాగినప్పటికీ మధ్యాహ్నం తర్వాత ఓటర్ల రాక కొంత తగ్గింది. ముఖ్యంగా సాయం త్రం వేళ పోలింగ్ మందకొడిగా సాగినట్లు కనిపించింది. ఉదయం నుంచి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపగా, చివరి గంటల్లో మాత్రం పోలింగ్ కేంద్రాల వద్ద అంతగా సందడి కనిపించలేదు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు సైతం ఉదయమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.





చెదురుమదురు ఘటనలు, పోలీసుల అప్రమత్తత

ఎన్నికల సందర్భంగా పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో చిన్నచిన్న చెదురుమదురు సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ పోలింగ్ ప్రక్రియకు పెద్దగా అంతరాయం కలగలేదు. సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు సిబ్బందిని మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అయితే కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నాయకు లు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి పోలింగ్ కొనసాగించేలా చర్యలు చేపట్టారు.

పాలిటెక్నిక్ కళాశాలకు బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ సమయం ముగిసిన అనంతరం ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఇతర సామగ్రిని పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించారు. అక్కడ ఎన్నికల ప్రత్యేక అధికారి మహబూబ్ బాషాకు బ్యాలెట్ బాక్సులు, మిగిలిన ఎన్నికల సామాగ్రిని ఎన్నికల సిబ్బంది అప్పగించారు. అధికారులు వాటిని స్వీకరించి తదుపరి ప్రక్రియకు సంబం ధించిన ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పోలింగ్ ముగిసే వరకు ఎలాం టి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిం చారు. డీఎస్పీ రవిబాబుతో పాటు పట్టణ సీఐలు ప్రసాద్బాబు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు ఇతర పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. మొత్తంగా చెదురు మదురు ఘటనలు మినహా హిందూపురం మున్సి పల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకుల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

3మున్సిపాలిటీల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట.



వెంకటగిరి,నాయుడుపేట, సూళ్లూరు పేట మున్సిపాలిటీలలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆదివారం ఎన్నికల వ్యయ పరిశీలకు లు ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ మహబూబ్ బాషా, ఐఎఫ్ఎస్ పలు పోలింగ్ కేం ద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భం గా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, ఏర్పాట్లు, ఓటర్లకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు,పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అలాగే ఎన్నికల వ్యయానికి సంబంధించిన నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో వెంకటగిరి, నాయుడుపేట,సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్లు,లైసనింగ్ ఆఫీసర్ వి.హేమంత్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బాలెట్ ఓటింగ్ నిర్వహించడం జరుగుతుంది. కావున చంద్రగిరి మండలంలో ఓటు హక్కు కలిగి ఎన్నికల విధుల్లో పాల్గొను ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బాలెట్ ద్వారా వినియోగించుకోవలసిందిగా చంద్రగిరి మండల ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి తెలియజేశారు.

వైఎస్సార్సీపీతోనే సంక్షేమం అభివృద్ధి సాధ్యం

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి- వైకాపా అభ్యర్థిని గెలిపించండి

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్షని నవరత్నాల ఫలాలు ప్రతి ఇంటా వెలుగులు నింపాయని వైఎస్సార్సీపీ నాయకులు స్పష్టం చేశారు. మండలంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్సీపీ అభ్యర్థులు గ్రామగ్రామాన విస్తృత పర్యటనలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఆదివారం సి .రామాపురం,, నెత్తకుప్పం పంచాయతీల పరిధిలో వైఎస్సార్సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థులు ఆరేపల్లి నందిని, మునెమ్మ, దొరస్వామి, కర్ణలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాబాహుళ్యానికి వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్న ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్సీపీ మద్దతుదారులను స్థానిక ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో 'ఫ్యాన్' గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని హోరెత్తించారు.

నాగ ప్రతిష్ఠ.. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

- వైభవంగా వేడుకలు.. ఉభయదాతలుగా ప్రసాద్ రావు దంపతులు

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని గాం ధ్లవీధిలో కొలువైన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నాగ ప్రతిష్ఠ, శ్రీ సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల నడుమ ఆలయ అర్చకులు శేషగిరిరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలుత నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించిన అనంతరం స్వామివారికి విశేష అభిషేకాలు చేసి, కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. ఈ వేడుకల్లో ఉభయదాతలుగా ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి శింగనమల సాంబశివుడితో పాటు పలువురు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీయూలో 'ఐఈఈఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఐసిఏఈఎస్ఐఎస్-2026' విజయవంతం..!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల 'ఐఈ ఈఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఐ సి ఏ ఈ ఎస్ ఐ ఎస్-2026' విజయవం తంగా జరిగింది. "సుస్థిర భవిష్యత్తు కోసం వినూత్న ఇంజనీరింగ్" అనే ఇతివృత్తంతో నిర్వ హించిన ఈ సదస్సులో భారత్, అమెరికాల నుంచి హాజరైన ప్రతినిధులు దాదాపు 280 పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ కాన్ఫరెన్స్లో విదేశీ, దేశీయ ప్రముఖ నిపుణులు డాక్టర్ కళ్యాణ్ కె. సేన్, ప్రొఫెసర్ శ్రీరామ శ్రీనివాస్, డాక్టర్ వి.ఎస్.కె. మూర్తి, బాలా ప్రసాద్ పెద్దిగారి, డాక్టర్ రామకృష్ణ కప్పగంతు, డాక్టర్ పద్మ సాయి యార్లగడ్డ పాల్గొని తమ అమూల్యమైన సందేశాలను అందించారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వి. రమణ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సారధి, డీన్ డాక్టర్ ఎస్. బాబు దేవసేనాపతిల మార్గదర్శకత్వంలో హెచ్ఓడీ డాక్టర్ ఎం.ఎస్. సుజాత, కోఆర్డినేటర్లు డాక్టర్ బి. హేమంత్ కుమార్, డాక్టర్ సురేష్ బాబు దారమ్, ఈఈఈ విభాగ బృందం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక నైపుణ్యాలను పెంచేందుకు ఈ సదస్సు ఎంతగానో దోహ దపడుతుందని నిర్వాహకులు తెలిపారు.



ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్..!

- కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని నిరంతరం పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ - వెబ్కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిస్థితులపై పర్యవేక్షణ...

ప్రజా భూమి - కడప కలెక్టరేట్

వైఎస్సార్ కడప జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో మున్సిపల్ ఎన్నికల పోలిం గ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోం దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను డీఐజి కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ పెద్దే నచికేత్ విశ్వనాథ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. వెబ్కాస్టింగ్ ద్వారా వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని, ఎన్నికల నిర్వహణ తీరును పరిశీ లించారు. అధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహ ణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనల కు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించా రు. జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైందని తెలిపారు. మొత్తం 560 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగు



తోందని, వీటిలో 335 కేంద్రాల్లో వెబ్కాస్టింగ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామని, ఎన్నికల సిబ్బంది సమ న్వయం తో విధులు నిర్వహిస్తున్నారని తెలి పారు. సమస్యా త్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత కల్పించామని పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టెలను నిర్దేశించిన భద్రతా గదులకు తరలించి భద్రపరిచే దుకు చర్యలు తీసుకున్నామని, నవంబర్ 3వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కిం పునకు కూడా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పారదర్శకంగా నిర్వహించే దుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

ప్రజాభూమి
జనరల్ 11
సోమవారం 2 నవంబర్ 2026

పులివెందులలో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ

(మొదటిపేజీ తరువాయి)

పులివెందులలో తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం గుండాలు దగ్గరుండి ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి లాగి బయటకు పంపేశారు. ఎక్కడా మా పార్టీ ఏజెంట్లను బూత్‌ల్లోకి పంపించే కార్యక్రమం జరగలేదు. పోలీసులు దగ్గరుండి, తెలుగుదేశం వారికి సహకరిస్తున్నారు.

అసలు ఇది ప్రజాస్వామ్యమేనా? మనం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉన్నామా? అన్న సందేహం కలుగుతోంది.

పులివెందులలో ఇన్ని జరుగుతున్నా కనీసం అడిగే నాథుడు లేడు.

ఎస్పీకి ఫోన్ చేశాం. కలెక్టర్‌కు ఫోన్ చేశాం. కానీ ఏ మాత్రం ప్రయోజనం లేదు. పొద్దున నుంచి పులివెందులలో జరిగిన ఘటనల క్రమం చూస్తే.. తెల్లవారుజామున 4 గం. నుంచే తెలుగుదేశం పార్టీ వాళ్ళు బూత్‌లు ఆక్రమించారు. అలా పోలింగ్ కేంద్రాలు ఆక్రమించి, ఓటర్లను భయభ్రాంతులను గురి చేస్తున్నారు. మా పార్టీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి ప్రమీలమ్మపై దాడి చేశారు. పోలింగ్ ఏజెంట్ సునంద చెయ్యి విరగ్గొట్టారు.

ఓటు వేయడానికి వచ్చిన ప్రజలను పోలింగ్ కేంద్రాల వద్దే అడ్డుకున్నారు. మహిళలను బెదిరించారు. ఓటర్ స్లిప్‌లను బలవంతంగా లాక్కొని వెనక్కి పంపించారు. అలా పోలింగ్ బూతులను ఆక్రమించి దొంగ ఓట్లు వేస్తున్నారు. అసలు ఓటర్ వచ్చే సరికే, దొంగ ఓట్లు వేస్తున్నారు.

మరోవైపు పోలీసులు టీడీపీ కార్యకర్తలకు సహకరిస్తూ, వైయస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను అడ్డుకుంటున్నారు. పలు చోట్ల లాఠీఛార్జ్ చేశారు. మా పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిని బలవంతంగా పోలీసులు జీప్‌లోకి ఎక్కించుకొని పోయారు.

ఎన్నికల అక్రమాలు చిత్రీకరిస్తున్న ఇండియా టుడే ఛానల్, ఎన్టీవీ ఛానల్ రిపోర్టర్లు, కెమెరామెన్ల మీద దాడి చేశారు. వారి కెమెరాలు, సెల్ ఫోన్లు ధ్వంసం చేశారు.

తమను ఓటు వేయనీయడం లేదని చివరకు ఓటర్లు ధర్నాకు దిగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. కనీసం వారిని తీసుకెళ్లి ఓట్లు వేయించే కార్యక్రమం కూడా జరగడం లేదు. అంత దారుణమైన పరిస్థితి ఉంది.

ఇక్కడ నా ఇల్లు, ఓటు ఉంది కాబట్టి, ఈ బూత్‌లో మాత్రమే మా పార్టీ ఏజెంట్లను కూర్చోబెట్టారు. ఇంకా ఆశ్చర్యం ఎక్కడ కనిపిస్తుందంటే.. పులివెందులతో పాటు, కడప, జమ్మలమడుగు, చిత్తూరు, మాచర్ల, చిలకలూరిపేట, తాడిపత్రి, మదనపల్లి, చీమకుర్తి, కుప్పంలో కూడా ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నిజంగా నేను చంద్రబాబునాయుడుని అడుగుతా ఉన్నాను. 'సిగ్గుండాలయ్యా నీకు చంద్రబాబునాయుడు'. ఇదే ఎస్పీని కూడా అడుగుతున్నాను. టీడీపీకి సహకరిస్తున్న కలెక్టర్లు, ఎస్పీలను అడుగుతున్నాను. ఇప్పుడు మీరు సెట్ చేస్తున్న ఒక తప్పుడు సంప్రదాయం, రేపు పొద్దున రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతుంది?. భావితరానికి మీరు పంపిస్తున్న మెసేజ్ ఏమిటి?.

రేపు పొద్దున ఇంకా ఎన్నికలు అనేవి ఆంధ్ర రాష్ట్రంలో జరగవు. ఈ మాదిరిగా కక్షలు, కార్పణ్యాలతో, ఇలా ఎలక్షన్లు నిర్వహిస్తే రేపు పొద్దున ఇంకొక పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు, మీరు గతంలో ఇదే మాదిరిగా చేస్తే తప్పు లేనప్పుడు, మేము చేస్తే తప్పు ఏముంది అని.. కార్యకర్తలు కూడా తిరగబడతారు. అలా ఇప్పుడు మీరు ఒక తప్పుడు సంప్రదాయం మొదలు పెడుతున్నారు.

చంద్రబాబునాయుడు దాదాపు 80 ఏళ్ల వయసులోకి వచ్చిన తర్వాత కూడా ఇటువంటి దరిద్రమైన పనులు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న పరిస్థితులు చూస్తే, అసలు ఈ మనిషి ముఖ్యమంత్రిగా కొనసాగడానికి ఒక్క రోజు కూడా అర్హుడు కాదు. రొటేషన్ పద్ధతిలో ఓట్లన్నీ వీళ్ళంతకు వీళ్ళే గుద్దుకుంటా ఉన్నారు. కళ్ళ ముందే ఇలా ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. ఇక్కడ బందోబస్తు కోసం 1000 మంది పోలీసులను తీసుకొచ్చినట్లు చెప్పారు. అసలు ఆ పోలీసులను ఎందుకు తీసుకొచ్చారంటే ఈ అక్రమాలకు సపోర్ట్ చేయడం కోసం.

మన కళ్ళెదుటే ఇన్ని వందల మంది ప్రతి బూత్ దగ్గర కనిపిస్తున్నారు. పక్కాగా తెలుగుదేశం పార్టీ గుండాలు కనిపిస్తున్నారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరు. 70 బూత్‌ల్లో నుంచి మా పార్టీ ఏజెంట్లను తరిమేశారు. ఇదే విషయం ఎస్పీకి ఫోన్ చేసి అడిగాను. ఆయనకన్నీ తెలుసు. అన్నీ చూస్తూ అలాగే ఊర్కుంటారు. కలెక్టర్‌కు కూడా అన్నీ తెలుసు. అయినా ఆయన అలాగే అన్నీ చూస్తూ కూర్చుంటారు. మరి అలాంటప్పుడు ఇది ఏ రకంగా నిజమైన ఎన్నిక?.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మరి ఎన్ని చోట్ల ఆ ఏర్పాట్లు చేశారు? సీసీ టీవీ లైవ్ ఫుటేజ్ లేకుండా మీరు ఏ రకంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు?.

బెంగళూరు నుంచి ఛాపర్‌లో నేను బయలుదేరాను. ఇక్కడికి రావడానికి నిన్న అనుమతి కూడా ఇచ్చారు. కానీ, నా ఛాపర్ ప్రయాణం మధ్యలో ఉండగా, పులివెందులలో ఛాపర్ ల్యాండింగ్‌కు అనుమతి నిరాకరించారు. పులివెందులలో జగన్ ఛాపర్ ల్యాండ్ కావొద్దు. 3 గం. తర్వాతే నేను ఇక్కడికి రావాలని అన్నారు. అలా అంటూ, నిన్న ఇచ్చిన పర్మిషన్ రద్దు చేసినట్లు ప్రకటించారు. దీంతో విషయాన్ని నేరుగా పౌర విమానయాన శాఖకు చెప్పడం జరిగింది. దాంతో వారు అధికారుల నిర్ణయాన్ని తీవ్రంగా తప్పు బట్టారు. ఛాపర్ ల్యాండింగ్‌కు నిన్న పర్మిషన్ ఇచ్చి, హఠాత్తుగా ఈరోజు దాన్ని రద్దు చేయడాన్ని ఆ శాఖ అధికారులు తప్పు బట్టారు. అంతే కాకుండా ఛాపర్ మార్గమధ్యలో ఉన్నప్పుడు ఇలా ల్యాండింగ్ పర్మిషన్ రద్దు చేయడం సరికాదని వారు తేల్చి చెప్పడంతో, ఎట్టకేలకు ఇక్కడ ఛాపర్ ల్యాండింగ్‌కు ఒప్పుకున్నారు. అంటే ఏ స్థాయిలో కుట్ర జరుగుతోంది అన్న విషయం అర్థం చేసుకోవచ్చు.

పెద్దలంతా కలిసి ఇలా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే ఎలా?. నక్సలిజం అనేది ఎక్కడి నుంచి పుడుతుంది?. ప్రజలను కాపాడాల్సిన వాళ్లే, ప్రజలను భక్షించే కార్యక్రమాలు చేసినప్పుడు, ప్రజలను కాపాడాల్సిన వారే, ప్రజలకు అన్యాయం చేసినప్పుడు నక్సలిజం పుడుతుంది, కాక్రోచ్‌లు పుడతాయి.

ఈరోజు రాష్ట్రంలో పరిస్థితి దయనీయంగా మారింది. దానికి కారణం పాలకులుగా ఉన్న వారు. వారు తమ మనస్సాక్షిని అడగాలి. మీరు చేస్తున్న పాలన బాగుందా అని? ఒకవేళ మీరు చేస్తున్న పాలన బాగుంటే, మరీ ఈ స్థాయికి దిగజారాల్సిన అవసరం ఉందా?

సూపర్ సిక్స్‌లు లేవు. సూపర్ సెవెన్లు లేవు. ప్రజలకి ఇచ్చిన బాండ్లు అన్నీ ఒట్టివే అయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తున్నారు. మరోవైపు వ్యవస్థలన్నీ కుప్పకూలాయి. పిల్లలకు ఫీజ్ రీయంబర్స్‌మెంట్ లేక.. విద్యాదీవెన, వసతిదీవెన రాక పిల్లలు తిరగబడుతున్నారు. ఉద్యోగస్తులకు మేనిఫెస్టోలో చెప్పినవి ఏవీ అమలు కాక, వారూ తిరగబడుతున్నారు. మహిళలకు చివరికి సున్నా వడ్డీ కూడా రద్దు చేశారు. దాంతో వారూ తిరగబడుతున్నారు. రైతులకు ఏ ఒక్కరికి గిట్టుబాటు ధర రావడం లేదు, రైతులకు ఇచ్చిన హామీలన్నీ మోసాలుగా తేలడంతో, వారూ తిరగబడుతున్నారు.

రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా చంద్రబాబునాయుడితో సంతోషంగా లేరు. అందుకే ఎన్నికలు జరగకూడదన్న కుట్ర. అలా ఎన్నికలను బుల్డోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. మీ పాలన బాగుంటే, నిజంగా మీరు ప్రజలకు మంచి చేశారని అనుకుంటే, ఎందుకు ఇంతగా దిగజారాల్సిన పరిస్థితి?. స్థానిక ఎన్నికలు ఎందుకు సాఫీగా నిర్వహించడం లేదు?. ఎందుకిన్నిన్ని అక్రమాలు చేస్తున్నారు? ప్రజాస్వామ్యంలో ఉన్న వాళ్ళంతా ఒక్కసారి ఆలోచించాలి.

ఎన్నికలు సజావుగా జరగనప్పుడు ఆర్ఓ దగ్గరికి వెళ్లి అడిగే హక్కు మాకుంది. దాన్ని అడ్డుకునే కార్యక్రమం ఎవరైనా చేస్తే, ఇంతకన్నా ఇంకా దారుణం అనేది ఉండదు. రాష్ట్రంలో దారుణ పరిస్థితిపై ఎన్డీఏ కూడా స్పందించాలి. ఎందుకంటే వారి భాగస్వామ్య పార్టీనే ఇక్కడ ఇన్ని అరాచకాలు చేస్తోంది కాబట్టి.. వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని"వైయస్ జగన్ స్పష్టం చేశారు.అంతకు ముందు పులివెందుల మునిసిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లను పోలింగ్ బూత్‌లలోకి అనుమతించకుండా అడ్డుకోవడంపై పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారి (ఆర్వో) దృష్టికి తీసుకెళ్లేందుకు పులివెందులలోని ఆర్వో కార్యాలయానికి వెళ్లిన వైయస్ జగన్‌ను అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో ఆర్వో కార్యాలయం ఎదుటే వైయస్ జగన్ బైఠాయించి నిరసన తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

మురసు తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కృష్ణా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు నవంబర్ 2వ తేదీన సెలవు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ఈ సెలవును కాంపెన్సేటరీ హాలిడేగా ప్రకటించినందున, తదుపరి ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాలలు పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.

పురపోరులో ఎన్డీఏ కూటమిదే విజయం

- ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి సుభాష్ కుటుంబం
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన మంత్రి
- పార్టీ ఆదేశాలే సుప్రీం.. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిపై సస్పెండ్ వేటు





ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి, కూటమిపార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం ఆదివారం తన ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిపి రామచంద్రపురం పట్టణంలోని రత్నంపేట శ్రీ బాలగంగాధర్ తిలక్ ఎంపి ఎల్ ప్రైమరీ స్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. అన్ని పోలింగ్ కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసిందని, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం తమ పార్టీ అభ్యర్థుల విజయానికి దోహద పడుతుందన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీలో చైర్మన్ అభ్యర్థితో పాటు మొత్తం 32 వార్డుల్లో కూటమి పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమై పట్టణవ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతోందని మంత్రి వెల్లడించారు. ఎన్డీఏ కూటమి ఐక్యమత్యంతో స్థానిక ఎన్నికలను ఎదుర్కొంటున్నామని వెల్లడించారు. వ్యక్తులు ముఖ్యం కాదు.. పార్టీయే ముఖ్యం.. పట్టణంలో గడి గోవింద్ అనే కార్యకర్తతో పాటు పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కార్యకర్తలను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి సుభాష్ ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల్లో మాదిరి 94% స్ట్రైక్ రేట్ దాటి విజయం సాధిస్తామని దీమా వ్యక్తం చేశారు.

32 వార్డులో క్లీన్ స్వీప్ చేస్తాం: సత్యం

కూటమి సీనియర్ నేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణంలో మొత్తం 32 వార్డులు క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ విలువలకు కట్టుబడి అంతా ఐక్యంతో పని చేశామని, ఎన్డీఏ కూటమి పట్ల ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓటమి పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఐజీ గోపీనాథ్ జట్టితో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పరవాడ సీఐ భాస్కరరావు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష.. ఎన్నికల బందోబస్తుపై ప్రత్యేక దృష్టి

ప్రజా భూమి ప్రతినిధి--అనకాపల్లి/పరవాడ

జీవీఎంసీ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్ పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట పరవాడ సీఐ ఎల్.భాస్కరరావు కూడా పర్యటించి ఎన్నికల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరవాడ మండలం లంకెలపాలెం జడ్పీ హైస్కూల్‌లోని సమస్యాత్మక (హైపర్‌సెన్సిటివ్) పోలింగ్ కేంద్రాన్ని ఐజీ సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ స్టేషన్లను, ఓటర్ల క్యూలైన్లను పరిశీలించి బందోబస్తు తీరును




సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది అప్రమత్తతను పరిశీలించారు. పరవాడ పరిధిలోని ఎనిమిది లొకేషన్లలో ఉన్న మొత్తం 18 పోలింగ్ స్టేషన్లలో పటిష్ట భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని అధికారులు ఐజీకి వివరించారు. అనంతరం పరవాడ పోలీస్ స్టేషన్‌ను కూడా ఐజీ సందర్శించి ఎన్నికల విధుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ గోపీనాథ్ జట్టి పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. ఓటర్లు ప్రశాంతంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలు అందించాలని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో పరవాడ సీఐ ఎల్.భాస్కరరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- ఎన్నికల కమిషన్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి
- ఒత్తిళ్లు, ప్రలోభాలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేస్తూ, ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందన్నారు. ఆదివారం విజయవాడ నగరపాలక సంస్థతో పాటు కొండపల్లి, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మున్సిపాలిటీల ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఉదయం నుంచి కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పోలింగ్ సరళిని పరిశీలించారు. వివిధ ప్రాంతాల్లో పోలింగ్ కొనసాగుతున్న తీరును, పోలింగ్ కేంద్రాల పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ ప్రక్రియలో ఎక్కడా అంతరాయం కలగకుండా,



ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విజయవాడ అర్బన్ పరిధిలోని కేబీఎన్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలు తీరును పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

శ్రీరామగిరిలో సీపీఎం ప్రచార హోరు



- ప్రజా సమస్యలపై పోరాడిన వారికే పట్టం కట్టాలని పిలుపు
- ఎంపీటీసీ అభ్యర్థి పులి సంతోష్‌కుమార్, జడ్పీటీసీ అభ్యర్థిని కారం సుజాత ఇంటింటా ప్రచారం

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వి.ఆర్.పురం మండలంలోని శ్రీరామగిరి సెగ్మెంట్‌లో సీపీఎం ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. శ్రీరామగిరి సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఎం బలపరిచిన అభ్యర్థి పులి సంతోష్‌కుమార్, జడ్పీటీసీ అభ్యర్థిని కారం సుజాత ఆదివారం శ్రీరామగిరి, సీతంపేట, రాజుపేట తదితర గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ప్రజలను నేరుగా కలుసుకుని స్థానిక సమస్యలు, గిరిజనుల ఇబ్బందులు, గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. శ్రీరామగిరి సర్పంచ్‌గా గతంలో పనిచేసిన సమయంలో గిరిజన, గిరిజనేతర ప్రజల సమస్యలపై పులి సంతోష్‌కుమార్ చేసిన పోరాటాలను సీపీఎం నాయకులు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.

గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనుభవం తనకు ఉందని, అదే నిబద్ధతతో ఎంపీటీసీగా పనిచేస్తానని సంతోష్‌కుమార్ ప్రజలకు తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు, గిరిజనుల హక్కులు, పోడు భూములకు పట్టాలు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు వంటి సమస్యలపై సీపీఎం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతోందని నాయకులు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల హక్కుల పరిరక్షణకు సీపీఎం అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. పదవులు కోసం కాకుండా ప్రజా సమస్యల కోసం పోరాడే అభ్యర్థులను గెలిపించాల్సిన సమయం ఇదేనని వారు ఓటర్లకు పిలుపునిచ్చారు. శ్రీరామగిరి ఎంపీటీసీ అభ్యర్థి పులి సంతోష్‌కుమార్, జడ్పీటీసీ అభ్యర్థిని కారం సుజాతకు మద్దతుగా సీపీఎం శ్రేణులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 12

సోమవారం 2 నవంబర్ 2026



ప్రజాస్వామ్యం గురించి జగన్ రెడ్డి నీతులు చెబుతున్నారు

- బెంగళూరులో మీడియా సమావేశంలో మంత్రి లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి, బెంగళూరు

ప్రజాప్రభుత్వ పాలనలో పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన అనంతరం స్థానిక ఎన్నికలపై మంత్రి స్పందించారు. పులివెందులలో ఏకగ్రీవం జరిగాయని వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పులివెందులలోని ప్రతివార్డు ఏకగ్రీవం చేశారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో పులివెందులలో ఏవిధంగా ఏకగ్రీవం చేశారని అందరూ ప్రశ్నించాలి. ఇవాళ ప్రజాప్రభుత్వ పాలనలో పారదర్శకంగా స్థానిక ఎన్నికలను నిర్వహించడం జరుగుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు పోలీస్ సెక్యూరిటీని కల్పించడం జరిగింది. పులివెందులలో నామినేషన్ వేసేందుకు ఎవరూ అడ్డుపడలేదు. నామినేషన్ వేశారు. పులివెందులలో శాంతిభద్రతల సమస్యను సృష్టించారు. గత రాత్రి వాహనాలను తగులబెట్టారు. నిందను మాపై వేశారు. ప్రజలపై వారే దాడి చేసి మాపై దుష్ప్రచారం చేస్తున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల మాకు విశ్వాసం ఉంది

ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల మాకు విశ్వాసం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు ఎన్నికలు జరుగుతున్నాయి. పులివెందులలోనే ఎందుకు సమస్యలు వస్తున్నాయి? ఇందుకు జగన్మోహన్ రెడ్డి వైఖరే కారణం. పులివెందులలో జగన్ రెడ్డి శాంతిభద్రతల సమస్యను సృష్టించారు. ఇప్పుడు తామే బాధితులం అని చెప్పుకుంటున్నారు. ఎన్నికలు జరుగుతున్నాయని తెలుసు. జగన్ రెడ్డి మాత్రం బెంగళూరులో ఉంటారు. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి వచ్చి సమస్యలు సృష్టించారు. అనంతరం హెలికాప్టర్ లో బెంగళూరు వెళ్లిపోయారు. జాతీయ మీడియాను పిలిచి శాంతిభద్రతల సమస్య అంటూ నిందలు వేస్తున్నారు.

జగన్ రెడ్డి తీరువల్లే పులివెందులలో శాంతిభద్రతల సమస్య

గత ఎన్నికల్లో పులివెందుల ఎందుకు ఏకగ్రీవం అయిందో ప్రజలకు జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. గత ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి పాతర వేశారు. ఇప్పుడు మేం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నాం. పులివెందులలో కూడా ప్రజలు వచ్చి ఓట్లు వేశారు. జగన్ రెడ్డి వచ్చి సమస్యలు సృష్టిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉండగా ర్యాలీ ఏవిధంగా నిర్వహిస్తారు? విశాఖతో సహా కడప పట్టణంలో ఎన్నికలు జరిగాయి. ఒక్క సమస్య కూడా ఉత్పన్నం కాలేదు. సమస్యలకు జగన్ రెడ్డి ఒక్కడే కారణమని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ చెప్పారు.

వెంకట శివమ్మకు మద్దతుగా

వైసీపీ శ్రేణుల ప్రచారం

- ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్. వేణు అభ్యర్థన



ప్రజాభూమి, వేంపల్లె

వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి వెంకట శివమ్మకు మద్దతుగా ఆదివారం వేంపల్లెలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాజీ సర్పంచ్ సింగారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర యువనేత ఆర్. వేణుగోపాల్ స్థానిక పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి ఓటర్లను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వెంకట శివమ్మను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో వేంపల్లె మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గతంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జడ్పీటీసీ అభ్యర్థి వెంకట శివమ్మకు మద్దతు తెలపాలని కోరారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి వైసీపీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరసింహ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం మున్సిపల్ ఎన్నికల్లో 71.56 శాతం పోలింగ్

- 18,228 మంది ఓటర్ల వినియోగం.. మహిళా ఓటర్లదే పైచేయి!

ప్రజాభూమి, ప్రత్తిపాడు

ఏలేశ్వరం పురపాలక సంఘ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మొత్తం 28 వార్డులకు సంబంధించి 34 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఎన్నికల్లో 71.56 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగగా, మొత్తం 25,472 మంది ఓటర్లకు గాను 18,228 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్ల వివరాలను పరిశీలిస్తే పురుష ఓటర్లు 8,619 మంది, మహిళా ఓటర్లు 9,566 మంది, ఇతరులు ఇద్దరు ఓటు వేశారు. పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. మొత్తం పోలింగ్ శాతం 71.56గా నమోదైంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అధికార



యంత్రాంగం చేసిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటర్ల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పిలుపునిచ్చారు. ఇక ఏలేశ్వరం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారింది. చైర్‌పర్సన్ పదవి కోసం నలుగురు మహిళా అభ్యర్థులు బరిలో నిలిచారు. కూటమి తరఫున తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా యార్లగడ్డ అక్షిత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బదిరెడ్డి ఆశాలత, కాంగ్రెస్ పార్టీ తరఫున ఏడిద వరలక్ష్మి, స్వతంత్ర అభ్యర్థిగా బూర్తి గుర్రయ్యమ్మ పోటీ చేశారు. ప్రధానంగా కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. మహిళా ఓటర్ల ఆధిక్యం, బీసీ ఓటర్ల సంఖ్య, వార్డుల వారీగా రాజకీయ సమీకరణాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులను ఏలేశ్వరం ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచనున్నారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల కోసం అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తంగా ఏలేశ్వరం మున్సిపల్ ఎన్నికల్లో 71.56 శాతం పోలింగ్ నమోదు కావడంతో ప్రజాతీర్పుపై ఉత్కంఠ నెలకొంది. మున్సిపల్ పీఠాన్ని ఏ పార్టీ కైవసం చేసుకుంటుంది? చైర్‌పర్సన్‌గా ఎవరు ఎన్నికవుతారన్నది ఇప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

పులివెందుల పులి పిరికిపందలా పారిపోయారు

- ఓటమి భయంతోనే వైసీపీ అరాచక రాజకీయాలు.. ప్రజల స్వేచ్ఛను అడ్డుకునే ప్రయత్నాలు
- ఇన్నాళ్లూ భయంతో పాలించిన పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా ఓటేస్తుంటే జగన్‌కు వణుకు మొదలైంది
- రాళ్ల దాడులు, విధ్వంసంతో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోలేరు.. జగన్ రాజకీయ నాటకాలకు కాలం చెల్లింది
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి

పులివెందుల పులినని గొప్పలు చెప్పుకునే గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఓటు వేయకుండా వెనుదిరగడం ఆయన రాజకీయ పిరికితనానికి నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలపై స్పందించిన మంత్రి.. ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ ఎన్నికల ప్రక్రియను వివాదాస్పదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తి కనీసం తన ఓటు హక్కును వినియోగించుకోకుండా రాజకీయ నాటకాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. ఇన్నాళ్లూ పులివెందులలో భయానక రాజకీయాలతో ఆధిపత్యం కొనసాగించిన వైసీపీకి ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న ఎన్నికలను ఎదుర్కోవడం చేతకావడం లేదని మంత్రి విమర్శించారు. మహిళలు, వృద్ధులు, సామాన్య ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ముందుకు వస్తుంటే వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు, బెదిరింపులతో భయోత్పాతాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజల మద్దతును పొందలేకపోతే హింసాత్మక వాతావరణం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. పోలింగ్ సందర్భంగా వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు, ఘర్షణలు చోటుచేసుకోవడం, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఎన్నికల ప్రక్రియను చిత్రీకరించే మీడియా ప్రతినిధులపైనా దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ఈ ఘటనల వెనుక ఉన్నవారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ కార్యకర్తలు ఓటర్లను అడ్డుకుంటున్నారనే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరగాలన్నారు. హింసకు పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించరాదని స్పష్టం చేశారు. పులివెందుల అంటే జగన్ కుటుంబానికి రాజకీయ జాగీరు కాదని, అక్కడి ప్రజలు ఎవరి బానిసలూ కాదని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజలను భయపెట్టి ఓట్లు పొందే రోజులు పోయాయని, ఓటమి భయం పట్టుకున్నప్పుడల్లా విధ్వంసం సృష్టించి ఇతరులపై నిందలు మోపడం వైసీపీ రాజకీయ అలవాటుగా మారిందని విమర్శించారు. ఒకవైపు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు నెలకొంటుంటే మరోవైపు జగన్ రాజకీయ విన్యాసాలు ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రజల ముందుకు వెళ్లి వారి తీర్పును స్వీకరించే ధైర్యం జగన్‌కు లేదని, ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి ఓటు వేయకుండా వెనక్కి వెళ్లి ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. పులివెందులలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లింది. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలే తప్ప జగన్ కాదని గుర్తుంచుకోవాలి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

రాష్ట్రాన్ని వీడని తుఫాన్లు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి

నైరుతి, ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో 'మురసు తపాను' కేంద్రీకృతమై ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఇది గడిచిన 6 గంటల్లో గంటకు 27 కి.మీ. వేగంతో కదులుతుందని ప్రస్తుతానికి చెన్నైకి 480 కిమీ, నెల్లూరుకు 550 కిమీ, మచిలీపట్నానికి 560 కిమీ, ఒంగోలుకు 600 కిమీ, విశాఖపట్నానికి 610 కిమీ, దూరంలో ఉందని వెల్లడించారు. ఉదయానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడి ఆ తర్వాత వాయువ్య దిశగా ప్రయాణించి నేటి అర్ధరాత్రి--రేపు తెల్లవారుజాము సమయంలో నెల్లూరు-నర్సాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరందాటే సమయంలో గంటకు 100 నుండి 110 కి.మీ వరకు గరిష్ఠంగా 120 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకి వెళ్ళరాదని హెచ్చరించారు. తుపాను ప్రభావంతో రానున్న మూడురోజులు దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు; కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రేపు మధ్యాహ్నం నుంచి కోస్తా తీరం వెంబడి గంటకు 80-90 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపిఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. నిరంతరం తుపాను పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని విపత్కర పరిస్థితుల్లో ప్రజల రక్షణ కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. తుపాను వలన ఏ సమస్య ఎదురైనా 9552300009 మన మిత్ర ద్వారా వెంటనే అధికారులకు తెలియజేయవచ్చన్నారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. సహాయక చర్యలు కోసం ముందస్తుగా కృష్ణా(2), బాపట్ల(2), గుంటూరు(2), నెల్లూరు(2), ప్రకాశం(2), మార్కాపురం(1), పల్నాడు (1), తిరుపతి (1) మొత్తంగా 6 ఎన్డీఆర్ఎఫ్, 7. ఎస్డిఆర్ఎఫ్‌బృందాలు మోహరింపు చేశామని, అవసరమైతే వినియోగించడానికి మరికొన్ని బృందాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మురసు తుపాను హెచ్చరికల నేపథ్యంలో రానున్న మూడు రోజులు వాతావరణ క్రింది విధంగా ఉండనున్నట్లు ఏపిఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు.

సోమవారం : కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, ఒకటి,రెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, కోనసీమ, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

మంగళవారం :అల్లూరి సీతారామ రాజు, పోలవరం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, ఒకటి,రెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

విజయనగరం, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

బుధవారం :కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో లిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలే మమ్మల్ని గెలిపిస్తాయి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి బాటలు వేస్తాయని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్ అన్నారు. ఆదివారం ఆత్రేయపురం మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజుతో కలిసి జడ్పీటీసీ అభ్యర్థి కప్పల శ్రీధర్, ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాటి శివకుమార్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, రైతులు, మహిళలకు



కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని పేర్కొన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరని విమర్శించిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న అభిమానం, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆశీస్సులు, పార్టీ శ్రేణుల కృషితో ఆత్రేయపురం మండలంలో జడ్పీటీసీ అభ్యర్థి కప్పల శ్రీధర్‌తో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ర్యాలి, ఆత్రేయపురం, మెర్లపాలెం, బుల్లిరేవు తదితర గ్రామాల్లో అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాయకులు, కార్యకర్తలు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో ముగిసిన పోలింగ్

- స్ట్రాంగ్ రూములకు బ్యాలెట్ బాక్సులు



ప్రజాభూమి కృష్ణాజిల్లా బ్యూరో : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సమయం పూర్తికావడంతో ఎన్నికల అధికారులు బ్యాలెట్ బాక్సులను సేకరించి పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు ప్రక్రియను అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో చేపట్టారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బ్యాలెట్ బాక్సులకు కట్టుదిట్టమైన రక్షణ కల్పించనున్నారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2 D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677


ప్రజాభూమి
జనరల్ 13
సోమవారం 2 నవంబర్ 2026

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల జోరు.. ఆగిరిపల్లిలో రాజకీయ సందడి

- పావనజ్యోతి విద్యానుభవం.. జోషిబాబుకు మంత్రి సారథి అభివృద్ధి పనుల అండ.. ప్రచారంలో ప్రధాన పార్టీల హోరాహోరీ

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారానికి మరో రెండు రోజులే గడువు ఉండటంతో తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి తుమిమెల్లి పావనజ్యోతి గతంలో ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేయడం, మండలంలోని పలువురు ఆమె వద్ద విద్యనభ్యసించడం, ఉన్నత విద్యావంతురాలు కావడం ఆమెకు కలిసివచ్చే అంశాలుగా ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహిస్తూ ఆమె ముందంజలో





ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి జోషిబాబుకు గతంలోనూ, ప్రస్తుతం కూడా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఉన్న అనుభవం, మంత్రి కొలుసు పార్థసారథి ఆగిరిపల్లి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు కలిసివచ్చే అంశాలని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. ఎంపీటీసీ అభ్యర్థుల విషయానికొస్తే వైఎస్సార్‌సీపీ తరఫున బెజవాడ రాంబాబు తన స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుండగా, టీడీపీ అభ్యర్థులు ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కనబోయిన వేణు తమ గెలుపే లక్ష్యంగా ఓటర్లను కలుస్తూ ప్రచారం సాగిస్తున్నారు.

ఇదిలా ఉండగా శనివారం మంత్రి పార్థసారథి ఆగిరిపల్లి గ్రామంలో బహిరంగ సభ నిర్వహించడంతోపాటు మోటార్‌సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పొన్నం కల్యాణ మండపంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమై అన్ని స్థానాల్లో విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి పర్యటన బహిరంగ సభ మోటార్ సైకిల్ ర్యాలీతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందని టీడిపి కార్యకర్తలు భావిస్తున్నారు.



బహిరంగ ప్రదేశాల్లో

మద్యం సేవిస్తే కేసులు తప్పవు!

- బహిరంగంగా మద్యం సేవించిన ఐదుగురిపై కేసులు నమోదు: ఎస్ఐ సాదిక్

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సాదిక్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాదిక్ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాలు, రహదారుల పక్కన, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మద్యం సేవించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడమే కాకుండా శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, దీనివల్ల ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా ముప్పు కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీసుల సూచనలు, చట్ట నిబంధనలు పాటించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన వారిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరచడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం మండల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సాదిక్ వెల్లడించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని, పోలీసుల నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుత వాతావరణం నెలకొనేలా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముగిసిన పురపోరు... పెడన టాప్..!

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః కృష్ణా జిల్లాలోని మూడు పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ శాతాలు ఇలా నమోదయ్యాయి. మచిలీపట్నం నగరపాలక సంస్థల్లో 73.65% పోలింగ్ జరగగా, మొత్తం 1.02.559 ఓట్లు పోలయ్యాయి. పెడన మున్సిపాలిటీలో 78.95 శతం పోలింగ్ నమోదై 20,033 ఓట్లు, ఉయ్యూరు మున్సిపాలిటీలో 66.34 శాతం పోలింగ్ తో 21,756 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతంలో పెడన మొదటి స్థానంలో, మచిలీపట్నం రెండవ స్థానంలో, ఉయ్యూరు మూడో స్థానంలో నిలిచాయి.

మురసు తుఫానును ఎదుర్కొనేందుకు

అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలి

- అర్నబ్ తుఫాను సమయంలో చేపట్టిన చర్యల కంటే మరింత వేగంగా స్పందించాలి
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

మురసు తుఫాను ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డీకే బాలాజీ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ (ఆర్ అండ్ బి), సీపీడీసీఎల్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డీఎల్‌డీఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మురసు తుఫాను నెల్లూరు నుంచి నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో, గతంలో అర్నబ్ తుఫాను సమయంలో చేపట్టిన ముందస్తు చర్యలను కొనసాగిస్తూనే, ఈసారి మరింత వేగంగా స్పందించి సహాయక, పునరావాస, పునరుద్ధరణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

సీపీడీసీఎల్ అధికారులు తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు విద్యుత్ సిబ్బంది బృందాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన విద్యుత్ స్తంభాలు, వైర్లు, ఇతర మరమ్మతు సామగ్రిని ముందుగానే జిల్లాకు తరలించి అందుబాటులో ఉంచాలన్నారు. గతంలో ఎక్కువ నష్టం సంభవించిన మండలాలను గుర్తించి, అక్కడ అదనపు సిబ్బంది, సామగ్రిని



ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అవసరమైతే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి అదనపు సిబ్బందిని రప్పించి జిల్లాలో ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తుఫాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు.

రోడ్లపై పడిపోయే చెట్ల తొలగింపునకు యంత్రాలు సిద్ధం చేయాలి.

ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులు జేసీబీలు, పవర్ సా కట్టర్లు, ఇతర అవసరమైన యంత్రాలు, పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తుఫాను ప్రభావంతో రహదారులపై చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, అవసరమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ యంత్రాలు, సిబ్బందిని ముందుగానే అందుబాటులో ఉంచాలన్నారు. రహదారులకు అడ్డంకిగా మారే చెట్లను వెంటనే తొలగించేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి

తుఫాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలు, కచ్చా ఇళ్లు, రేకుల షెడ్లలో నివసిస్తున్న కుటుంబాలను ముందుగానే గుర్తించి అవసరమైన వారిని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులను ఆదేశించారు.

అర్నబ్ తుఫాను సమయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను యథావిధిగా కొనసాగిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో ప్రజలను అక్కడికి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

నవంబరు 2 నుంచి తుఫాను ప్రభావంపై ప్రత్యేక అప్రమత్తత

నవంబరు 2వ తేదీ నుంచి తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, సంబంధిత శాఖల అధికారులు తమ తమ పరిధిలో అవసరమైన ముందస్తు కార్యాచరణను పూర్తిచేసుకుని క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడా సమన్వయ లోపం లేకుండా, పరిస్థితులకు అనుగుణంగా తక్షణమే స్పందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీఓలు, డీఎల్‌డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా ఆదివారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి మచిలీపట్నం, పెడన, ఉయ్యూరు మున్సిపాలిటీలలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయా మున్సిపాలిటీలలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని, పోలింగ్ ప్రక్రియ నిర్వహణ తీరును కలెక్టర్ ప్రత్యక్ష ప్రసారాల ద్వారా పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ, ఓటింగ్ ప్రక్రియ



పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా సాధారణ పరిశీలకుడు వి. అభిషేక్

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా ఆదివారం కృష్ణా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు వి. అభిషేక్ మచిలీపట్నం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలోని గొడుగుపేటలో ఉన్న మెహెర్ బాబా పార్క్ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, అక్కడ ఓటింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఒక మహిళ తన ఓటు హక్కును వినియోగించుకుంటూ బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్న విధానాన్ని గమనించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



పోలింగ్ సామగ్రి స్వీకరణలో నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి

- రిసెప్షన్ కేంద్రంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే స్వీకరించాలి
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాభూమి ప్రతినిధి,పెడన

రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా పెడన పురపాలక సంఘానికి నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, సెయింట్ విన్సెంట్ పల్లోట్టి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీ డీకే బాలాజీ మరియు జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ ఆదివారం సందర్శించి, పోలింగ్ సామగ్రి స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రిసెప్షన్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగించుకొని పోలింగ్ అధికారులు బ్యాలెట్ బాక్సులు, ఇతర పోలింగ్ సామగ్రిని రిసెప్షన్ కేంద్రానికి తీసుకువచ్చే సమయంలో త్వరగా అప్పగించి వెళ్లాలనే ఆత్రుతలో ఉంటారని, అయితే అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరపడకుండా ప్రతి అంశాన్ని అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ అధికారుల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికలకు సంబంధించిన ఇతర సామగ్రిని స్వీకరించే ముందు వాటి వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాలని, ప్రతి కవర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. హ్యాండ్‌బుక్‌లో నిర్దేశించిన చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని పత్రాలు, కవర్లు,



ఎన్నికల సామగ్రిని క్రమపద్ధతిలో వెరిఫై చేయాలని, సంబంధిత రికార్డుల్లో నమోదు చేసిన అనంతరమే నిర్దేశిత రిసెప్షన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల సామగ్రి స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, అక్కడ ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్లు భద్రపరిచిన నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచే ప్రక్రియను సంబంధిత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలోనే నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని నిర్దేశిత విధానంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జితో మాట్లాడుతూ, ముందుగా రూపొందించిన లేఅవుట్ ప్రకారం ప్రతి బ్యాలెట్ బాక్స్‌ను నిర్దేశించిన ప్రదేశంలోనే ఉంచాలని, బ్యాలెట్ బాక్సుల అమరిక, భద్రత, పర్యవేక్షణ తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు), మున్సిపల్ కమిషనర్ మరియు ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, కృష్ణాజిల్లా, మచిలీపట్నం వారిచే జారీ చేయబడినది.

లోపాన్ని గుర్తించి.. సత్వరమే సరిదిద్ది..

- విజయవాడ 55వ వార్డులో విజయవంతంగా ముగిసిన పోలింగ్
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చొరవతో అప్రమత్తమైన యంత్రాంగం

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7.00 గంటలకు పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రారంభమై ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ) పరిధిలోని 86 వార్డుల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే, పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే 55వ వార్డుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లలో ఎన్నికల గుర్తులు తారుమారైనట్లు గుర్తించారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ దృష్టికి వచ్చిన వెంటనే ఆయన తక్షణమే స్పందించి, సంబంధిత ఎన్నికల అధికారులను



అప్రమత్తం చేశారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడేలా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 55వ వార్డుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను తిరిగి ముద్రించే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టి, కొద్ది గంటల్లోనే పూర్తి చేశారు. అనంతరం సరిచేసిన బ్యాలెట్ పేపర్లతో 55వ వార్డులో పోలింగ్ ప్రక్రియను తిరిగి ప్రారంభించారు. పోలింగ్‌లో ఏర్పడిన అంతరాయాన్ని అధిగమించి, ఓటర్లందరికీ తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపారు. ఈ మేరకు 55వ వార్డులో ఓటర్లు రాత్రి 7.30 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తూ చర్యలు తీసుకున్నారు. సమస్యను గుర్తించిన వెంటనే జిల్లా కలెక్టర్ అప్రమత్తమై, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వేగంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల తక్కువ సమయంలోనే బ్యాలెట్ పేపర్ల పునర్ముద్రణ పూర్తి చేసి పోలింగ్‌ను తిరిగి ప్రారంభించడం సాధ్యమైంది. దీంతో 55వ వార్డులో పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఎన్నికల నిర్వహణలో తలెత్తిన సమస్యను సత్వరమే పరిష్కరించి, ఓటర్ల ఓటు హక్కుకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టడం ద్వారా జిల్లా ఎన్నికల యంత్రాంగం ఎన్నికల ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు కృషి చేసింది.

ప్రజాభూమి

జనరల్ 14

సోమవారం 2 నవంబర్ 2026

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి
ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం

- నవంబర్ 4 వ తేదీ ఉదయం 5 గంటలకు రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల నుంచి ప్రత్యేక బస్సులు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం

పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ఎంపీటీసీ / జెడ్పీటీసీ ఎన్నికల విధుల్లో నవంబర్ 5 వ తేదీన పాల్గొనే సిబ్బంది రవాణా సౌకర్యార్థం ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన ఎన్నికల సిబ్బంది వేరే డివిజన్ పరిధిలో ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు వీలుగా రెండు బస్సులు రంపచోడవరం నుంచి, రెండు బస్సులు చింతూరు నుంచి ఈ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సులు నవంబర్ 4 వ తేదీ ఉదయం 5 గంటలకు రంపచోడవరం, చింతూరులోని ఐటీడీఏ కార్యాలయాల నుంచి బయలుదేరుతాయని కలెక్టర్ తెలిపారు. ఆయా డివిజన్ల పరిధిలో కాకుండా ఇతర డివిజన్లలో ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది తమకు కేటాయించిన విధుల ప్రాంతాలకు సమయానికి చేరుకునేందుకు ఈ రవాణా సదుపాయం కల్పించినట్లు వివరించారు. సొంతంగా రవాణా సదుపాయం ఏర్పాటు చేసుకోలేని ఎన్నికల సిబ్బంది ఈ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది నిర్ణీత సమయానికి బస్సు బయలుదేరే ప్రాంతాలకు చేరుకుని ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల నిర్వహణలో విధులు కేటాయించబడిన ప్రతి సిబ్బంది సకాలంలో తమకు నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని బాధ్యతలు నిర్వర్తించేలా అవసరమైన రవాణా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు

అప్రమత్తంగా ఉండాలి!

- భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో గ్రామస్థాయి వరకు జాగ్రత్తలు
- కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రం
- డివిజన్లు, మండలస్థాయిలోనూ సీసీసీల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

మరో తుపాను ముప్పు పొంచిఉందని, వచ్చే రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం స్పష్టమైన లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. రెవెన్యూ అధికారులు ప్రమాదకర భవనాలు, చెట్లను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పోలీస్ శాఖ శాంతిభద్రతలు, సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే వైద్య శాఖ మొబైల్ ఆసుపత్రులు, మందులు తదితరాలను సిద్ధం చేయాలని, పౌర సరఫరాల శాఖ సహాయక శిబిరాలకు అవసరమైన ఆహార పదార్థాలను సమకూర్చాలని సూచించారు. విద్యుత్, రోడ్లు-భవనాలు, అగ్నిమాపక, నీటిపారుదల, పంచాయతీ రాజ్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, ఐసీడీఎస్ తదితర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండి, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు:

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా అధికారులు చేసే సూచనలు పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ప్రత్యేక కమాండ్ కంట్రోల్ కేంద్రాలకు సమాచారమివ్వాలని సూచించారు. ముందుజాగ్రత్తగా విజయవాడ డివిజన్ (75690 08425), తిరువూరు డివిజన్ (08673-251235), నందిగామ డివిజన్ (78930 53534)తో పాటు అన్ని మండలాల్లోనూ కమాండ్ కంట్రోల్ కేంద్రాల నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. అదే విధంగా జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. ఇందులో వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల ఓటు హక్కు వినియోగం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మచిలీపట్నం నగరంలో పలువురు రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బీసీ నాయకులు కొనకళ్ల జగన్నాధరావు సుఖర్లాబాద్‌లోని ఆర్‌సీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోని 14వ డివిజన్‌లో సాధారణ పౌరుల మాదిరిగా క్యూ లైన్‌లో నిలబడి ఓటు వేశారు. అదేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం మేయర్ అభ్యర్థి లంకా జ్యోతి స్థానిక సంస్థల ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో కృష్ణా జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ ఓటు వేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సైతం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరి కనిపించారు. మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజకీయ ప్రముఖులు సైతం సామాన్య ఓటర్లతో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను చాటుతూ నాయకులు తమ బాధ్యతను నిర్వర్తించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకునేందుకు ఓటర్లు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యారు. నగరవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సందడి నెలకొంది.

ప్రచారంలో దూసుకుపోతున్న కాకుమాను శివకుమారి

- చినలింగాయపాళెం ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి తరఫున పోటీ
- సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి - గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ
- కాకుమాను మండలం

ప్రజాభూమి ప్రతినిధి - చినలింగాయపాళెం

కాకుమాను మండలం: చినలింగాయపాళెం ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి తరఫున బరిలో నిలిచిన కాకుమాను శివకుమారి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మండల పరిధిలోని కొల్లిమర్ల, కొండబాలవారిపాళెం, చినలింగాయపాళెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ అన్ని వర్గాల ప్రజలను



కలుసుకుంటూ మద్దతు కూడగడుతున్నారు. ఈ నెల 5వ తేదీన జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

ఇప్పటికే తన పరిధిలోని మూడు గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించగా, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రచార సమయంలో ప్రజలు చూపుతున్న ఆదరణ, అభిమానం తనకు మరింత ఉత్సాహాన్నిస్తున్నాయని శివకుమారి పేర్కొన్నారు.

తనను ఎంపీటీసీగా గెలిపిస్తే చినలింగాయపాళెం, కొండబాలవారిపాళెం, కొల్లిమర్ల గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని ఆమె హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాకుమాను హరీష్, కాకుమాను నాగేశ్వరరావు, బండారుపల్లి మధు, ఖగ్గా రామయ్య, బండారుపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచిన్న లోటుపాట్లు మినహా
ప్రశాంతంగా ముగిసిన కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. నగర ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని మేయర్ అభ్యర్థితో పాటు కార్పొరేటర్లను ఎన్నుకునేందుకు ఓటు వేశారు. ఎన్నికల ఫలితాలు ఈ నెల 3వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు అనంతరం వెల్లడికానున్నాయి. నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో చిన్నచిన్న లోటుపాట్లు స్పష్టంగా కనిపించాయి. మూడు రోజుల క్రితం ఏర్పడిన ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో నగరంలో నిన్నమొన్నటి వరకు పరిస్థితి బురదమయంగా ఉంది. ఎన్నికల అధికారులు ఆయిల్ ఇంజిన్ల సహాయంతో నిల్వ ఉన్న నీటిని తోడించి, పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ కొన్ని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రహదారులు ఇప్పటికీ బురదమయంగా ఉండటంతో ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను మరింత ఎక్కువగా చల్లించి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఎన్నికల విధులు నిర్వహించిన పోలింగ్ సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆర్నాబ్ తుఫాను అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ దోమలు, ఈగల బెడద కారణంగా సిబ్బందికి గత రాత్రి సరైన విశ్రాంతి లభించలేదు. దీంతో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందిలో అలసట స్పష్టంగా కనిపించింది. 60 ఏళ్ల వయస్సు పైబడిన ఎన్నికల సిబ్బందికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, దాదాపు 60 ఏళ్ల వయస్సుకు చేరువలో ఉన్న కొంతమంది సిబ్బంది కూడా పలు పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడం కనిపించింది. ఫలితంగా కొన్ని చోట్ల పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగింది. పోలింగ్ సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు తగిన ప్రాధాన్యత కల్పించలేదని పలువురు విమర్శించారు. మొత్తంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగినప్పటికీ, అక్కడక్కడ కనిపించిన చిన్నచిన్న లోపాలను ముందుగానే సరిదిద్ది ఉంటే పోలింగ్ మరింత వేగవంతంగా జరిగి ఉండేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. పోలింగ్ సమయం ముగిసే సమయానికి క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సమయం ముగిసినప్పటికీ క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లకు ఎన్నికల సిబ్బంది అదనపు సమయం కేటాయించి, తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

- పోలీసు భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయి సమీక్ష
- ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి - వి. విద్యాసాగర్ నాయుడు

పెడన, ప్రజాభూమి ప్రతినిధి



పెడన మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యం లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన పెడన మున్సిపాలిటీ పరిధిలోని 17, 9, 10, 22, 20, 25, 23వ వార్డుల్లో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల విధులను అత్యంత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లతో మాట్లాడి వారి భద్రతపై భరోసా కల్పించారు. ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

ఉయ్యూరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

- 100 మీటర్ల పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి
- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలి - ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

ఉయ్యూరు,ప్రజాభూమి ప్రతినిధి

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలోని ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ సందర్శించి పోలింగ్ సరళిని, పోలీసు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్న తీరును ప్రిసైడింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్



నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇతర సమస్యలపై ఆరా తీసి, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిని రెడ్‌జోన్‌గా పరిగణించి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లు మినహా అనుమతి లేని వ్యక్తులను ఆ పరిధిలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, గొడవలు, అల్లర్లకు పాల్పడే అవకాశాలున్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, పరిస్థితులకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట భద్రత కల్పించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు.

చర్చిలను సందర్శించి కూటమి అభ్యర్థులకు మద్దతు కోరిన విక్కుర్తి జయలక్ష్మి

- క్రైస్తవ సోదరులను కలిసి ఎన్నికల్లో సహకరించాలని విజ్ఞప్తి

అవనిగడ్డ, ప్రజాభూమి ప్రతినిధి

అవనిగడ్డ మండల ఎన్డీఏ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థిని విక్కుర్తి జయలక్ష్మి ఆదివారం మండల పరిధిలోని పలు చర్చిలను సందర్శించి క్రైస్తవ సోదరులను కలిశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు తమ మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిధిలోని గుడివాకవారిపాలెం, తుంగలవారిపాలెం గ్రామాల్లో వేకనూరు ఎంపీటీసీ సెగ్మెంట్ కూటమి అభ్యర్థిని తుంగల శ్రీలక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

- అడ్డతీగల ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో మిషన్ లైఫ్ వీక్ కార్యక్రమం ప్రారంభం

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల పొదుపు, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా అంతర్జాతీయ బ్రిక్స్ అధ్యక్షతన నిర్వహిస్తున్న మిషన్ లైఫ్ వీక్ కార్యక్రమం ఆదివారం అడ్డతీగల ఏపీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్‌లో ప్రారంభమైంది. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు వారం రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పోలవరం జిల్లా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శివకుమార్ గంగాల్, అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడ్డతీగల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. యోగేంద్రం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థి దశ నుంచే ఓర్పు, సహనం, మంచి



నడవడికను అలవర్చుకోవాలని సూచించారు.మొక్కలు నాటడం, అడవులను సంరక్షించడం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవడంతో పాటు ఇతరులకు కూడా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు, ఆహారం, విద్యుత్తును వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి వనరులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ముత్తయ్య మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతకు అడవులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అడవులు అంతరించిపోతే ప్రకృతిలో సమతుల్యత దెబ్బతినడంతో పాటు జీవరాశుల మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా మానవ మనుగడకు అవసరమైన ఆక్సిజన్‌ను అందించడంలో చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో ఆక్సిజన్ కొరత వంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై. రామవరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్. బాబురావు, సెక్షన్ ఆఫీసర్ ఎం. అప్పన్నదొర, బీట్ ఆఫీసర్లు ఎస్. బసవయ్య, సి.హెచ్. రమ్యశ్రీ, ఎం. సునీత, కె. వసంత, పాఠశాల ఉపాధ్యాయులు పీడీ ఎస్. కన్నారావు, శ్రీనివాస్, హసన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాభూమి

పోలవరం 15

సోమవారం 2 నవంబర్ 2026



రేఖపల్లిలో సీపీఎం ప్రచార జోరు

- జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ముమ్మర ఇంటింటి ప్రచారం

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా ఆదివారం రేఖపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిని కారం సుజాత, ఎంపీటీసీ అభ్యర్థిని చింతకాయల రజిని ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పోడు భూములకు పట్టాలు, గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదల కోసం నిరంతరం పోరాడేది సీపీఎం మాత్రమేనని నాయకులు ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామాల అభివృద్ధికి కృషి చేసే అభ్యర్థులను గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా పలువురు గ్రామస్తులు అభ్యర్థులతో మాట్లాడి తమ సమస్యలను వివరించారు. సీపీఎం అభ్యర్థులకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నాగేంద్రపురంలో సీపీఎం

ఎంపీటీసీ అభ్యర్థి విస్తృత ప్రచారం



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన నాగేంద్రపురంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. చిన్నమట్టపల్లి ఎంపీటీసీ అభ్యర్థి సున్నం రాజులు (రిటైర్డ్ మాస్టర్) ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ నాయకులు, క్యాడర్, కార్యకర్తలు గ్రామంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి సున్నం రాజులు గ్రామంలోని ప్రజలను కలుసుకుని సీపీఎం విధానాలను, ప్రజా సమస్యలపై పార్టీ చేస్తున్న పోరాటాలను వివరించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, పోడు భూములకు పట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి ప్రజలతో కలిసి నిరంతరం పోరాడే అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అభ్యర్థికి తమ సమస్యలను వివరించడంతో పాటు ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు, క్యాడర్, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి

పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

- జిల్లాలో సుమారు 2,500 మంది ఉద్యోగులకు ఓటు వేసే అవకాశం
- గంగవరం పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ దినేష్ కుమార్



ప్రజా భూమి రంపచోడవరం

పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో సుమారు 2,500 మంది ఎన్నికల సిబ్బంది కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం గంగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియ, సిబ్బందికి కల్పించిన సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఉద్యోగి ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని, ప్రక్రియను ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. పోలింగ్ రోజున విధుల్లో ఉండే ఉద్యోగులు ఓటు హక్కును కోల్పోకుండా ఈ అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కోరారు.

గ్రామాల్లో ముమ్మరంగా వాసంశెట్టి నీలిమ ఎన్నికల ప్రచారం

- చిన్నయ్యపాలెం, జమ్మిచావిడి, రేవటిపాలెం గ్రామాల్లో ఇంటింటా పర్యటన
- గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానంటున్న జడ్డంగి ఎంపీటీసీ అభ్యర్థి



ప్రజా భూమి రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండలం జడ్డంగి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వాసంశెట్టి నీలిమ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం చిన్నయ్యపాలెం, జమ్మిచావిడి, రేవటిపాలెం గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రజలను కలిశారు. రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని చెప్పారు. జడ్డంగి ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై డీఎస్పీ ప్రత్యేక దృష్టి

- రాజవొమ్మంగిలో పోలీసుల వాహన తనిఖీలు
- హెల్మెట్ లేని పది మందితో అక్కడికక్కడే హెల్మెట్లు కొనుగోలు
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలాన్లు



ప్రజా భూమి రాజవొమ్మంగి

రోడ్డు ప్రమాదాల నివారణకు రంపచోడవరం డీఎస్పీ అష్రఫ్ అలీ ప్రత్యేక దృష్టి సారించారు. పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ సూచనలతో రాజవొమ్మంగి పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదివారం రాజవొమ్మంగి మండల కేంద్రంలో సీఐ ఎన్. సన్యాసినాయుడు, ఎస్సై కె. షరీఫ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పది మందితో అక్కడికక్కడే హెల్మెట్లు కొనుగోలు చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలాన్ల ద్వారా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాల మీదకు తెస్తుందని సూచించారు. జరిమానాలు విధించడం మాత్రమే తమ ఉద్దేశం కాదని, వాహనదారుల ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు డీఎస్పీ పర్యవేక్షణలో వాహన తనిఖీలతో పాటు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

దారపల్లిలో వైఎస్సార్‌సీపీ ప్రచార జోరు

- ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అనసూర్య, విజయలక్ష్మిని గెలిపించండి: వైఎస్సార్‌సీపీ నేతలు



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జీడిగుప్పు ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని మారుమూల అటవీ ప్రాంతమైన దారపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండరెడ్డి గిరిజన కుటుంబాలను నాయకులు కలిసి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థిని కథల అనసూర్య, జడ్పీటీసీ అభ్యర్థిని బంధం విజయలక్ష్మిలకు మద్దతుగా ప్రచారం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలతో పాటు గిరిజనుల సమస్యల పరిష్కారానికి తమ అభ్యర్థులు నిరంతరం అందుబాటులో ఉంటారని నాయకులు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాల సమస్యలను స్థానిక సంస్థల వేదికగా బలంగా వినిపించేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. జీడిగుప్పు ఎంపీటీసీ అభ్యర్థిని కథల అనసూర్యకు, జడ్పీటీసీ అభ్యర్థిని బంధం విజయలక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కోరారు. మారుమూల గ్రామాల్లో సైతం వైఎస్సార్‌సీపీ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని నాయకులు పేర్కొన్నారు. దారపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు ముమ్మరంగా కృషి చేశారు.

అడ్డతీగలలో 165 మంది ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

అడ్డతీగల మండలంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో మొత్తం 165 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఉదయం నుంచే పోస్టల్ బ్యాలెట్ కేంద్రానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఎన్నికల విధుల్లో బాధ్యతలు నిర్వహించాల్సి ఉండటంతో సాధారణ పోలింగ్ రోజున ఓటు వేయలేని ఉద్యోగులకు ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించారు.ఈ పోస్టల్ బ్యాలెట్



ఓటింగ్‌లో 117 మంది పురుష ఉద్యోగులు, 48 మంది మహిళా ఉద్యోగులు కలిపి మొత్తం 165 మంది ఓటు వేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగికి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించే లక్ష్యంతో అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు.

పోలవరం జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్నికల సిబ్బంది

- సుమారు 2,500 మంది ఎన్నికల విధుల్లోని అధికారులు, ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం
- ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ప్రత్యేక అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల పోలింగ్ విధులకు నియమితులైన సుమారు 2,500 మంది అధికారులు, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడమే ఈ ఏర్పాట్ల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆదివారం జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల్లో ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, పోలింగ్ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాధారణ పోలింగ్ రోజున విధుల నిర్వహణలో ఉండే కారణంగా ఓటు వేయడానికి ఇబ్బంది కలగకుండా ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించారు. ఇందుకోసం ఆయా మండలాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన బ్యాలెట్ పత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదివారం గంగవరం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు చేపట్టిన ఏర్పాట్లు, ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ, ఎన్నికల సిబ్బందికి కల్పించిన సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అర్హులైన ప్రతి ఎన్నికల సిబ్బందికి అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో కూడా ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఉదయం నుంచే వివిధ మండలాలకు చెందిన పోలింగ్ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలకు చేరుకుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు కల్పించిన సౌకర్యాలపై ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో పోలింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని, వారు తమ విధులను నిర్వర్తించే క్రమంలో వ్యక్తిగత ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ ముఖ్యమైనదని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది కూడా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు ఏర్పాట్లను చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది సమన్వయంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ఎన్నికల ప్రక్రియ విజయవంతానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ కోరారు.

చిన్నమట్లపల్లి, అన్నవరంలో కూటమి అభ్యర్థుల జోరైన ప్రచారం

- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్న అభ్యర్థులు.. ప్రచారంలో పాల్గొన్న కూటమి నాయకులు



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కూటమి అభ్యర్థులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. చిన్నమట్లపల్లి ఎంపీటీసీ పరిధిలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి వాళ్ల విష్ణుప్రియ, ఎంపీటీసీ అభ్యర్థి సోడి జోగారావు ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేశారు. అదేవిధంగా రేఖపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని అన్నవరం కమ్మరగుంపులో కూటమి బలపరిచిన టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిని పాయం రమాదేవి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆమె ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. గ్రామాల్లో ఇంటింటి ప్రచారంతో ఎన్నికల సందడి మరింత పెరిగింది.